

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం fb.com/vaartha

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-2-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 19 పేజీలు: 12 వెల: 6.50


అధ్యక్ష ఎన్నికల సర్వేలో జెలెన్‌స్కీకి 57% రేటింగ్ 5లో

'సంగమం' నీరు తాగేందుకు సరైనదే: యుపి సిఎం

# ప్రకృతి సేద్యంతో మరింత వృద్ధి



## ● అమెరికా సంస్థల సహకారం తీసుకుంటున్నాం ● రైతు సాధికార సంస్థతో త్వరలో ఒప్పందం ● 28-29 నాటికి 50 లక్షల ఎకరాల్లో అమలు ● రైతుల సహకారంతో సేద్యంలో కొత్త పుంతలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో వ్యవసాయరంగం కీలక ఆర్థిక వనరని రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ రంగంలో విస్తారమైన ఉత్పత్తులు, గణనీయ లాభాలను తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలను సాధించుకోవాలనుకుంటున్నామన్నారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడుల సహకారాన్ని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రమోట్ చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగవుతోంది. 2028-29 నాటికి రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి.. తద్వారా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం సాగయ్యేలా చూడాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. ఈ గమ్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం వివిధ దిశల్లో ప్రయత్నాలు చేస్తోంది. రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరిస్తోంది. మరోవైపు ఈ రంగంలో ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు రైతుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు వివిధ సంస్థలతో కలిసి పనిచేయనుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల దావోస్ పర్యటనలో పలు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఎపితో కలిసి పనిచేసేందుకు రావాలని పలు సంస్థలను ఆహ్వానించారు.

ఈక్రమంలో చంద్రబాబుతో దావోస్‌లో భేటీ అయిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు ఎపికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకలిశారు. పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఛైర్మన్ క్రేయిగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వైజర్ గినా మెగ్‌కార్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సిఇఒ కీత్ అగోడా ముఖ్యమంత్రితో సచివాలయంలో సమావేశం అయ్యారు. దావోస్ సమావేశానికి కంటిన్యూ మీటింగ్‌గా జరిగిన నేటి సమావేశంలో రానున్న రోజుల్లో కలిసి పనిచేసే అంశాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం, రైతు నుండి వినియోగదారు వరకు ఎండ్‌టుఎండ్ అనుసంధాన వ్యవస్థను రూపొందించడం, మార్కెట్ డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయడంపై ఈ సంస్థలు సహాయపడనున్నాయి.

పబ్లిక్, ప్రైవేట్ సంస్థల నుంచి ఆర్థిక సాయాన్ని అందిచేందుకు సహకారాన్నిస్తాయి. ప్రకృతి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రమోట్ చేస్తాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన రైతు సాధికార సంస్థతో పెగాసస్ >>2

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తా



## బిజెపి ఎల్‌పి సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక

## డిప్యూటీ సిఎంగా పర్వేష్ సింగ్ వర్మ, అసెంబ్లీ స్పీకర్‌గా విజేంద్ర గుప్తా, మంత్రులుగా ఆరుగురు ఎంపిక

## నేడు రామ్‌లీలా మైదాన్‌లో ప్రమాణం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశరాజధాని కేంద్రపాలితప్రాంతర ఢిల్లీ ముఖ్యమంత్రిగా బిజెపి మహిళానేతనే ఎంపికచేసింది. విద్యార్థిదశనుంచే బిజెపి రాజకీయాల్లో కొనసాగిన రేఖాగుప్తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిజెపి శాసనసభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాదాపు రెండున్నరదశాబ్దాల తర్వాత ఢిల్లీ మళ్లీ బిజెపి పాలనలోకి వచ్చింది బిజెపి పరంగా రెండోమహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా కాగా ఢిల్లీని పాలించిన మహిళా ముఖ్యమంత్రుల్లో నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా నిలిచారు. 15ఏళ్లపాటు కాంగ్రెస్ నాయకురాలు షీలాదీక్షిత్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆ తర్వాత సుష్మస్వరాజ్ బిజెపినుంచి సిఎంగా పాలనచేస్తే ఆతర్వాత అదికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ చివరి రోజుల్లో ముఖ్యమంత్రిగా అతిశిమర్లేనా కొనసాగారు. ఇపుడు నాలుగోమహిళా సిఎంగా రేఖాగుప్తా ఎన్నికయ్యారు. షాలిమార్‌బాగ్‌నుంచి ఎన్నికల్లో గెలిచి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. రేఖాగుప్తా ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యదర్శిగా, బిజెపి మహిళామోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగాకూడా ఉన్నారు. >>2

## డబ్బున్న దేశానికి 21 మిలియన్ డాలర్లు ఎందుకివ్వాలి?

### భారత్‌పై ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో వృధా వ్యయం కట్టడికోసం రూపొందించిన డోజ్ విభాగం నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. భారత్‌లోజరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్ల ఫండ్‌ను ఇటీవల ఈ విభాగం రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించారు. అమెరికా పన్నుచెల్లింపుదారుల సొమ్ము ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నించారు. ఫ్లోరిడాలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ భారత్‌కు మేం ఎందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలి వారి వద్ద చాలాడబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలుచేస్తున్న దేశాల్లో అది ఒకటి. ఆవిషయంలో అమెరికా ఎప్పుడూ భారత్‌ను చేరుకోలేదు. నాకు ఆదేశంపట్ల చాలా గౌరవం ఉంది కానీ వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా మనదేశంలో ఓటర్ల పరిస్థితి ఎలాఉంది అని ట్రంప్ ఎదురు ప్రశ్నలు వేసారు. ఇతరదేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విదిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ నేతృత్వంలోని డోజ్ ఈనెల 16న జాబితా ప్రకటించింది. అందులో భారత్‌కు ఉద్దేశించిన నిధులను కూడారద్దుచేసినట్లుప్రకటించింది. బంగ్లాదేశ్,నేపాల్‌లకు కేటాయించిన ఫండ్స్ కూడా రద్దుచేసింది.

# ఆధ్యాత్మిక పర్యాటకంలో ఎపి టాప్



బుధవారం తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్‌పో 2025 ముగింపుసదస్సులో మంత్రి లోకేష్

## రాష్ట్రంలో 27,105 ఆలయాలున్నాయి..

## సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత

## ఐటి సిఎక్స్ ముగింపు సదస్సులో మంత్రి లోకేష్

**తిరుమల, ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో హిందూ సంస్కృతిలో ఆలయాలు, పండుగలు,పూజలు కీలకమైన భాగమని, ఇది మనజీవన విధానమని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. దీన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత సాంకేతికత, కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)వచ్చినా మానవ సమాజాన్ని నడిపించేది ఆ దేవదేవుడేనని భక్తి తత్వం తెలియజేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా వారి ప్రయోగం విజయవంతం కావాలని చెంగాలమ్మ ఆలయంలోనో, తిరుమల శ్రీవారి ఆలయంలోనో ముందురోజు పూజలు చేస్తారని ఆయన గుర్తుచేశారు. నమ్మకం మాత్రమేగాక ఇదొక విజయమన్నారు. అందుకే ప్రజల్లో భక్తిభావాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు, దేవాలయ వ్యవస్థలు, సంస్థలు కృషి చేయాలని సూచించారు. తిరుపతిలో జరుగుతున్న అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్ ఫో(ఐటిసిఎక్స్)2025 ముగింపుసదస్సు బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి నారాలోకేశ్ హాజరై ఆధ్యాత్మికత, భక్తిభావం, ఆలయాల ప్రాశస్త్యం గురించి చక్కగా వివరించారు. వాట్సాప్ ద్వారా ఆలయాల సేవలు, డ్రోన్ నిఘా వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలతో మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుకుంటూ, ఆలయాల పాలనావ్యవస్థను ఆధునీకరించడంలో రాష్ట్రప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సానుకూల నాయకత్వం, పరివర్తనాత్మక మార్పును తీసుకురాగలదనడానికి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు నిదర్శనమన్నారు.

వేంకటేశ్వర నిత్యఅన్నదాన పథకాన్ని తిరుమలలో 1985లో ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. ఈ పథకాన్ని రామారావు కోటి కార్పస్ ఫండ్‌తో ప్రతిరోజూ 2వేలమంది యాత్రికులకు అన్నదానంతో ప్రారంభించారన్నారు. 2001లో చంద్రబాబు ప్రాణదానం ట్రస్ట్ ఏర్పాటుచేసి, ఔట్‌ఫేషెంట్, ఇన్‌ఫేషెంట్ చికిత్సలు, శస్త్రచికిత్సలు, మందులు, భోజనం వంటి సదుపాయాలను ఈ ట్రస్ట్ అందిస్తోందన్నారు. ప్రస్తుతం 440 కోట్లతో ఈ ట్రస్ట్ విస్తృతమైన సేవలందిస్తోందన్నారు.

**ఆధ్యాత్మిక పర్యాటకరంగంలో అగ్రగామి:**

గ్లోబల్ ఆలయాల నిర్వహణ వ్యవస్థ,విధాన రూపకర్తలు, నిపుణులను ఒకేచోట చేర్చడంలో ఈ కార్యక్రమం మైలురాయిగా నిలుస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. మొన్న ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద జరిగిన పవిత్ర మహాకుంభమేళాకు హాజరైనందుకు నేను ఎంతో ఆనందించానన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మికంగానేగాక ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా అందిపుచ్చుకోవడంలో ముందున్నాయనడానికి ఐటిసిఎక్స్ >>2

## మిర్చి రైతులను ఆదుకోండి

### కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులను ఆదుకునేలా చర్యలుమిర్చి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని సిఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. మార్కెట్ జోక్యం ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు. సాగు వ్యయానికి, విక్రయధరకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని కోరారు. 50 శాతం నిష్పత్తిలో కాకుండా వందశాతం నష్టాన్ని కేంద్రం భరించాలని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవాలని చంద్రబాబు కోరారు రాష్ట్రంలోని మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని, ప్రస్తుతం ఉన్న కేంద్రం మద్దతు ధరను కూడా పెద్ద ఎత్తున పెంచాలని కేంద్రాన్ని కోరారు.. ఈ విషయంలో కేంద్రానికి ఇప్పటి వరకూ నాలుగు లేఖలు రాయడం జరిగిందన్నారు. అయితే గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13,600/ లు మాత్రమే ఉందని ఆయన తెలిపారు.

కేవలం గత రెండేళ్ల మాత్రమే అంతర్జాతీ >>2

## గగన్‌యాన్ జి1 కోసం సి32 దశ మోటార్ ఇంజిన్ సిద్ధం

2లో

## ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీలు

**విజయవాడ.ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఓపీ కౌంటర్లు పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఔషధాలు అందుబాటులో ఉన్నాయా ? లేవా ? అని ఆరా తీశారు. స్ట్రెచర్లు, వీల్ ఛైర్లపై రోగులను తీసుకెళ్లే సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే నియామకాలు చేపడతామన్నారు. సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన ఆసుపత్రి సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపడుతున్నామంటున్న మంత్రి సత్యకుమార్ రోగులతో ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నాను. ఆస్పత్రిలో శుభ్రత చాలా బాగుంది. సిబ్బంది ఓపికగా పని చేస్తున్నారు. మంచి ఆహారం అందిస్తున్నారు.

కొంత సిబ్బంది కొరతఉంది. దానికోసం నియామకాలు చేపడుతున్నాం. వాస్తవానికి గతం కంటే పరిస్థితులు మెరుగయ్యాయి. మరిన్ని సదుపాయాల కోసం కృషిచేస్తాం. డాక్టర్లు అందరూ పేషెంట్లతో ఎలా వ్యవహరిస్తున్నారని వాళ్లను అడిగి తెలుసుకున్నాను. సిబ్బంది తమను చాలాబాగా చూసుకుంటున్నారని తెలిపారు. ఒపి సేవలు త్వరితగతిన జరుగుతున్నాయ >>2



బుధవారం సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# ఇక మెరుగైన పౌరసరఫరాలు

## ఇప్పటిదాకా 32 లక్షల మె.ట. ధాన్యం కొనుగోలు

### రూ. 7,522 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం: మంత్రి నాదెండ్ల

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు అందిస్తున్న సేవల్లో లోపాలను గుర్తిస్తూ మరింత మెరుగైన సేవలందించేందుకు డీఎస్వోలు, డీఎంలు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరులోని సివిల్ సప్లై భవన్‌లో మంత్రి అధ్యక్షతన బుధవారం ఉదయం సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అధికారులందరూ కలిసి టీం స్పిరిట్‌తో పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజలకు జవాబుదారీతనం పెంచే విధంగా పనిచేయాలని, ఇక్కడ సివిల్ సప్లై కార్పొరేషన్ సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ రెండు >>2

# ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి19, ప్రభాతవార్త ప్రతినిధి:** సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రేపు జరగనున్న ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. ఢిల్లీలో చంద్రబాబు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. హోం మంత్రి అమిత్ షా, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో భేటీ అయ్యే అవకాశం ఉంది.

**రాష్ట్ర పరిస్థితులపై ఢిల్లీ పెద్దలతో చర్చలు**

రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, ఇతర సాయం పై అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ కానున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తో భేటీలో పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదల గురించి చర్చించనున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థంతో నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక సాయం పై చర్చించే అవకాశం ఉంది. కేంద్ర >>2

# రాష్ట్రంలో బతకలేని రైతు

## కర్షకుల కష్టాలను పట్టించుకోని సిఎం చంద్రబాబు

### అక్రమ కేసులకు మూల్యం తప్పదు..

### గుంటూరు మిర్చియార్డులో రైతుల కష్టాలను పరిశీలించిన మాజీ సిఎం జగన్

### 'కోడ్' ఉల్లంఘించారని జగన్ సహా పలువురిపై కేసులు నమోదు



బుధవారం గుంటూరు మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**గుంటూరు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త ప్రతినిధి, :** వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి గుంటూరులోని మిర్చి యార్డులో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్న రైతులతో మాట్లాడేందుకు అదే విధంగా వారి సమస్యలను తెలుసుకోవడానికి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి శ్రేణులు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జగన్ వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. జగన్ మిర్చి యార్డ్ లోకి వెళ్లి అక్కడి రైతులకు కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన మిర్చి పంటకు కనీసం రూ.10 నుంచి రూ.11 వేల గిట్టుబాటు ధర కూడా రావడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.21 నుంచి రూ.27వేల వరకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తుచేశారు. గిట్టుబాటు ధర లభించక మిర్చి రైతులు విలవిల్లాడిపోతున్నారని కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అన్ని విధాల విఫలమైందని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించక అయిన కాడికి అమ్ముకొని నష్టాల పాలవుతున్నారని కనీసం ఈ జిల్లాలో యార్డుకు కూతవేటి దూరంలోని ఉన్నా సిఎం చంద్రబాబు నాయుడుకు మిర్చి ధరల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా రైతులకు భరోసా ఇవ్వలేకాపోయింది అని అన్నారు. తన ప్రభుత్వం భయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, దిగుబడి >>2

# రాష్ట్రాలకు 1,554.99 కోట్ల విపత్తు సాయం

## ● ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు ● తెలంగాణకు రూ. 231.75 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** గత ఏడాది సంభవించిన తుఫాను, వరదలతో నష్టపోయిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. ఈ వరద సాయం కింద వివిధ రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్రం అదనంగా కేటాయించిన మొత్తం రూ.1554.99 కోట్ల రూపాయలను విడుదల చేయనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ బుధవారం నాడు 5 రాష్ట్రాలకు రూ.1554.99 కోట్ల అదనపు సాయాన్ని ఆమోదించింది. 2024లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు నాగాలాండ్, ఒడిశా, త్రిపుర రాష్ట్రాల్లో సంభవించిన విపత్తులకుగానూ కేంద్రం ఆయా రాష్ట్రాలకు విపత్తు సాయంపై నిర్ణయం తీసుకుంది. ఎపి, తెలంగాణలో ఆకస్మిక వరదలు రావడం సహా కొండ చరియలు విరిగి పడటం లాంటి ప్రకృతి విపత్తులు జరిగిన రాష్ట్రాలకు కలిపి నిధులు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు, రూ. తెలంగాణకు రూ.231.75 కోట్లు, త్రిపురకు రూ. 288.93 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకుంది. విపత్తులు సంభవించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు విపత్తు నష్టం అంచనాకు మంత్రులు, అధికారుల బృందాలను పంపి రిపోర్ట్ తెప్పించింది. ఆ వివరాలు పరిశీలించిన కమిటీ ఆయా రాష్ట్రాల్లో సంభవించిన నష్టానికిగానూ అదనపు వరద సాయంపై >>2



బుధవారం పూణెలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

>> 50 ఏళ్ల రేఖా 1974 హర్యానాలోని జింద్ జిల్లాలోని నందగఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి భారతీయ స్టేట్‌బ్యాంకులో అధికారి. రేఖ కుటుంబం 1976లోనే ఢిల్లీకి మకాం మార్చింది. అప్పటికి ఆమె వయసు రెండేళ్లుమాత్రమే. రేఖ గుప్తా ప్రాథమిక విద్యనుంచి ఉన్నత విద్య మొత్తం ఢిల్లీలోనే పూర్తిచేసారు. బాల్యంలోనే రాష్ట్రీయ స్వయంసేవక్‌సంగ్ విద్యార్థి విభాగం అఖిలభారతీయ విద్యార్థిపరిషత్‌లో చేరారు. ఆ తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్నపుడు ఆమె దౌలత్‌రామ్ కళాశాలలో కార్యదర్శిగా ఎన్నికల్లో విజయం సాధించారు. 1995-96లో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రేఖ న్యాయశాస్త్రంలో ఎల్‌ఎల్‌బి పూర్తిచేసారు.

చదువు అనంతరం రేఖగుప్తా 2003-04లో బిజెపి యువమోర్చా ఢిల్లీ యూనిట్‌లోచేరి కార్యదర్శి పదవినికూడా చేపాట్టారు. 2007లో ఉత్తర పీతంపుర డివిజన్‌నుంచి కౌన్సిలర్ అయ్యారు. 2007-09లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మహిళా సంక్షేమం, శిశుఅభివృద్ధి కమిటీకి రెండేళ్లు ఛైర్‌పర్సన్‌గా కొనసాగారు. 2009లో ఢిల్లీ బిజెపి మహిళామెర్చా ప్రధానకార్యదర్శి. 2010లో బిజెపి ఆమెకు జాతీయ కార్యవర్గసభ్యురాలి హోదాను కల్పించింది. రేఖా గుప్తా ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని రెండుసార్లు ఓటమి చవిచూసారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్‌బాగ్ స్థానం నుంచి పోటీచేసారు. ఆప్‌కు చెందిన వందన కుమారిచేతిలో సుమారు 11వేల ఓట్లతేడాతో ఓటమిచవిచూసిన రేఖా రెండోసారి కూడా 3400 ఓట్లతేడాతో ఓటమి పాలయ్యారు. అయితే 2025 అసెంబ్లీ ఎన్నికల్లో అదే వందన కుమారిని 29వేల పైచిలుకు ఓట్లతేడాతో ఓడించి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. రేఖాగుప్తా ఎంపికను చివరి నిమిషంవరకూ గోప్యంగానే ఉంచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో అనుసరించిన వ్యూహాన్నే ఢిల్లీకి కూడా బిజెపి వర్తింపచేసింది. అలాగే బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళా సిఎం ఎవ్వరూ లేకపోవడంతో ఢిల్లీకి మహిళా సిఎంను నిలబెట్టాలన్న వ్యూహంతోనే రేఖాగుప్తాను ఎంపికచేసారు. దీనికితోడు పార్టీ రాజకీయాల్లో విద్యార్థి దశనుంచి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న గుప్తాను అనూహ్యంగా విజయం వరించింది. మొదటిసారి ఎమ్మెల్యే కావడం ఆపై వెనువెంటనే సీఎం పదవి ఆమెను వరించడంతో పార్టీశ్రేణులు కూడా ఆమెను అభినందిస్తున్నాయి.

**డిప్యూటి సిఎంగా పర్వేశ్‌సింగ్ వర్మ**

కాగా సిఎంగా మహిళా అభ్యర్థిని ఎంపికచేసిన బిజెపి డిప్యూటి సిఎంగా కేజ్రివాల్‌పై గెలిచిన పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మను ఎంపికచేసారు. అలాగే స్పీకర్‌గా విజయేంద్రగుప్తాను ఎంపికచేసినట్లు బిజెపి హైకమాండ్ వెల్లడించింది. పరిశీలకులుగా మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్, పార్టీ జాతీయ కార్యదర్శిల సమక్షంలోనే జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా రేఖాగుప్తాను ఎన్నుకున్నారు. ఇక గవర్నర్ వికె సక్సేనాను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరతారు. సిఎంతోపాటు సుమారు ఆరుగురు కేబినెట్‌మంత్రులుగా ప్రమాణంచేస్తారని తేలింది. మధ్యాహ్నం 12.30 గంటలకు రామ్‌లీలామైదాన్‌లో ప్రముఖులు సమక్షంలో ప్రమాణస్వీకార వేడుకలు జరుగుతాయి.

**ప్రధానిమోడీ, అమిత్‌షాల హాజరు**

కాగా ప్రమాణస్వీకార సభకు ప్రధానిమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఇతర కేంద్ర మంత్రులతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ సీనియర్ నాయకులతోపాటు పారిశ్రామికవేత్తలు, బాలివుడ్ నటులు, ఇన్వెస్టర్లు అందరూ హాజరవుతున్నారు. సుమారు 50వేలమందికిపైగా ఈ రామ్‌లీలామైదాన్ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా. ఇందుకు సంబంధించి ఢిల్లీయంత్రాంగం ఇప్పటికే భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లుచేసింది.

## కృష్ణపట్నం భూముల బదలీకి ఉత్తర్వులు

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** చైన్నై బెంగుళూరు పారిశ్రామిక నడవా పరిధిలోని కృష్ణపట్నం నోడ్‌కు సంబంధించిన 2500.4 ఎకరాలను ఏపీఐఐసీ నుంచి ప్రత్యే వాహక నౌక కు ఔట్‌రైట్ సేల్స్ విధానంలో బదిలీ చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ భూములకు సంబంధించి ఇండియన్ స్టాంప్ చట్టం సెక్షన్ 9 ప్రకారం వర్తించే మినహాయింపులను పరిశీలించాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 2139.15 ఎకరాలను బదిలీ చేసేందుకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ భూముల బదిలీకి నిర్దేశించిన రూ.34 కోట్లు స్టాంపుడ్యూటీ కింద మినహాయింపులిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది.

## ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

>> వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మిర్చి రైతుల సమస్యలపై సిఎం మాట్లాడనున్నారు. మిర్చి ధర పతనంతో కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే చంద్రబాబు లేఖలు రాశారు. ఈ రాత్రికి సిఎం తిరిగి అమరావతి చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన కారణంగా గురువారం జరగాల్సిన కేబినేట్ భేటీ వాయిదా పడింది.

## ప్రకృతి సేద్యంతో మరింత వృద్ధి

>> క్యాపిటల్ అడ్వజైర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థలు ఎంవోయూ చేసుకోనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అవకాశాలను, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని.. ఆరోగ్యంపై శ్రద్ధపెరుగు తోందని అన్నారు. తాము తీసుకునే ఆహారంపై వారు అవగాహన కోరుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్, ట్రేసబులిటీ అనేది కీలకం కానుందని అన్నారు. ఆ దిశగా తాము రైతులను, ఉత్పత్తి దారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రకృతి సేద్యం తన కల అని సిఎం చెప్పారు. రైతుల్లో చైతన్యం తెచ్చి అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం అని అన్నారు. దీనికి సహకరించాల్సిందిగా ఆ సంస్థల ప్రతినిధులను కోరారు. మేము వ్యవసాయంలో జాతీయ స్థాయిలో అన్ని సాగుపద్దతుల్లోను, ఉత్పత్తిరంగంలో ముందంజన ఉండాలనుకుంటున్నాం, ఇందుకు మీ సహకారం ఇవ్వాలని పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్‌ను సిఎం చంద్రబాబునాయుడు కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్ననాయుడు పాల్గొన్నారు.

## ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీలు

>> న్నారు. మందులు తీసుకునే దగ్గర కాస్త క్యూ ఉంది. దాని నివారణకు మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి సంక్లిష్ట వ్యాధుల నియంత్రణ, నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గుల్లియన్ బారీ సింద్రోమ్ (జిబిఎస్) విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల (జిజిహెచ్)లో తగిన వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి సత్య కుమార్ యాదవ్ మీడియాకు తెలిపారు. జిబిఎస్ కేసుల వివరాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి, ఈ వ్యాధి సోకడానికి, విస్తరించడానికి గల కారణాలను గుర్తించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ఈ వ్యాధి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో గత ఏడాది పది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 301 కేసులు నమోదుకాగా, వీటిలో అధిక మొత్తంలో 115 కేసులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదవ్వడానికి కారణం ఆ ఆసుపత్రిలో న్యూరాలజీకి సంబందించిన అన్ని రకాల వైద్య సేవలు, ఔషదాలు అందుబాటులో ఉండటమేనన్నారు. అదే విధంగా ఈ ఏడాది జనవరిలో 43 కేసులు నమోదు కాగా వారిలో 17 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జిబిఎస్ వ్యాధి బారిన పడిన వారికి తగిన వైద్య సేవలు అందజేసేందుకు అవసరమైన ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, ఏఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక పేషంట్ కి రోజుకి ఐదు ఇంజక్షన్లు ఐదు రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందని, బహిరంగ మార్కెట్ లో ఈ ఇంజక్షను ఖరీదు దాదాపు రూ.20 వేల వరకూ ఉందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో దీన్ని ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఎన్.టి.ఆర్.వైద్య సేవ పథకం క్రింద కూడా ఈ వ్యాధి కవర్ చేయబడుతున్నదన్నారు.

## ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

**వెంకటగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్తం** తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థినికి గర్బవతిని చేసిన ఇద్దరిపై వెంకటగిరి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 10వ తరగతి చదువుతున్న తన కూతురును ఇద్దరు వ్యక్తులు గర్భవతిని చేశారంటూ బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత కొన్నిరోజులుగా బాలిక శరీరంలో మార్పులు గమనించి బిడ్డకు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా గర్భవతిగా నిర్ధారణ చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో షేక్ రబ్బానీ (38), చినబాబు అలియాస్ బాలు (33)లను ప్రాథమికంగా నిందితులుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎవి రమణ తెలిపారు.

## మిర్చి రైతులను ఆదుకోండి

>> యంగా కొన్ని కారణాలు వల్ల మిర్చి రైతుకు రూ.20వేల ధర పలికిందన్నారు. బిందు సేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్ / స్ప్రింక్లర్లను ఏఒక్కరికీ పంపిణీచేయలేదన్నారు. దాదాపు రూ.1600 కోట్లు మేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే, తాము అధికారంలోకి వచ్చిన వెంటే రైతులకు ఆ సొమ్మును చెల్లించడం జరిగిందన్నారు. గడిచిన 10 ఏళ్లుగా మిర్చి ఉత్పత్తి ధరలపై వివరాలను సిఎం సమర్పించారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కలిసి రైతులకు సాయంపై వెంటనే జోక్యం చేసుకోవాలని కోరనుంది. ఈ క్రమంలోనే ఆయనకు సీఎం చంద్రబాబు లేఖలను రాసారు.. ఈ నేపథ్యంలో మిరప ధరలపై సీఎం చంద్రబాబు అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. గతేడాది డిసెంబరు 26 ఈ ఏడాది ఫిబ్రవరి 5,11 తేదీల్లో కేంద్రానికిలేఖలురాశారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఎంపీలు కూడా కేంద్రపెద్దలను కలసి సమస్యను వివరించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రిని కలిసి రైతుల సమస్యలపై వివరించనున్నట్లు సమావేశంలో సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.

## 1,554.99 కోట్ల విపత్తు సాయం

>> ప్రకటన చేసింది.

కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వరదలు కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు గతంలోనే ఎస్‌డిఆర్‌ఎఫ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 27 రాష్ట్రాలకు గానూ మొత్తం రూ.18,322.80 కోట్లు విడుదల చేసింది. అదే విధంగా ఎన్‌డి ఆర్‌ఎఫ్ నుంచి 18 రాష్ట్రాలకు రూ.4,808.30 కోట్లు కేంద్రం అందించింది. రాష్ట్ర విపత్తునిధి నుంచి 14 రాష్ట్రాలకుగారూ రూ.2208.55 కోట్లు, జాతీయ విపత్తు నిధి నుంచి 8 రాష్ట్రాలకుగానూ కేంద్రం ఇదివరకే రూ.719.72 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇక ఎన్డీఏ మిత్రపక్షాలలో ఎపి, బిహార్‌లకు అధిక వాటా కేటాయించారని తెలంగాణకు తక్కువ కేటాయించారని విమర్శలు చోటు చేసుకున్నాయి.



బుధవారం సమావేశమైన మూడు రాష్ట్రాల జలవనరుల మంత్రులు ఉత్తమ్, డికె శివకుమార్, నిమ్మల

### సానుకూల వాతావరణంలో చర్చించుకుందాం

## నీటి వివాదాలు పరిష్కరించుకుందాం

### మూడు రాష్ట్రాల జల వనరుల మంత్రుల ఏకాభిప్రాయం

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర జలశక్తి సంఘం ఆధ్వర్యంలోని అఖిలభారత స్థాయి ఇరిగేషన్ మంత్రుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, డికె శివకుమార్, ఉత్తమ కుమార్ రెడ్డిలు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ఒకవైపు కర్ణాటక, మరోవైపు తెలంగాణ సరిహద్దుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 3 రాష్ట్రాల సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎవరు నష్టపోకుండా మూడు రాష్ట్రాల రైతులు శ్రేయస్సు కోసం సమిష్టి నిర్ణయాల ద్వారా, సంప్రదింపుల ద్వారా కలసి కృషి చేద్దాం అన్నారు. తుంగభద్ర నీటి నిల్వ, పూడిక వంటి అంశాలతో పాటు ఇతర అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంలో రామానాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది నీటిని కాకుండా, గత పది సంవత్సరాలుగా కృష్ణానదికి వస్తున్న నీటిని చూడాలని వారి దృష్టికి తీసుకెళ్ళారు. కృష్ణా నది దిగుకు నీరు రావడం కష్టమవుతుందని ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల వంటి ప్రాజెక్టులు నిండితేనే, కిందకు నీరు వస్తుందని రామానాయుడు వివరించారు. ఈ దశలో కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ ఆయికట్టులకు నీరందించడం కష్టంగా మారిందని నిమ్మల వివరించారు. అలాగే శ్రీశైలం నాగార్జునసాగర్ జలాశయాల్లో ఉన్న నీటిని తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. తద్వారా ఇరు రాష్ట్రాల రైతులకు ఎటువంటి పంట నష్టం, తాగు నీటి ఇబ్బంది లేకుండా జూన్ వరకు ప్రణాళిక బద్దంగా పరస్పర అంగీకారంతో పనిచేయాలనుకున్నారు. తుంగభద్ర రిజర్వాయర్ పూడికతీతకు ప్రత్యామ్నాయంగా చేపట్టవలసిన చర్యలు గురించి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఎపి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలుస్తానని కోరారు. ముందు తగు ప్రతిపాదనలతో అధికారుల స్థాయిలో చర్చించి ఆ తదుపరి ముఖ్యమంత్రిని కలవొచ్చని ఆయనకు సూచించారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తి

### కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఉదయ్ పూర్ లో అఖిల భారత స్థాయిలో జరుగుతున్న రాష్ట్రాల జల వనరుల శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ప్రత్యేకంగా కలిసారు. ఆయనకు రాష్ట్ర నీటి వనరులు, జరుగుతున్న పనులు, కావాల్సిన సాయం తదితర అంశాలతో నివేదిక అందజేశారు. నివేదిక లోని అంశాలను విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రధాని మోదీ కూడా పోలవరం ప్రాజెక్ట ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటున్నట్లు చెప్పారు. త్వరలో తాను కూడా పోలవరం ప్రాజెక్ట సందర్శనకు వస్తానని హామీ ఇచ్చారు. తొలుత రామానాయుడు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు జల వనరుల శాఖ మంత్రి సి ఆర్ పాటిల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుని మూడుసార్లు సందర్శించి, పోలవరం పూర్తికి గడువును 27 డిసెంబర్ కు నిర్దేశించి నిర్దేశించినట్లు మంత్రి నిమ్మల కేంద్రమంత్రికి వివరించారు.

సాంకేతిక అంశాలకు సంబంధించి డిజైన్లను త్వరితగతిన ఆమోదించి, పంపించాలని కోరారు. అలాగే 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సిఎం రివ్యూలు చేస్తున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని, మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతామని చెప్పారు. డివాల్ నిర్మాణంతో పాటు సమాంతరంగా ఈసిఆర్‌ఎఫ్ నిర్మాణ పనులు చేపట్టే విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్యాప్1 లో ఇప్పటికే డివాల్ నిర్మాణం పూర్తయ్యిందని, ఈసిఆర్‌ఎఫ్ నిర్మాణానికి పెండింగ్ లో ఉన్న అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట నిర్మాణ వివరాలను ప్రతినెలా, కేంద్రానికి తెలియచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని, అందుకుగానూ, ప్రతి నెలా కేంద్రానికి పనుల వివరాలు పంపిస్తామని తెలిపారు.

## సిఇసిగా జ్ఞానేశ్వర్‌కుమార్ బాధ్యతల స్వీకారం

### కమిషనర్‌గా విధుల్లో చేరిన వివేక్ జోషి



బుధవారం సిఇసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జ్ఞానేశ్ కుమార్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా ఎంపికచేసిన జ్ఞానేశ్ కుమార్ బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కొత్త కమిషనర్‌గా నియమితులయిన వివేక్‌జోషికూడా ఎన్నికల కమిషనర్‌గా విధుల్లోచేరారు. 2024 మార్చినెలనుంచి ఎన్నికలసంఘంలో కమిషనర్‌గా పనిచేస్తున్న జ్ఞానేశ్ కుమార్‌ను చీఫ్‌కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ కూడా జారీచేసారు. ఇప్పటివరకూ పనిచేసిన రాజీవ్‌కుమార్ పదవీకాలం పూర్తికావడంతో ఆయన మంగళవారమే పదవినుంచి దిగిపోయారు. ఇక రెండో ఎన్నికల సంఘం కమిషనర్‌గా ఉత్తరాఖండ్ కేడర్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధు కొనసాగుతున్నారు. జోషి హర్యానాకేడర్ మాజీ ఐఎఎస్ అధికారి. ఆయన్ను కమిషనర్‌గా జ్ఞానేశ్వర్‌పనిచేసిన పోస్టులో నియమించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే ముందు ప్రధాన లక్ష్యమని, అంతే కాకుండా 18 ఏళ్లనిండిన ప్రతిపౌరుడుకూడా ఓటరుగా నమోదుచేసుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకుని తమకు నచ్చిననేతలను చట్టసభలకు ఎన్నుకునేవిధంగా అవగాహన పెంచాల్సిన కర్తవ్యం ఎన్నికల సంఘానిదేనని అన్నారు. ఎన్నికలసంఘం నిరంతరం ఓటర్లతో మమేకమై పనిచేస్తుందని ఆయన అన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 20-02-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
సప్తమి ఉ.9.59
విశాఖ మ.1.29
వర్జ్యం : సా.5.53-7.39
దు.ఉ.10.33-11.20, 2) మ.3.13-4.00
శుభసమయం : ఉ.8.15-8.40
రా.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం :** సంఘంలో గౌరవం పొందుతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి.

**వృషభం:** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. జీవిత భాగస్వామ్య సాయం అందిస్తారు.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందుల నుండి కొంతవరకు బయటపడతారు.

**కర్కాటకం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ప్రయాణాలు.

**సింహం:** అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు.

**కన్య :** రుణాలు తీరి ఊరట చెందుతారు. విలువైన సమాచారం అందుకొంటారు.

**తుల :** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి సన్మానాలు పొందుతారు.

**వృశ్చికం:** పాతమిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. ధనలాభం.

**ధనుస్సు:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**మకరం:** గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. కొత్త మిత్రుల పరిచయం.

**కుంభం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. పనులు పూర్తి.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి వత్తిడులు ఎక్కువవౌతాయి. ఖర్చులు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలో బతకలేని రైతు

>> ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతుల కష్టాలు కనిపించడం లేదని వారి బాధల పట్ల కనీసం కనికరం కూడా లేదన్నారు. రైతుల పట్ల కూటమి సర్ కార్యహరిస్తున్న తీరుపై మాజీ సిఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు సూచించారు. రాజకీయ దురుద్దేశంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఎల్లకాలం ప్రభుత్వం ఇదే ఉండదని తమ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ఎవరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తనను మిర్చి యార్డు సందర్శించకుండా అడ్డంకులు సృష్టించారని కనీసం ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన భద్రత కూడా కల్పించలేకపోయారని ఆరోపించారు. ఇవన్నీ కూడా తను గుర్తుపెట్టుకుంటానని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేయాలో తనకు తెలుసునని జగన్ హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డితో తమ ఆవేదన వ్యక్తం చేసిన మిర్చి రైతులు.. మిర్చి యార్డులో రైతులను స్వయంగా కలిసి ధరల గురించి ఆరా తీశారు. రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని జగన్ ఎదుట వాపోయారు. గతంలో మేలు రకం మిర్చి రూ.18,000 నుండి 20 వేల రూపాయల వరకు కొనుగోలు చేసేవారిని ప్రస్తుతం రూ. 10,000 రూపాయలు కూడా కొనే పరిస్థితి లేదని జగన్ వెదుట రైతులు వెల్లబుచ్చారు. యార్డులో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మరికొందరు రైతులు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. మరికొందరు రైతులు సీజన్లో మధ్యాహ్నం భోజనం కూడా సరిగా కొనసాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకు మాజీ సిఎం జగన్ వస్తున్నారని సమాచారంతో వైసీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు.

**ఎన్నికల నిబంధల ఉల్లంఘనపై కేసునమోదు :**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని పర్యటన వాయిదా వేసుకోమని పోలీసులు తెలిపినా పటించుకోకుండా మిర్చియార్డు పర్యటించినందు వల్ల ఎన్నికల కోడ్ నిబంధపై జగన్‌తో పాటు కోడాలినాని, అంబటి రాంబాబు మేరుగు నాగార్జున, అప్పిరెడ్డిలపై కేసునమోదు చేశారు.

# ఇక మెరుగైన పౌరసరఫరాలు

>> కలిసి ఒకే నిర్ణయంతో ముందుకు సాగాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు నిలబడి మెరుగుగా పనిచేయడం తద్వారా అంతిమంగా వ్యవస్థ నిలబడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తర్వాత మిల్లర్లకు వద్దు ప్రభుత్వానికే ధాన్యం అమ్ముతామనే పరిస్థితి రైతు నుంచి వచ్చిందన్నారు. ఇప్పటివరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.7,522 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 24 గంటల్లోనే రూ.7,508 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నష్టపోయి, నమ్మకాన్ని కోల్పోయిన రైతుకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం2 పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడానికి, పథకాల అమలులో పారదర్శకత పెంచేందుకు ప్రతిఒక్కరూసహకరించాలని మంత్రి నాదెండ్ల పిలుపునిచ్చారు. అందుకు ప్రజల్లో ఉన్న సందేహాలను నివృతి చేయాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. అందుకు తగ్గట్లుగా అధికారుల సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలుచేపట్టాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఆన్‌లైన్ వ్యవస్థకు సిద్ధం కావాలన్నారు. గత 25 సంవత్సరాల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేషన్ షాపు నుంచి ఒక బస్తా బియ్యం దారి మళ్లితే వెంటనే ఫోన్ వచ్చేదని, ఈ విధంగా ప్రజలకు రేషన్ మాఫియాపై అవగాహన పెంచాలని సూచించారు. దేశంలో ఇప్పటికీ చాలామంది పేదవాళ్లు ఆహారం(ధాన్యం)కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వచ్చే అకడమిక్ సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మిడ్ డే మీల్స్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు పౌర సరఫరాల శాఖ నుంచి సన్న బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందించబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సివిల్ సప్లై, తూనికలుకొలతలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు. ఇక రైతు సేవా కేంద్రాలు, రైస్‌మిల్లు మధ్య ధాన్యంతేమ శాతంలో తేడా వస్తే చర్యలు తీసకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ స్పష్టం చేశారు. నాదెండ్ల రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా రూ.7522 కోట్లు జమ చేశాం. అందులో 24 గంటల్లోనే రూ.7508 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. ధాన్యం సేకరణలో 30 వేల లారీలు, 37 వేల మంది హమాలీలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక పర్యాటకంలో ఎపి టాప్

>> నిదర్శనమన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం, టెంపుల్ టూరిజంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏటా 36-40మిలియన్ల మంది యాత్రికులు సందర్శిస్తున్నారని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 27, 105 ఆలయాలు నిలయంగా ఉందన్నారు. ఐటిసిఎక్స్ దేవాలయాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక ప్రపంచ సమాజం అన్నారు.

**అందరూ సంస్కృతిని కాపాడుకోవాలి:**

హిందూ ధర్మం సనాతనమైందని, మానవసేవే మాధవసేవగా సాటి మనుషులకు సమాజానికి సేవచేస్తే , ఆదేవుడికి సేవచేసినట్లేనని హిందూ ధర్మం చెబుతుందని మంత్రి లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. మన దేశసంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పదన్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం మన వైపు చూస్తుందని ,మన సంస్కృతిలో ఆలయాలు, పండుగలు, పూజలు ముఖ్యమైనవన్నారు. పిల్లలకు గంటలు గంటలు ఫోన్లు, ట్యాబ్‌లు ఇచ్చే పద్ధతికి స్వస్తిచెప్పాలన్నారు. ఆ సమయంలో మన పురాణాలు, మన దేవుళ్లు ,మన పండుగలు, ఆచారాలు గురించి పుస్తకాలు ఇవ్వాలన్నారు. అందరం కలసి సంస్కృతిని కాపాడుకోవాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టిలో ఆలోచించి ఆలయాల పరిపాలనను మెరుగుపరచడానికి సిబ్బంది, భక్తుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు. అర్చకుల పారితోషికం నెలకు 15వేల రూపాయలకు పెంచారన్నారు. అనంతరం ఐటిసిఎక్స్ నిర్వాహకులు మంత్రి లోకేశ్‌ను దుశ్శాలువతో సన్మానించి, శ్రీవారి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, ఐటిసిఎక్స్ టెంపుల్‌కన్వెన్షన్ వ్యవస్థాపకుడు గిరీష్‌వాసుదేవ్‌కులకర్ణి, ఛైర్మన్‌ప్రసాద్‌లాడ్, తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## ఎయు విసి ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు పలువురి అభినందనలు

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా నియమితులైన ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఏయూ విశ్రాంత అధ్యాపకులు సంక్షేమ సంఘం బాధ్యులు ఆచార్య డీబీఆర్ఎన్‌కె బెనర్జీ ఒక ప్రకటనలో నూతన వీసీ ఏయూలో సంస్కరణలు చేపట్టాలని శత వార్షికోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆచార్య రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏయూ పూర్వ వైభవం సంతరించుకొంటుందన్నారు. శాసనమండలి పూర్వపు సభ్యుడు అమ్మినేని శివరామకృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ఓఎస్‌డి డాక్టర్ నిరీక్షణకుమార్ తదితరులు రాజశేఖర్ నియామకాన్ని స్వాగతించారు.

## ఎమ్మెల్యేల అవగాహన సదస్సు వాయిదా..

### రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర

**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసన సభా భవనంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించాల్సిన ఎమ్మెల్యేల అవగాహన సదస్సు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. ఈ అవగాహన సదస్సు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తదుపరి తెలియజేస్తామన్నారు. ఈ అవగాహన సదస్సును లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా ప్రారంభించాల్సి ఉంది. మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్యనాయుడు కీల ప్రసంగం చేయాల్సివుంది.ఈ సమావేశాలను మార్చిలో శాసనసభా సమావేశాలు ముగిసిన తరువాత తిరిగి నిర్వహించే అవకాశం ఉంది.

# పనిచేసేవారిని ప్రోత్సహిస్తా!


తిరుపతిలో టిడిపి నేతలు, కార్యకర్తలతో మంత్రి లోకేశ్ సమావేశం

- కార్యకర్తలకు అండగా నిలబడాలి
- సాంకేతికతతో మదించి పదవులు
- తిరుపతిలో కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్

**తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు దేశంపార్టీలో పదవుల పంపిణీకి కొత్తవిధానం తీసుకువస్తామని, ఎక్కడకు వెళ్ళినా కార్యకర్తలను కలవడానికి ప్రాధాన్యం ఇస్తానంటూ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. పార్టీలో పనిచేసేవారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ పద్ధతిలో సాంకేతికతతో పనితీరును మదింపుచేసి, గుర్తించిన వారికి పదవులు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. పార్టీలో జాతీయ అధ్యక్షుడి నుండి బూత్‌ఇన్‌ఛార్జి, బూత్‌కమిటీ సభ్యుల వరకు "కుటుంబ సాధికార సారధి"నమోదు కావాల్సి ఉంటుందన్నారు. ఒకరోజు తిరుపతి పర్యటనకు బుధవారం ఉదయం వచ్చిన మంత్రి నారాలోకేశ్ పార్టీ కార్యకర్తలు, నేతలతో తిరుపతి కపిలతీర్థంలోని పార్టీ కార్యాలయంలో సుదీర్ఘంగా ఐదుగంటల పాటు సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు పులివర్తినాని, బొజ్జలసుధీర్‌రెడ్డి, తిరుపతినాయకులు నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, వట్టికుంటశంకరనారాయణ, సుగుణమ్మ, మబ్బుదేవనారాయణరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, రవినాయుడు,సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతి యాదవ్, బుల్లెట్‌రమణ తదితరులతో కలిసి ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం సమన్వయసమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. పార్టీలేకపోతే మనం ఎవరూ లేమని గుర్తుంచుకోవాలన్నారు. మనకు సమాజంలో గౌరవం లభిస్తుందంటే అందుకు కారణం తెలుగుదేశం పార్టీనే అన్నారు.

**- మొదట కార్యకర్తలతోనే సమావేశమవుతా:** టిడిపి కోటి సభ్యత్వంతో అతిపెద్ద కుటుంబంగా మారడానికి కార్యకర్తే అధినేత అని మంత్రి లోకేశ్ ఉద్ఘాటించారు. ఇకపై ఏ నియోజకవర్గం పర్యటనకువెళ్ళినా మొదట కార్యకర్తలతోనే సమావేశమవుతానని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా అందరికీ పదేపదే చెప్పేది ఒక్కటేనని, ఏ నియోజకవర్గంలో పర్యటించినా అక్కడి క్లస్టర్,యూనిట్, బూత్ కమిటీ సభ్యులను కలిసి మాట్లాడాలన్నారు."బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ,,మన టిడిపి యాప్, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కావాలని మంత్రి ఆదేశించారు. అందులో భాగంగానే పార్టీని బలోపేతం చేసేందుకు సగంరోజు మీతోనే గడుపుతున్నానన్నారు. పార్టీ, ప్రభుత్వం రెండు అనుసంధానమై పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో తన పాదయాత్రలో అన్నా "నేను కష్టపడ్డాను...నన్ను గుర్తించడంలేదు"అని చాలామంది నాతో చెప్పారన్నారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని, పనిచేసేవారిని ప్రోత్సహిస్తానని మరోసారి స్పష్టం చేశారు.

**-పార్టీ సుప్రీం...కూటమిని కలుపుకుని పనిచేయండి:** పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ నిర్దేశం చేశారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా జయప్రదం చేయాలని ,కూటమి పార్టీల నేతలను కలుపుకుని పనిచేయాలని సూచించారు. ఏ విషయం అయినా సమిష్టిగా చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యకర్తలకు ఏ పార్టీ చేయని విధంగా ప్రమాద బీమా 5లక్షలు రూపాయలు చేశామన్నారు. త్వరలో కార్యకర్తల ఆరోగ్యానికి సంబంధించి కూడా మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. కార్యకర్తల పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు పార్టీ కార్యాలయంలో కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామన్నారు.

**-వైసిపి దుష్ప్రచారం తిప్పికొట్టండి:** పార్టీలో గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని, మన లక్ష్యం పార్టీ బలోపేతం కావడమేనని మంత్రి అన్నారు. నేడు వైసిపికి ప్రతిపక్షహోదా కూడా లేదని, వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాలని ఆయన నేతలకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి అన్నీ అప్పులుచేసి పోయారని, అయినా ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని ,ఫెన్షన్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల వైసిపి నుండి స్వతంత్రులుగా ఉన్న 15మంది కార్పొరేటర్లతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# తిరుమల సమాచారం

## ధ్వజారోహణంతో కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా మొదలయ్యాయి. అర్చకుల వేద మంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, వినాయకస్వామి, చండికేశ్వరస్వామి, వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో మకర లగ్నంలో నందిచిత్రంతో కూడిన ధ్వజపటం అధిరోహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణివాసన్ గురుకుల్ వేదోక్తంగా ధ్వజపటం ఎగురువేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం విశేషంగా జరుగుతుంది. 27న కల్యాణోత్సవం, 28న త్రిశూలస్నానంతో ,ధ్వజావరోహణంతో ముగుస్తాయి. అనంతరం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, ఎఇఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు ఉదయగురుకుల్ పాల్గొన్నారు.

## బోర్డు సభ్యుడు రాజీనామా చేయాలి

- ఆయన తీరు బాధ్యతారాహిత్యం
- టిటిడి ఉద్యోగ, ప్రజాసంఘాలు డిమాండ్



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి చెంత సేవకునిగా, భక్తిభావంతో వ్యవహరించాల్సిన ఓ బోర్డుసభ్యుడు ఆలయం వెలుపలకు వచ్చేముందు మహద్వారం గేట్ వద్ద ఉద్యోగిపై చిందు లేయడం, దుర్భాషలాడటం మంచిది కాదని, విచక్షణారహితంగా ప్రవర్తించిన ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని టిటిడి ఉద్యోగ ,ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తితో భక్తుల పట్ల, ఉద్యోగుల పట్ల హుందాగా ఉండాల్సిన బోర్డు సభ్యుడే ఇలా వ్యవహరించడం భక్తులను కలచివేసిందని అంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సిఎంఓ కార్యాలయం టిటిడి అధికారులను సంప్రదించి సిసికెమెరా ఫుటేజీ వివరాలు ఆరా తీసిందని తెలిసింది. ఉద్యోగి పట్ల దురుసుగా, రాయలేని మాటలతో దుర్భాషలాడిన కర్నాటక బోర్డుసభ్యుడు పదవికి రాజీనామా చేయకుంటే దశలవారీగా ఆందోళనలను చేపడతామని టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు చీర్ల కిరణ్, తదతరులు హెచ్చరించారు. మహద్వారం గేట్‌లో విధుల్లో ఉన్న బాలాజీకి అండగా నిలబడతామన్నారు. టిటిడి నిబంధనలప్రకారం నడచుకోవాల్సిన విఐపిలు కూడా అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగదన్నారు. విఐపిలు కూడా దేవదేవుని దర్శనానంతరం సాధారణ భక్తులలాగే బయటకు వెళ్ళాల్సి ఉందన్నారు. అయితే బోర్డు సభ్యుడనే భావంతో మహద్వారం గేట్‌తెరవలేదని ఆయన తీరు ఉద్యోగుల అంకితభావ సేవలను కలచివేస్తోందన్నారు. ప్రభుత్వం, టిటిడి ఆయన పై చర్యలు తీసుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేస్తామని చెబుతున్నారు. కాగా ప్రజాసంఘాలు కూడా బోర్డుసభ్యుడి వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమలలో తప్పిపోయిన భక్తుడు



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు కుటుంబసభ్యుల నుండి క్యూలైన్‌లో తప్పిపోయాడు. నాలుగురోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరుజిల్లా పోనంగిగ్రామానికి చెందిన దాసరి సీతారం కుటుంబంతో ఈనెల 15న తిరుమలకు వచ్చారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో స్కానింగ్ వద్ద తప్పిపోయాడు. కుటుంబసభ్యులు దర్శనానంతరం వెలుపలకు వచ్చారు. ఆయన ఆచూకీ తెలియలేదు. తిరుమల,తిరుపతి ,స్వగ్రామంలో వెదికినా కనబడలేదు.దీంతో కుటుంబసభ్యులు తిరుమలకు వచ్చి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల సిఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. ఆ చూకీ తెలిస్తే 9440696769, 9440796771 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

# పోలీసులను బెదరించడాన్ని జగన్ మానుకోవాలి

### - రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తమను ఇబ్బందులు పెట్టిన పోలీసులు ఎక్కడ ఉన్నా తీసుకొచ్చి బట్టలు ఊడదీసి నిలబెడతామంటూ మాజీ సీఎం జగన్ పోలీసులను బెదిరించడాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారులసంఘం రాష్ట్రఅధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడారు. 8 నెలల క్రితం ఉన్న పోలీసులే ఇప్పుడూ ఉన్నారనే విషయాన్ని జగన్ గ్రహించాలన్నారు. రాజకీయాలకు, వర్గాలకు, రాగద్వేషాలకు అతీతంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. చట్టం, న్యాయం, ధర్మం, సత్యానికి సంకేతాలైన ఆ నాలుగు సింహాలకే పోలీసులు సెల్యూట్ చేస్తారు తప్ప చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వారికి చేయరనే సంగతి జగన్ తెలుసుకోవాలని సూచించారు. పోలీసులపై ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేయొద్దంటూ హితవు పలికారు. పోలీసులపై చేసిన బెదిరింపు వ్యాఖ్యలను జగన్ వెంటనే వెనిక్కి తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.ఆయన స్థాయిని ఎంటో గుర్తించుకోవాలన్నారు.ఓ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి, మాజీ ముఖ్యమంత్రికి మాట్లాడే తీరు నేర్పించాల్సిరావడం ఇబ్బందికరంగా ఉందన్నారు. చట్టాలపై ఆయనకు ఏ మాత్రం గౌరవం లేదనే విషయాన్ని ఈ వ్యాఖ్యలే బహిర్గతం చేస్తున్నాయని మండిపడింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడ దిగజారాయో చెప్పాలని డిమాండు చేసింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మిర్యాల బాలసురేష్ జి అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త** నిర్వహణ పరమైన కారణాల వల్ల సికింద్రాబాద్-దానాపూర్-సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే నెంబర్ 12791/92 ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నేటి (ఈనెల 20)నుంచి 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి.

## విజయవాడలో విశేషంగా ఆకట్టుకుంటున్న 'గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025'


గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" చీరల ప్రదర్శన

**విజయవాడ,ఫిబ్రవరి19, ప్రభాత వార్తప్రతినిధి:** విజయ వాడలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైనగ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. మహిళలు ఈ ప్రదర్శనకు భారీగానే తరలి వస్తున్నారు. స్థానిక మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఇటీవల ఈ ప్రదర్శనను ప్రారంభించారు. గ్రామీణ భారతదేశ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ ప్రదర్శన ను ఇప్పటి వరకు 10 వేల మంది సందర్శించగా వివిధ వస్తువుల కొనుగోళ్ల ద్వారా రూ. 35 లక్షల ఆదాయం వచ్చిందని నాబార్డు డీజీఎం మురారీ మోహన్ బెహ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు నగర ప్రజలతోపాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వివిధ రాష్ట్రాల నుంచి ఏర్పాటైన కళాఖండాలు, వస్త్రాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి నైపుణ్యం కలిగిన చేనేత మరియు హస్త కళాకారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు ఇందులో ప్రదర్శిస్తున్నారన్నారు.. గ్రామీణ భారతదేశ అభివృద్ధి కోసం నాబార్డు చేస్తున్న సమగ్ర కృషిని నగర ప్రజలు మరింత ఆదరించాలన్నారు. ఈ రాష్ట్ర స్థాయి ప్రదర్శన ఈనెల 24 ఆదివారం తో ముగియనున్నదని నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీజీఎం విజ్ఞప్తి చేశారు.ఈ ప్రదర్శనలో రాష్ట్ర సాంప్రదాయ హస్తకళల్లో మంగళగిరి పట్టు, ఉప్పాడ, పొందూరు ఖద్దరు, తెలంగాణ ప్రత్యేకతలైన నారాయణపేట సిల్క్ కాటన్ చీరలు ఉన్నాయన్నారు. అలాగే శ్రీకాకుళంలోని సిక్కోలు కాటన్ చీరలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. తిరుపతికి చెందిన బాలాజీ హస్త కళలు, ధర్మవరం పట్టు చీరలు, శ్రీ బాలాజీ కాటన్ సిల్క్, కొండపల్లి, ఏటికొప్పాక వంటి సంప్రదాయ కళాఖండాలతో పాటు, తమిళనాడు నుండి ప్రత్యేకంగా వచ్చిన నవసారిగై ఎప్కో పట్టు చీరలు కూడా ఈ ప్రదర్శనలో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

## అమరావతిలోని 13 గ్రామాల్లో ఒకేరోజు రూ.12,422 కోట్లతో టెండర్లు

**రాజంపేట అర్బన్ ఫిబ్రవరి19 ప్రభాతవార్త** అమరావతి రాజధాని అభివృద్ధి దేశంలో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. అటు ప్రపంచ బ్యాంకు నిధులు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్,ఇటు కేంద్ర ప్రభుత్వం నిధులు ఖరారు కావడంతో రాజధాని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసింది. అందులో భాగంగా ఏపీ సి ఆర్ డి ఏ ఒకే రోజు 14 గ్రామాలలో 12,422 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బుధవారం టెండర్లు పిలిచి రికార్డు సృష్టించింది. రాజధాని నిర్మించనున్న గ్రామాలలో ఇప్పటికే 13 గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచన ప్రభుత్వం తాజాగా ఒకే రోజు మరో 13 గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లను పిలిచింది. ఏపీ సి ఆర్ డి ఏ పరిధిలోని లింగాయపాలెం ,ఉద్దండ రాయునిపాలెం, వెలగపూడి, మందడం, కృష్ణాయపాలెం, మల్కాపురం, మందడం, అయినవోలు ,వెలగపూడి, వెంకటపాలెం, కూరగల్లు, నౌలూరు, నిడమర్రు గ్రామాలలో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించింది. పైన పేర్కొన్న భూ సమీకరణ చేసిన గ్రామాలలో మౌలిక సదుపాయాలు, లే అవుట్ల అభివృద్ధి కోసం టెండర్లు పిలిచారు. 7ఏ జోన్ పరిధిలో 1235.52 కో, 9 జోన్ పరిధిలో 2774 కోట్ల తోను,9ఏ జోన్ పరిధిలో 1817 కోట్ల వ్యయం తోను, 10జోన్ లో 1487.50 కోట్ల తోనూ,12 జోన్ పరిధిలో 2949 కోట్ల తోను,12ఏ జోన్ పరిధిలో 2159 కోట్ల రూపాయల అంచనా వ్యయంతోను అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచారు. టెండర్లలో పాల్గొనేందుకు నేటి నుంచి మార్చి 6 చివరి గడువు కాగా, అదే రోజున సాంకేతిక బిడ్ కూడా తెరుస్తారు. ఈ మేరకు ఏపీ సి ఆర్ డి ఏ కమిషనర్ టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆదివాసీ మహిళలపై పెరుగుతున్న హింసను సంఘటితంగా ప్రతిఘటించాలి

### ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత


దళిత స్త్రీశక్తి 18వ వార్షిక సభలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్,టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** దళిత ,ఆదివాసీ మహిళలపై పెరుగుతున్న హింసను సామాజిక వాదులంతా సంఘటితంగా ప్రతిఘటించాలని ఏపీ ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్,టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత వ్యాఖ్యానించారు.దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో డీఎస్ ఎస్ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షతన బుధవారం విజయవాడలోని అంబేడ్కర్ భవన్ లో డీఎస్ఎస్ 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసి మహిళలపై జరుగుతున్న హింస, మానసిక ఆరోగ్యం వివిధ కోణాలు అంశంపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎపి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సునీత మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం దళిత మహిళలపై హింసాత్మక ఘటనలు పెట్రేగి పోతున్నాయని చెప్పారు. 23 శాతం మహిళలపై లైంగిక దాడులు జరుగుతుంటే కేవలం 2 శాతం మాత్రమే నిందితులకు శిక్షపడుతుందని సునీత అన్నారు. మహిళలపై హింసలో ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే తెలుగు రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. అయినప్పటికీ ప్రతినిత్యం స్త్రీలపై హింస పెరిగిపోతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి హింసాత్మక ఘటనలపై దళిత స్త్రీ శక్తి పోరాడటం అభినందనీయమని అన్నారు. 1989 అట్రాసిటీ యాక్ట్ ప్రకారం అందాల్సిన న్యాయం అందడం లేదని చెప్పారు. అందుకే దళిత స్త్రీలపై దాడులు పెరగడానికి కారణమని చెప్పారు. దళితుల జనాభా పెరుగుతున్నా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మాత్రం తగ్గుతున్నాయని వివారించారు. హక్కుల పరిరక్షణ కోసం సంక్షేమ పథకాల అమలు కోసం డిఎస్ఎస్ కృతనిచ్చయంతో పనిచేయడం స్ఫూర్తినిస్తుందని ఆమె పేర్కొన్నారు. పేబ్యాక్ టు ద సొసైటీ నినాదాన్ని ప్రతి ఒక్కరు ఆచరిస్తేనే దళిత స్త్రీల ఆర్థిక, సామాజిక ఎదుగుదల సాధ్యమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ సరస్వతి అయ్యర్ మాట్లాడుతూ స్త్రీలపై హింస అనేక ప్రభావాలకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మానసికంగా ఎంతో ప్రభావానికి గురిచేస్తుంది వివరించారు. ఇలాంటి సంఘటన వల్ల స్త్రీలు మానసిక రుగ్మతలకు గురవుతూ తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతుంటారని పేర్కొన్నారు. ఇందులో దళిత బాలికలు, మహిళలే ఎక్కువగా బాధితులని ఆమె వివరించారు. మానసిక ఆరోగ్య సామాజిక రుగ్మతల నుంచి బయటపడేందుకు దళిత స్త్రీ శక్తి విశేషకృషిని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ప్రతి ఐదు మందిలో ముగ్గురు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు ఇటీవల వచ్చిన నివేదిక వివరిస్తుందని ఇందులో స్త్రీలే ఎక్కువగా బాధితులని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతిని ప్రతి విషయంలోనూ వ్యక్తులు కృంగుబాటుకు గురవుతారని పేర్కొన్నారు. ఈ సంఘటనలను అధిగమిస్తేనే మహిళా సాధికారత సాధ్యమని అందుకు డిఎస్ఎస్ కృషిని అభినందించారు. ఝాన్సీ గెడ్డం తన అధ్యక్ష ఉపన్యాసంలో గత 19 సంవత్సరాలుగా దళిత ఆదివాసి స్త్రీలు బాలికలపై అరాచకాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. అనేక ఒడిదొడుకులు, ఒత్తిడుల మధ్య దళిత స్త్రీ శక్తి 20 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తనదైన పాత్రను పోషిస్తూ ముందుకు సాగుతున్నదని వివరించారు. దళిత, ఆదివాసి స్త్రీలపై జరుగుతున్న అనేక హింసాత్మక ఘటనలు ప్రతిఘటిస్తూ బాధితులకు న్యాయం చేకూరే దిశగా పోరాడిందని అన్నారు. ఈ సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా ముందుకు వెళుతున్నామని అన్నారు. సీనియర్ పాత్రికేయులు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలు హింసాత్మక ఘటనలతో ఉండకూడదని సూచించారు. హింస ఎవరు చేసినా సహించకూడదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు హింసకు గురైతే ఆ ప్రభావం కుటుంబంలోని పిల్లల మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. మెరుగైన సమాజం కావాలంటే మానసిక శారీరక సామాజిక హింసను నిర్మూలించడమే శరణ్యమని ఆయన పేర్కొన్నారు.

## జగన్ మానసిక స్థితి బాగాలేదనిపిస్తోంది: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఓడిపోతే అందుకు కారణాలు సమీక్షించుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహంవ్యక్తం చేశారు. 150 సీట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి ఐదేళ్లు ప్యాలెస్‌లకే పరిమితం అయ్యారని విమర్శించారు. ప్రతిపక్షాలు మీడియా ఎంత ఘోషించినా ఐదేళ్ల ప్యాలెస్‌లు వీడలేదన్నారు .ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లోఉండొద్దనే ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల కోసం పనిచేసేవాడే నిజమైన నాయకుడని చెప్పారు. జగన్ మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి బాగాలేదనిపిస్తోందన్నారు. జగన్ పిచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ మిర్చియార్డు వద్ద పచ్చి అబద్ధాలు చెప్పారు. ఎవరైనా నవ్వుకుంటున్నారన్న స్పృహ కూడా లేదు. గుంటూరు మిర్చి యార్డు ఇప్పుడు కొత్తగా రాలేదు. గతంలోనూ ఉంది. జగన్ సొంత మీడియాలో అబద్ధాలు ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలో 11 జిల్లాల్లో మర్చి పంట పండుతోంది. ధర రూ.13 వేలకు పడిపోయిందని జగన్ అంటున్నారు. గత ఐదేళ్లఓ మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13వేలు ధర ఉంది. రెండేళ్లు మాత్రమే మిర్చి రైతులకు రూ.20వేలు ధర పలికింది. మిర్చి రైతులకు ఇబ్బందులున్న మాట వాస్తవం సాగు ఖర్చులు పెరిగాయి. పని లేకపోవడంతోనే జగన్ అనవసర విమర్శలు చేస్తున్నారు. ఐదేళ్లు నాటకాలాడి ఇప్పుడేమా ప్రేమ ఒలకబోస్తున్నారు. జగన్ పాలనలో వ్యవసాయశాఖను పట్టించుకున్న పాపానపోలేదు. ఆదాయం తెచ్చే శాఖలకు జగన్ తాళం వేసి బిగించారు. ఇప్పుడు ఆయన వాటిగురించి మాట్లాడుతున్నారు. ఐదేళ్ల పాలనతో జగన్ రైతుల కోసం ఒక్క మంచి పని కూడా చేయలేదు. సెంటు భూమికి కూడా భూపరీక్షలు చేయించలేదు. వ్యవసాయశాఖనుఅటకపై పెట్టారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ఒక్క పైసా ఖర్చు చేయలేదు. తాను పుట్టిన రాయలసీమలోనూ డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వలేదు. జగన్ రైతులకు పెట్టిన రూ.1600 కోట్ల బకాయిలను మేం వచ్చాక చెల్లించాం. టమాటా ధర తగ్గితే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేశాం. ఈ 8 నెలల్లో ఎరువులు బఫర్ స్టాక్ పెట్టాం. ప్రకృతి విపత్తుల సమయంలో జగన్ ఏనాడూ పైసా ఇవ్వలేదు. మేం వెంటనే పరిహారం చెల్లించాం.

## కోళ్ల రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎపి పౌల్ట్రీ ఫెడరేషన్

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు తొలగించి, కోళ్ల రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఆ సమాఖ్య ప్రతినిధులుఉండవల్లి నివాసంలో సీఎంను కలిసి పౌల్ట్రీ రంగ సమస్యలను వివరించారు. కోడి మాంసం, గుడ్లపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి ప్రభుత్వం సహకరించాలని చికెన్, ఎగ్ మేళాల ఏర్పాటుపై సర్కారు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. తూర్పుగోదావరి జిల్లాతో పాటు మరికొన్ని చోట్ల అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా పున ప్రారంభించాలని ఆ మేరకు కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుబ్బారావు ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, బాలాజీ హేచరీస్ డైరెక్టర్ పి.ప్రణీత్ చిత్తూరుకు చెందిని హేమాద్రి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్త

కొట్టినప్పుడు వినిపించే ధ్వనిని బట్టి, పాత్ర గట్టిదా, వట్టిదా అనే సంగతి తెలిసిపోయినట్లే, మనుష్యులు బుద్ధిమంతులా, మూర్ఖులా అనే విషయం వారి ఉపన్యాసం ద్వారా తెలిసిపోతుంది.

న-డెమొస్త నీస్

# మహమ్మారికి ముకుతాడు

రాచపుండుకు చావే అంతిమ పరిష్కారంగాఉన్న రోజుల్నుంచి, ఆధునిక యుగంలో ఎన్నో పరిశోధనలతో జీవన కాలాన్ని పెంచేందుకు వీలుగా కొన్ని ప్రాణాధార ఔషధాలు తయారు చేసే స్థాయికి మన ఔషధరంగం విజయాలు సాధించడం సంతోషదాయకమే. ఆనాటి రాజుల కాలంలో రాజుకు రాచపుండు ఏర్పడితే ఎన్ని ఆయుర్వేద గ్రంథాలు తరచి చూసినా చికిత్సలు లభించేవి కాదని చరిత్ర చెబుతోంది. ఎన్నో దీర్ఘకాలిక రుగ్మతలను నయంచేయగలుగుతుందని చెప్పుకునే రసవైద్య చింతామణిలో కూడా క్యాన్సర్‌కు ఎలాంటివైద్య పరిష్కారాలూ లభించలేదు. భారతదేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఆయేటికాయేడు పెరుగుతూనే ఉంది. జాతీయ వైద్య పరిశోధన మండలి 2020లో చేపట్టిన అంచనాల మేరకు 2020 నాటికి దేశంలో 13.9 లక్షల మంది క్యాన్సర్ రోగగ్రస్థులుండగా, 2025 నాటికి 15.7 లక్షలకు చేరుకుంటుందని అంచనా. తాజా అధ్యయనాలు చూస్తే 2022నాటికే దేశంలో 19 నుండి 20 మిలియన్ల మధ్య ఉంటుందని లెక్కలువేశారు. రోగతీవ్రత, ముందస్తు రోగనిర్ధారణ, నివారణ, నిరోధకత వంటి విషయాలను క్రోడీకరించుకుంటే క్యాన్సర్ మరణాల సంఖ్యలో తేడా లేకున్నా నిరోధకతకూ టీకాలు రావడం మంచి పరిణామం. క్యాన్సర్ రోగుల జీవితకాలాన్ని పెంచడానికి ఇప్పుడొస్తున్న అధునాతన ఔషధ పరిశోధనలు ఉపయోగపడ్తున్నాయనేది తేటతెల్లమే. క్యాన్సర్ మరణాల రేటు 2022లో 8.08లక్షలుగా నమోదైంది. 'క్యాన్సర్ నివారణకన్నా నిరోధమే మేలు' అనే భావనతో ప్రభుత్వాలు వాటికితగిన ఔషధాన్ని రోగికి అందించే ప్రయత్నంలో కృతకృత్తులైనారు. సాధారణంగా క్యాన్సర్ చికిత్సకు వికిరణ, కీమోథెరపి, సర్జరీ వంటి సాంకేతిక ప్రక్రియలను పాటిస్తున్నారు. శరీరంలో ఎలాంటి మార్పులున్నా వెంటనే గమనించి వివిధ చికిత్సాపద్ధతులలో వైద్యానికి వెళ్తే కాస్తంత ఊరట లభిస్తుంది. ఇదెంతో వ్యయంతో కూడిన పని. సామాన్య మానవుడికి ఇలాంటి వైద్యం అందుబాటులో ఉండదు. వైద్యం ఎంతో ఖరీదైనది. వారి ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించదు. అందుకే దీర్ఘకాలిక నయం కానిరుగ్మతగా పేరొందిన క్యాన్సర్‌కు ప్రాచీన కాలంలో 'రాచపుండు'గా చెప్పుకునేవారు. అయితే ఈ ప్రణాలను నియంత్రించలేకపోయినా సిద్ధవైద్యం మాత్రం మరికొంత ఆధునికత పొందిన వైద్యవిధాన ప్రక్రియలు క్యాన్సర్ రుగ్మతను నిరోధించగలమనే నమ్మకం ఈ మధ్య బాగా ప్రచారం పెరిగింది. దాంతో పునర్జన్మ వస్తుందని ఇప్పటికీ జనం నమ్ముతున్నారు. సిద్ధవైద్యంలో ఔషధ వృక్షాల రసాలు,కొన్నిఖనిజ తైలాలు వాడతారు. కనుక శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలో పేరుకుపోయిన విషాలను నియంత్రిస్తాయి. ఇవన్నీ జాగ్రత్తగా వాడాల్సి వస్తుంది. ప్రస్తుత పరిశోధనలు, కొవిడ్‌కు వాక్సిన్ విజయవంతంగా కనిపెట్టడంలో భారతదేశం ఫార్మా పరిశోధనల్లో బాగా ముందడుగు వేసింది. అప్పట్నించి ప్రధాని నరేంద్ర మోడీకూడా అన్నిరుగ్మతలకు మనమే స్వదేశీ వాక్సిన్ ఉత్పత్తి చేయాలని ఆ రంగాన్ని బాగా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే రష్యా దేశం క్యాన్సర్‌కు టీకా కనిపెట్టినట్లు ప్రకటించుకుంది.ఎంతో సంతోషకర విషయం. కాగా తాజాగా ఇప్పుడు భారత్ కూడా ఆరునెలలో క్యాన్సర్ టీకాను అందుబాటులోకి తెస్తున్నామని శుభవార్త చెప్పింది. ఈ టీకాపై పరిశోధనలు పూర్తయి, ట్రయల్స్‌లో ఉన్నామని త్వరలో విడుదల చేసే యోచనను బయటపెట్టారు. 30 యేళ్లు పైబడిన మహిళలకు ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ జరిపి వైద్య చికిత్సలు ఉచితంగానిర్వహిస్తున్నట్లు చెప్తూనే పదహారేళ్ల లోపు బాలికలకు టీకా తెస్తున్నామని చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి ఈవ్యాక్సిన్ అదుపులో ఉంచి దరిచేయనీయకుండా చేస్తుందని కేంద్ర,వైద్య ఆరోగ్యశాఖా సహాయమంత్రి ప్రతాపరావ్ జాదవ్ వెల్లడించారు. ఇప్పుడుమహిళలను బాధించే అన్నిరకాల క్యాన్సర్‌లకూ ఉపశమనం కనుచూపుమేరలోనే ఉంది. యేటా కోటిమంది మరణాలు క్యాన్సర్ మహమ్మారి వల్లనేనని అధికారిక లెక్కలు చెపుతున్నాయి. రష్యా వ్యాక్సిన్‌కు క్లినికల్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. క్యాన్సర్ రోగనిరోధానికి విడుదల చేయడమొక్కటే మిగిలిఉంది. వారివ్యాక్సిన్ పేరు ఎండాఆర్ఎన్ఏ. వ్యాక్సిన్‌లు ఏవైనా రోగకారక క్రిమిని మట్టుబెడతాయి. దాంతో రోగ నిరోధకశక్తిమీద దాడిచేసే కారకాలు మాయమైపోతాయి. శరీరంలో తయారైన యాంటీబాడీలు రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తాయి. అయితే కరోనా వ్యాప్తి సమయంలో సరికొత్త విధానంలో వ్యాక్సిన్ తయారు చేస్తున్నారు. ఇలాంటి వ్యాక్సిన్‌లన్నీ శరీరానికి రోగనిరోధకతను పెంచేవే. నిన్నమొన్నటి కోవిడ్ సమయాలో విజయవంతమైన వ్యాక్సిన్‌తో మానవాళిని కాపాడిన రష్యా,భారత్‌దేశాలు మాత్రమే. వారే ఇప్పుడూ క్యాన్సర్ రోగానికి వ్యాక్సిన్‌లు కొనుగొనడం అభినందించదగినది. రష్యా, భారత్‌లు వ్యాధి నిరోధక టీకాల కోసం పరిశోధనలు చేసి జనంలో ఊరట కలుగచేస్తున్నప్పటికీ ఇతరదేశాలు కూడా మరికొన్ని పరిశోధనలు చేస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌దేశాలు కూడా పరిశోధనలుచేస్తున్నాయి. కాగా కొన్ని దేశాలు మానవాళిని క్యాన్సర్ మహమ్మారి నుండి రక్షించడానికి నిష్కపటంగా పరిశోధనలు వేగవంతం చేస్తున్నాయి. రష్యాదేశం తాము అభివృద్ధి పరిచిన 'టీకా'ను ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందుబాటులోకి తెస్తామని వాణిజ్యపర ఆలోచన ఏదీ లేదని ప్రకటించింది. భారతదేశం ముందు మనవారికి, బయటి దేశాలకు ఆ తర్వాతే అన్న సూత్రాన్ని అవలంబిస్తున్నాయి. అదే జరిగితే క్యాన్సర్ మహమ్మారిని జయించినట్లే!

> ఎంత సైంటిస్ట్ అయినా ఫార్ములాస్‌తో మాట్లాడలేడు కదా! ప్రధానంగా భాష సహాయంతోనే మాట్లాడాలి.



ఐన్‌స్టీన్

> డబ్బు సంపాదనలో విజయం సాధించినంత మాత్రాన జీవితంలో నిజమైన విజయం సాధించినట్టు కాదు.



బైరన్

# విద్యావ్యవస్థ నాణ్యతకు స్వతంత్రతే కీలకం

*నిజానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రకృతి విపత్తులు, జనాభా సేకరణకు మాత్రమే, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకింద తీసుకోవాలి. మిగతా ఏఅంశంలోనూ తీసుకోకుండా చట్టంఉన్నది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినటువంటి విలువైన సమయాన్ని వృథా చేయకూడదు అనే బలమైన కారణం చేత, ఆ చట్టం చేయబడినది. కానీ పాలకులు రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు, ఈ చట్టాన్ని ఏమాత్రం వారు పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థులకు నష్టంచేస్తున్నారు. విద్యారంగంలో బాగా ముందున్న దేశాలలో, విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచి, విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడగలుగుతున్నారు. అలాంటి పరిస్థితిని మన రాష్ట్రంలో ఉంచినట్లయితే, విద్యార్థులకు పరిపూర్ణమైన బోధన అంది, మంచి విషయ పరిజ్ఞానం గల పౌరులుగా తయారవుతారు. ఇలాంటి పరిస్థితి కల్పించవలసింది కేవలం పాలకులు, ఉన్నతస్థాయి అధికారులు మాత్రమే!*

**తరిగోపుల నారాయణస్వామి**

రాష్ట్రంలో ప్రాథమిక విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా టీచర్ల పనితీరును అంచనా వేయాలని ఆదేశించింది. దీనికి వీలుగా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ)ని సంప్రదించి, 6నెలల్లో సూచికలు రూపొందించాలని పేర్కొంది. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం కనీస స్థాయిలో లేకపోవడానికి టీచర్లను బాధ్యులను చేయడంవల్ల, దీర్ఘకాలంలో విద్యాప్రమాణాలు పెరుగుతాయని అభిప్రాయపడింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధన 25(2)(డీ) ప్రకారం, జవాబుదారీతనం, పనితీరులపై సూచికలు తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. అలాగే, 25(2) (ఈ) ప్రకారం, ఉపాధ్యాయులు, అధికారుల వ్యవస్థ పనితీరును, నిర్దిష్ట కాలంలో మదింపు చేయాలని తెలిపింది. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పుఇచ్చింది. విద్యార్థుల అధ్యయన, అభ్యసన సామర్థ్యాన్ని విద్యాహక్కు చట్టం, ఎన్‌సిఆర్‌టి, నిబంధనలమేరకు నిర్వహించిన బేస్లైన్, టీఏఆర్ఎల్(టీచింగ్ ఎట్ రైట్ లెవల్ టెస్ట్) ఫలితాలను గత ప్రభుత్వం బహిర్గతం చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ,డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఇంద్రనీలాబాబు వాదనలు వినిపించారు. విద్యార్థులు చదివే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని, ఐదవ తరగతి విద్యార్థి రెండోతరగతి పాఠ్యాంశాన్ని కూడా చదవలేకపోతున్నాడని తెలిపారు. బేస్‌లైన్, టీఏఆర్ఎల్ టెస్ట వివరాలను తల్లిదండ్రులకు అందజేయడం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఇలా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం మంచిదే,కానీ న్యాయస్థానం కావచ్చు లేదావాజ్యం దాఖలు చేసిన వ్యక్తి కావచ్చు. క్షేత్రస్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రకారం, ప్రభుత్వాలు సదుపాయాలు కల్పిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. ఉపాధ్యాయుల నియామకాలు కావచ్చు. ఇతర సౌకర్యాలున్నాయా అనేవిషయం కూడా పరిశీలనలోకి తీసుకోవలసిన అవసరం ఉన్నది. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు దాదాపు 12 వేలకు పైబడి ఉన్నాయి. అంటే ఈ పాఠశాలలో ఉన్న ఒకే ఒక ఉపాధ్యాయుడు, ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు బోధన చేయవలసి ఉంటుంది. అనగా ఈ ఉపాధ్యాయుడు విద్యార్థులు ఎందరు అనే విషయం కాకుండా, ఒకటి నుంచి ఐదోతరగతి వరకు అన్నిబోధనాంశాలు అనగా, 18సబ్జెక్టులు ప్రతిరోజుచెబుతూ, మరలా 18వర్క్ బుక్కులు విద్యార్థులతో రాయించి, వాటిని ఏకాగ్రతతో పరిశీలించి, దోషనివారణ చేయించాలి. అనగా ఏకోపాధ్యాయపాఠశాలలో ఉన్న ఒక ఉపాధ్యాయుడు, ప్రతిరోజు 36సబ్జెక్టులకు సంబంధించిన విషయాన్ని పరిశీలించి, బోధించి దోషనివారణచేయించాలి. వీటితోపాటు అదనంగా, బోధనేతర కార్యక్రమాలు కూడా చూడాలి. మరి అలాంటి పాఠశాలల్లో ఫలితాలు ఎలా ఆశిస్తాం? విద్యాహక్కు చట్టం



ఈ విధంగా చెబుతున్నదా? మనం ఆలోచించాలి! అలాగే దాదాపు రాష్ట్రంలో ఉన్న 90శాతం ప్రాథమిక పాఠశాలల్లో, ఇద్దరూ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇలాంటి పాఠశాలల్లో కూడా, ఒక్కొక్క ఉపాధ్యాయునికి టెక్స్ట్ బుక్స్ వర్క్‌బుక్స్‌ను పరిగణలోనికి తీసుకుంటే, 18పుస్తకాలు బోధించి, రాయించి,దోష నివారణ చేయాలి. వీటితోపాటు బోధనేతర కార్యక్రమాలు అదనం. వాస్తవాన్ని పరిగణలోనికి తీసుకుంటే ఇది సాధ్యమా? అని ఆలోచించాలి. మరి సౌకర్యాల విషయాలకు వస్తే, విద్యా హక్కుచట్టం ప్రకారం,ప్రతి తరగతికి ఒక తరగతి గది ఉండాలి. ప్రధానోపాధ్యాయుని కార్యాలయం కూడా ఉండాలి. దాదాపు 90శాతం ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక గది,లేదా రెండుగదులు మాత్రమే ఉన్నాయి. క్రీడా స్థలాల విషయం మరింత విస్మయం కలిగిస్తుంది. కేవలం 10శాతం పాఠశాలలకు మాత్రమే, కనీస స్థాయిలో క్రీడా మైదానాలు ఉన్నాయి. మిగిలిన 90శాతం ప్రాథమిక పాఠశాలలో క్రీడా మైదానాలు లేవు. తాగునీటి సమస్య కూడా ఇంచుమించు ఇదేవిధంగా ఉన్నది. ఇక బోధన విషయాలకు వస్తే, ఉపాధ్యాయులకు బోధన సమయంలో, బోధన చేయించకుండా ఇతర బోధనేతర కార్యక్రమాలు ఇవ్వడం మూలంగా అధికారులే విద్యార్థులకు బోధన అందకుండాచేస్తున్నారు.విలువైన బోధనా సమయంలో, రకరకాల శిక్షణల పేరుతో విద్యార్థులకు బోధన అందకుండా చేస్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు, అత్యవసర ఆదేశాలంటూ, రకరకాల బోధనేతర పనుల అప్పగిస్తూ, పరోక్షంగా అధికారులే, విద్యార్థులకు బోధన అందకుండా చేస్తున్నారు. మరి ఇలాంటి అసౌకర్యాలకు, ఉపాధ్యాయులని బాధ్యత చేయడం సమంజసం కాదు. పాలకులే విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడవలసి ఉంటుంది. వాజ్యం దాఖలుచేసిన వ్యక్తి కావచ్చు, లేదా గౌరవ న్యాయస్థానాలు కావచ్చు, క్షేత్ర స్థాయి వాస్తవాన్ని మదింపు చేసుకోవాలి. ఇలాంటి విద్యార్థులకు నష్టంజరిగే అంశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలగాలి. అలాగే పాలకులు మారినప్పుడల్లా, రకరకాల ప్రయోగాలు విద్యావ్యవస్థలో చేస్తున్నారు. ఏదైనా ఒక విధానాన్ని ఎంచుకున్నప్పుడు ఆ విధానం వలన ఫలితాలు రావడానికి, కొన్నిసంవత్సరాల సమయం పడుతుంది. అంత సమయం ఇవ్వకుండా, ప్రతి సంవత్సరం విద్యా వ్యవస్థలో, బోధనకు సంబంధించి రకరకాల పద్ధతులు ప్రవేశపెడుతున్నారు. ఇది విద్యార్థికి ఉపాధ్యాయులకు అనిస్థితిని కలిగిస్తుంది.పాలకుల విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచకుండా, ప్రతి కార్యక్రమంలోనూ భాగస్వామ్యం చేయడంవలన,బోధనకు ఆటంకం కలుగుతున్నది.ఇలా ఆటంకం కలగడంవలన, ఉపాధ్యాయుడు ప్రతిభావంతంగా పాఠ్యాంశాలనుసకాలంలో పూర్తి చేయుటకు, ఉపాధ్యాయునికి కష్టతరంగా ఉంటుంది. ఉపాధ్యాయునికి కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేసి,బోధనా అంశములకు మాత్రమే బాధ్యత వహించేటట్లు చేయడం సమసితం. నిజానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రకృతివిపత్తులు, జనాభా సేకరణకు మాత్రమే, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకింద తీసుకోవాలి.మిగతా ఏఅంశంలోనూ తీసుకోకుండా చట్టంఉన్నది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినటువంటి విలువైన సమయాన్నివృథా చేయకూడదు అనే బలమైన కారణం చేత, ఆ చట్టం చేయబడినది. కానీ పాలకులు రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు, ఈ చట్టాన్ని ఏ మాత్రం వారు పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థులకు నష్టంచేస్తున్నారు. విద్యారంగంలో బాగా ముందున్న దేశాలలో, విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచి, విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడగలుగుతున్నారు. అలాంటి పరిస్థితిని మన రాష్ట్రంలో ఉంచినట్లయితే, విద్యార్థులకు పరిపూర్ణమైన బోధన అంది, మంచి విషయ పరిజ్ఞానం గల పౌరులుగా తయారవుతారు. ఇలాంటి పరిస్థితి కల్పించవలసింది కేవలం పాలకులు, ఉన్నత స్థాయి అధికారులు మాత్రమే! ●

# మానవ శాస్త్ర పరిశోధకులు పెరగాలి!

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

ఇటీవల ప్రాధాన్యతను సంతరించుకున్న మానవ శాస్త్రం (ఆంథ్రపాలజీ) ముఖ్యంగా హ్యూమానిటీ లేదా మానవత్వం గురించి చర్చించే శాస్త్రంగా గుర్తించబడింది. మానవ శాస్త్రం పరిధిలో మానవ ప్రవర్తన, మానవ జీవశాస్త్రం, సంస్కృతి, మానవ సమాజం, భాషాశాస్త్రం లాంటి ప్రధాన అంశాలు వస్తాయి. మానవ జాతిని లోతుగా అర్థం చేసుకోవడం, ఆ పరిజ్ఞానాన్ని విశ్లేషించుకోవడం, మానవశాస్త్ర విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉంచటం, పరిశోధనలు కొనసాగించడం, వివిధ మానవ జాతుల సంస్కృతులను అవగాహన పరచడం జరుగుతున్నది. మానవశాస్త్రం పట్ల సామాన్య ప్రజల్లో అవగాహన తక్కువగా ఉన్నందున, దానిని బహుళ ప్రచారంలోకి తీసుకురావడానికి 2015లో అమెరికన్ ఆంథ్రపాలోజికల్ సొసైటీ చొరవతో ప్రతి ఫిబ్రవరి మాసం 3వ గురువారం రోజున, అనగా 20 ఫిబ్రవరి 2025న ప్రపంచ మానవ శాస్త్ర దినోత్సవం" లేదా వరల్డ్ ఆంథ్రపాలజీ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ మానవ శాస్త్ర దినం2025 ఇతివృత్తంగా భవిష్యత్తు మన ముందుంది. అది సమానంగా పంపిణీ జరగలేదు" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. ఈ వేదికగా



మానవత్వం, మానవ జాతి, సంస్కృతి, మానవ సమాజం లాంటి అంశాల్లో అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇటీవలే పుంజుకున్న మానవ శాస్త్రం లోతులను చూసే ప్రయత్నాలు చేస్తున్న మానవ శాస్త్రవేత్తల అభిప్రాయాలను శ్రద్ధగా వినడం, మానవ జీవితాల వైవిధ్యాలను అర్థం చేసుకోవటం, ఈ రంగంలో ఎదురవుతున్న ప్రపంచ సవాళ్లను అధిగమించే ప్రయత్నాలు చేయడం కొనసాగు తోంది. సమాజ ప్రతికూల తలను ఎదిరించి మానవ శాస్త్రం పట్ల లోతైన పరిశోధనలు చేసి పలు ఆసక్తికర మానవ శాస్త్ర అంశాలను బయట పెట్టిన ఫ్రాంజ్ బోయిస్‌ను మానవ శాస్త్ర పితామహుడు"గా పిలవడం జరుగుతున్నది. మానవ పరిణామం,నిర్మాణం,విధులు, సంస్కృతులు, సాపేక్షత అనే ఐదు భావనల మీద ఆధారపడిన మానవ శాస్త్రం పటిల అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడిన ప్రపంచ మానవ శాస్త్ర దినం" రోజున విద్యాలయాలు, మ్యూజియమ్‌ల సందర్శన, యూనివర్సిటీల్లో సదస్సులు, చర్చలు, కార్యశాలలు లాంటివి నిర్వహిస్తూ మానవ శాస్త్ర కనీస పరిజ్ఞానాన్ని కల్పించవచ్చని తెలుసుకోవాలి. మానవ శాస్త్రం లోతులను మనకు పరిచయం చేస్తున్న పరిశోధకు లను ప్రోత్సహించడం, సన్మానించడం ఈ వేదికగా నిర్వహించవచ్చు. ఈ రోజున అవగాహన కల్పించడానికి ఆంథ్రోడే, ఆంథ్రపాలజీడే లాంటి హాష్‌ట్యాగులతో సోషల్ మీడియాలో ప్రచారం చెయవచ్చు. ●

# రూపాయి క్షీణతను నియంత్రించగలమా?

**డాక్టర్. పి.ఎస్.చారి**

గతకొన్నినెలలుగా రూపాయి విలువ హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ఫిబ్రవరి10, 2025న డాలర్‌తో పోలిస్తే రూపాయి 87.43కనిష్ట స్థాయికి చేరుకుంది. ఇలా ఎందుకు జరుగుతోంది? రూపాయి విలువ రెండురకాలుగా పడిపోతుంది.ఒకటి రూపాయి విలువ తగ్గించడం. ఇది ఇతర కరెన్సీలకు వ్యతిరేకంగా రూపాయి అధికారిక మారకపు రేటులో ఉద్దేశపూర్వకంగా తగ్గుదల. ఇది 1949, 1966, 1991 సంవత్సరాలలో మూడు సందర్భాలలో జరిగింది. మరొకటి అంతర్జాతీయ వ్యాపారంలో హెచ్చుతగ్గుల కారణంగా డాలర్‌తో రూపాయి విలువ క్షీణించడం. ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గుదల. ఇది రూపాయిక్షీణతను ఇది సూచిస్తుంది. భారత రూపాయి విలువ ఇప్పుడు ఎందుకుపడిపోతోంది? రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ పాలస్తీనాయుద్ధం, పెరుగుతున్న ముడిచమురు ధరలు, ఈక్విటీల అమ్మకం, డాలర్ ప్రవాహం. ద్రవ్యవిధానాన్ని కఠినతరం చేయడానికి ఆర్‌బిఐ చర్యలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను కఠినతరం చేయడం వంటి ప్రపంచ కారకాలు దీనికి ప్రధానకారణాలు. చరిత్రలో కొన్నేళ్లుగా డాలర్‌తో రూపాయి మారకంవిలువ హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉంది. 1947లో రూపాయిడాలర్ రేటు రూ.3.30,1966లోరూ.7.50,1995 నాటికి రూ.32.4. 2022లో డాలర్‌కు రూ.82.14 గాఉంది. పాకిస్థాన్, చైనాలతో యుద్ధాలు, విదేశీ రుణాలు అవసరమయ్యే పంచవర్ష ప్రణాళికలు, రాజకీయ అస్థిరత, చమురు ధరలు వంటి అనేక కారణాలవల్ల రూపాయి విలువ పడిపోయింది. అమెరికా చైనామధ్య కొనసాగుతున్న వాణిజ్యయుద్ధం, ఇరాన్ పైన ఆంక్షలు, చమురు ధరల్లో మరింత అస్థిరత రూపాయి విలువను పరీక్షిస్తూనే ఉన్నాయి.రూపాయి క్షీణతప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే, భారతీయ రిజర్వు బ్యాంక్‌కు ఇది రెండువైపులా కత్తిలాంటిది. అనుకూలతవైపు, బలహీనమైన రూపాయి సిద్ధాంతపరంగా భారతదేశ ఎగుమతులను పెంచడం, భారతదేశానికి ప్రయాణాన్ని చౌకగా చేయడం వంటి కొన్ని సానుకూల అంశాలను కలిగి ఉంది. స్థానిక పరిశ్రమ ప్రయోజనం పొందవచ్చు.విదేశాలలో పనిచేసే వ్యక్తులుతమ స్వదేశానికి తిరిగి డబ్బుపంపడం ద్వారా మరింత సంపాదించవచ్చు. ఇది మరింత ఎగుమతి చేయడం ద్వారా కరెంట్ ఖాతాలోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రతికూలతలో, ద్రవ్యోల్బణం ప్రమాదం కూడాఉంది. ఎక్కువ కాలం వడ్డీరేట్లను రికార్డుస్థాయిలో ఉంచడం సెంట్రల్ బ్యాంక్‌కు కష్టతరం చేస్తుంది. ఎందుకంటే భారతదేశం తన దేశీయ చమురు అవసరాలలో మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. బలహీన కరెన్సీ దిగుమతి చేసుకున్న తినదగిన నూనె(ఎడిబుల్ ఆయిల్)ధరలను మరింత పెంచుతుంది. ఇది అధిక ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.రూపాయి కొనుగోలు శక్తిపడిపోవడం, అధిక చెల్లింపుల కారణంగా దేశం కరెంట్ ఖాతాలోటు పెరుగుతుంది. విదేశీ ప్రయాణం,విదేశీ విద్య ఖరీదైపోతుంది.విదేశీరుణం తదితరాలపై వడ్డీభారం పెరుగుతుంది. భారత ఆర్థికవ్యవస్థపై ప్రభావం 2024లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు3శాతం పతనం తర్వాత దేశీయ యూనిట్‌లో తీవ్ర తగ్గుదల వచ్చింది, ఇది ఆసియా కరెన్సీలలో కనిష్టస్థాయి పతనంగా నిలిచింది. జనవరి 1, 2024న, గ్రీన్ బ్యాక్‌తో పోలిస్తే రూపాయి 83.21 వద్ద ఉంది. నోమురా సంస్థ 2025 మధ్యలో డాలర్‌తోపోలిస్తే రూ. 87కి పడిపోతుందని అంచనావేసింది.



విశ్లేషణాత్మక అంచనాల ప్రకారం,2025 చివరి నాటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.1037కి, 2029 చివరినాటికి 101.5491గా ఉంటుందని అంచనా. వాణిజ్య లోటు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెనక్కి తగ్గడం, యుఎస్ డాలర్‌ఇండెక్స్ బలపడటం వంటి కారణాల వల్ల సమీపకాలంలో రూపాయి డాలర్ మారకపు విలువ అస్థిరంగా ఉంటుందని కూడా అంచనా. యుఎస్ట్రేడేటు పెంపు భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్యడాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రూపాయి బలహీనపడవచ్చని యుఎస్‌సెంట్రల్‌బ్యాంకు అంచనావేసింది. సాధారణంగా, నికర ఎగుమతి దారులు తమ డాలర్లకు ఎక్కువ రూపాయలను అందుకుంటారు. కాబట్టి నికర దిగుమతిదారులు దిగుమతుల కోసం డాలర్లను కొనుగోలు చేయడానికి ఎక్కువ చెల్లించాలి. పెద్ద మొత్తంలో విదేశీ అప్పులున్న వారు కూడా వడ్డీఖర్చులను రూపాయిలోచూస్తారు. తరుగుదల ఆర్థిక వ్యవస్థలో ఇలా కొన్ని పరిణామాలకు దారితీస్తుంది. భారత దేశం 2024 ఆర్థిక సంవత్సరంలో సుమారు 723బిలియన్ భారతీయ రూపాయల విలువైన మందులు, ఔషధాలను యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసింది. ఈ రంగం ఎగుమతులలో అత్యధిక విలువను సాధించింది. నికర ఎగుమతి దారుగా ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమ బలహీనమైన రూపాయి నుండి ప్రయోజనం పొందుతుంది. అయితే రాబోయే ఆర్డర్‌లలో వినియోగదారులు సవరించిన రేట్లను డిమాండ్ చేయడం వల్ల లాభాలు స్వల్పకాలికంగా ఉండవచ్చని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. రత్నాలు, ఆభరణాల రంగం విషయానికొస్తే, రూపాయివిలువ క్షీణించడం దాని యూనిట్లకు ఖర్చు ప్రయోజనాన్ని ఇస్తోంది. సమాచారం సాంకేతికత సేవలు పరిశ్రమ యునైటెడ్ స్టేట్స్‌రాబడులకు 50 శాతం కంటే ఎక్కువ దోహదపడుతుంది. ఇదికాకుండా క్షీణిస్తున్న రూపాయి అతిపెద్ద లబ్ధిదారులలో ఒకటిగా ఉంటుంది. గార్మెంట్ రంగం లాభాల్లో ప్రతి 1శాతం పతనానికి, లాభాలు 0.25 0.5శాతం పెరుగుతాయి. భారతదేశ తేయాకు ఎగుమతులు 510శాతం పెరుగుతాయని అంచనా. పెట్రోలియం ఉత్పత్తులు, సేంద్రీయ రసాయనాలు, ఆటోమొబైల్స్ యంత్రాలు భారతదేశం ప్రధాన ఎగుమతి వస్తువులైతే, ప్రపంచంలో భారతీయ తేయాకు పోటీతత్వాన్ని పెంచడం మరింత ఎగుమతులను ప్రోత్సహిస్తుంది. అధిక దిగుమతులు, సరఫరా కొరత కారణంగా పెరుగుతున్న వస్తువులధరలతో, ఎగుమతిదారులకు ఉత్పత్తివ్యయం పెరుగుతుంది, ఇదివారిలాభాలను ప్రభావితం చేస్తుంది. డొనాల్డ్‌ట్రంప్‌హయాంలోబలహీనమైన ఆదాయాలు,డాలర్‌ను బలోపేతంచేయడం, టారిఫ్‌విధానాల గురించి ఆందోళనల కారణంగా విదేశీ పెట్టుబడిదారులు జనవరి 10వరకు భారతీయఈక్విటీల నుండి రూ.22,194 కోట్లను ఉపసంహరించుకున్నారు. యునైటెడ్ స్టేట్స్‌డాలర్స్‌కి వ్యతిరేకంగా భారత రూపాయి క్షీణత కారణంగా,భారతదేశం ముడిచమురు దిగుమతిబిల్లు ఎనిమిది నుండి తొమ్మిదిశాతం పెరుగుతుందని పెట్టుబడిసమాచారం క్రెడిట్‌రేటింగ్ ఏజెన్సీ నివేదికతెలిపింది. ఫారెక్స్‌మార్కెట్‌లో ఆర్‌బిఐ భారీ జోక్యాన్ని ప్రతిబింబిస్తూ, ఫిబ్రవరి1,2025 నాటికి దేశ విదేశీ మారక నిల్వలు51.52బిలియన్ డాలర్లు తగ్గి 630.607 బిలియన్ డాలర్లు పడిపోయాయి.తగ్గిన మూలధన ప్రవాహం, విస్తృతమైన వాణిజ్య లోటు,భారతదేశంలో ఆర్థికవృద్ధి మందగించడం వల్ల రూపాయి క్షీణత మరింత తీవ్రమవుతుంది. డాలర్‌తో ఇతర కరెన్సీలు అమెరికా డాలర్‌తోపోలిస్తే అనేక కరెన్సీలు హెచ్చుతగ్గులకులోనవుతున్నాయి. తత్ఫలితంగా, భారతదేశంతో సహా వివిధ అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల నుండి విదేశీ మూలధన ప్రవాహం వారి దేశీయ కరెన్సీలపై ఒత్తిడితెచ్చింది. యూరో, బ్రిటిష్‌పౌండ్, జపనీస్ ఇతర ప్రధాన ప్రపంచ కరెన్సీల కంటే యుఎస్‌డాలర్‌తో రూపాయి క్షీణత తక్కువగా ఉంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూపాయి బలపడు తున్న యుఎస్డాలర్‌తో మాత్రమే క్షీణించిందని, ఇతర బల మైన స్థూల అంశాలతో పోలిస్తే స్థిరంగా ఉందని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం, ప్రపంచంలోని కరెన్సీ నిల్వలలో 61శాతం కంటే ఎక్కువ డాలర్లలో ఉన్నాయి. ●

# ప్రజావాక్కు



## సఫలమా? విఫలమా?

భారత ప్రధాని నరేంద్రమోడీ ఫ్రాన్స్‌దేశానికి వెళ్ళి కృత్రిమ మేధ మానవాళికి కలిగే ప్రయోజనాలను సవివరంగా తెలియజేసారు.కానిదీనివల్ల మెదడు పనితీరు మీద ఎంత ప్రభావముంటుందో మాత్రంతెలియజేయలేదు. అమెరికా యాత్రలో ట్రంప్‌తో కరచాలనాలు,కౌగిలింతలు చేసుకుని ఒకరి నొకరు అమితంగా పొగుడుకుని తమ ఆత్మీయతను ప్రపంచానికి చాటి చెప్పారు. కాని అక్కడ నివసిస్తున్న భారత వలసదారులకు సంకెళ్ల వేసి మన దేశానికి పంపిస్తుంటే ఇదేమి క్రూరచర్యఅని ఒక్కమరక వేయలేకపోయారు.మనకు ఎఫ్35 యుద్ధ విమానాలెందుకు? మనకు ఆయుధ సంపత్తి లేకనా, చాలకనా? ప్రస్తుతం మన మీద యుద్ధ భయాలేవి లేవుగా. ఇంతకూ మోడీ అమెరికా పర్యటనసఫలమా? విఫలమా?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పారిశుధ్యం,మంచినీటి సరఫరా అధ్వాన్నం!

జీబీఎస్ వ్యాప్తిని కట్టడి చేయమని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు ఈ సింద్రోమ్ కలుషిత నీరు, ఆహారంవల్లే అని వైద్యపరీక్షల్లో గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి మన రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణ,రక్షిత మంచినీటి సరఫరా అధ్వాన్నంగా ఉన్నాయి. గత సంవత్సరం విజయనగరం జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలినప్పుడు కూడా ఉపముఖ్యమంత్రి ఇకపై తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. విజయవాడ వంటి నగరాల్లో కూడా పారిశుధ్యం అధ్వాన్నంగాఉంది. ముఖ్యమంత్రి పరిస్థితి తీవ్రతగుర్తించి పారిశుద్ధ్య నిర్వహణ,మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలి.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

## ఉద్యోగం కంటే వ్యాపారమే మిన్న

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పూర్ణిమ అనే యువతి యం.ఫార్మసీ పానీ పూరీ వాలా పేరుతో పానీ పూరి వ్యాపారాన్ని మొదలుపెట్టి మంచిఆదాయాన్ని సంపాదిస్తోంది. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా టీ షాప్,టిఫిన్ సెంటర్, కూరగాయల దుకాణంవంటి వ్యాపారాలు చేస్తూ చక్కటి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## ఆకస్మిక తనిఖీలు దినచర్య కావాలి!

ఎట్టకేలకు రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంసెట్టి సుభాష్ ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ముదావహం. ఆయన తనిఖీలో హాజరు పట్టీలో సంతకాలు పెట్టి వెళ్లిపోయిన సిబ్బంది వైనం వెలుగు చూడటం ఎటువంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, అన్ని స్థాయిల్లో ఈ బాగోతాలు నిత్యకృత్యం! పలువురు ఐఎఎస్ అధికారులు హైదరాబాద్‌లో నివాసంఉంటూ వారంలో మూడు రోజులు మాత్రమే పని చేస్తున్నారు! చాలా పురపాలక సంఘాల్లో వేరే వారినిపురమాయించి సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు నిత్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరంఉంది. చాలామంది ఉద్యోగుల్లో ప్రభుత్వమన్నా, ప్రజలన్నా జవాబుదారీ తనం లేకుండా పోయింది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

## విగ్రహాన్ని నెలకొల్పాలి

అమరజీవి పొట్టి శ్రీరాములు నిష్కళంక దేశభక్తుడు. అంటరానితనం నిర్మూలనకు అనేక నిరాహారదీక్షలు చేసి నిమ్న వర్గాలకుదేవాలయ ప్రవేశంకల్పించారు.ఆయన తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని విశేష కృషి చేశారు. ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరుడయ్యారు. ఆయన బలిదానం వల్లనే ఆంధ్రరాష్ట్రంఏర్పడింది.దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. విజయవాడలో కనకదుర్గమ్మవారధి నిర్మాణ, సుందరీకరణలలో భాగంగా పొట్టిశ్రీరాములు గారి నిలువెత్తు విగ్రహాన్ని తొలగించారు. ఈ విగ్రహాన్ని 1994లో నాటి ప్రధాని పి.వి. నరసింహారావు ఆవిష్కరించారు. వారధి నిర్మాణ, సుందరీకరణ పూర్తయినా విగ్రహాన్ని ఇంకా నెలకొల్పలేదు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## బేటి బచావో, బేటి పడావో

భేటి బచావ్ భేటి పడావ్ కార్యక్రమం మొదలు పెట్టి దశాబ్దం అయిందని తెలిసి ఈ లేఖ రాయాలి అనిపించింది. ఎక్కడ అయితే మొదలు పెట్టారో అక్కడ మునుపటి స్థితి ఉన్నది. అయితే ఆడ పిల్లల సంఖ్య తగ్గడానికి సహజ కారణాల కంటే మానవ మూఢ విశ్వాసాలు ఎక్కువగా ఉడడం కలిచి వేసే అంశం. హర్యానాలో మొదలు పెట్టిన ఈ కార్యక్రమంలో గత దశాబ్ద కాలంలో హర్యానా లో మార్పేమి లేదు అవుతే తెలంగాణ లాంటి రాష్ట్రాలు బేబి కిట్‌తో పాటు ఆడపిల్లలకు 13 వేల రూపాయలు ఇచ్చి తన వంతు ప్రోత్సాహం అందించింది.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# టారిఫ్‌లలో మినహాయింపులు ఇవ్వలేం..



## ప్రధాని మోడీకి స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## సుంకాలలో ట్రంప్‌ను సమర్ధించిన ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** టారిఫ్‌ల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని తాను మోడీతో వెల్లడించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. వీరిద్దరి మధ్య ఇటీవల జరిగిన మీటింగ్‌లో టారిఫ్‌ల గురించి ఆసక్తికర చర్చనడిచింది. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ నేడు వెల్లడించారు. బిలియనీర్ మిత్రుడు ఎలాన్ మస్క్‌తో కలిసి ఆయన నేడు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మనం ఇక్కడ ఏం చేయబోతున్నాం, పరస్పరం పన్నులు విధించుకోబోతున్నామని నేను ఇటీవల మోడీకి చెప్పాను. మీరు ఎంత ఛార్జి చేస్తే నేనూ అంతే విధిస్తా. ఇంతలో ఆయన ఏదో చెప్పయారు. వద్దు, వద్దు నేను దానిని ఇష్టపడను. మీరు ఎంత ఛార్జి చేస్తే నేను అంతే విధిస్తాను అని స్పష్టంగా చెప్పాను. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వాటిపై అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ కూడా ఉంది. ముఖ్యంగా ఆటో మొబైల్ రంగంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై దాదాపు 100 శాతం సుంకాలను విధిస్తుంది. తాజాగా సమావేశంలో ట్రంప్ పక్కనే కూర్చొన్న మస్క్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అవును. ఆటో దిగుమతులపై 100 శాతం పన్ను విధిస్తుంది అని ట్రంప్ వ్యాఖ్యలను సమర్ధించారు. దీనికి మరోసారి ట్రంప్ స్పందిస్తూ అవి చాలాచిన్నవి. వాటిని మించిన సుంకాలు విధిస్తుంది. ఇతరులు కూడా అంతే. నేను 25 శాతం పన్నులు విధిస్తే అబ్బో అంత భయంకరంగానా అని అంటారు. అందుకే నేను ఆ మాట ఇక అనను. వారెంత విధిస్తే మనమూ అంతే ఛార్జి చేస్తాం. నాతో ఎవరూ వాదించలేరు. అప్పుడే వారు సుంకాలను నిలిపివేస్తారు అని వివరించారు. పన్ను విషయంలో భారత్‌ను ట్రంప్ తప్పుపట్టడం ఇదే తొలిసారి కాదు. తన తొలి విడత పాలన సమయంలో కూడా ఇండియన్ టారిఫ్ కింగ్ అని వ్యాఖ్యానించేవారు. ఈ సందర్భంగా భారత్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా డబ్బులు ఇవ్వడంపై కూడా ట్రంప్ స్పందించారు. న్యూఢిల్లీ వద్ద చాలా సొమ్ము ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న దేశాల్లో అది ఒకటిగా అభివర్ణించారు.

తనకు భారత ప్రజలు, ఆ దేశ ప్రధాని పట్ల చాలా గౌరవం ఉందన్నారు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా? మరి మనదేశంలో ఓటర్ల పరిస్థితి ఎలా ఉందని ట్రంప్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ ఇటీవల వాషింగ్టన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా భారత్, అమెరికా వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.



## గగన్‌యాన్-జి1 కోసం సి32 దశ మోటార్ ఇంజన్ సిద్ధం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఇస్రో గగన్‌యాన్ ప్రయోగంకోసం ముందస్తు పరీక్షలు ఒక్కొక్కటి పూర్తి చేస్తోంది. ఈ ప్రాజెక్టులో కీలకమైన క్రయోజనిక్ దశను మరింత అభివృద్ధి చేసినట్లు ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. ఇంతకు ముందు సి25 దశగా ఉన్న ఈ కీలక దశను సి32గా మరింత అభివృద్ధి చేసింది. గగన్‌యాన్‌కు సంబంధించి ముందస్తు మానవ రహిత ప్రయోగాల్లో కూడా సి32 దశను ఉపయోగిస్తారు. గతంలో ఎల్‌విఎం3లో సి25ను ఉపయోగించే వారు. అంటే అందులో 25 టన్నుల క్రయోజనిక్ ఇంజన్‌ను వాడుతున్నారు. ఇప్పుడు ఏడు టన్నుల అధిక బరువుతో సి32 పేరుతో ఈ మూడవ దశను అభివృద్ధి చేశారు. హెచ్ ఎల్‌విఎం3లోని అన్ని దశలను మిగిలిన సాంకేతిక వ్యవస్థలను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకుపోతున్న శాస్త్రవేత్తలు శ్రీహరికోట నుంచి త్వరలోనే మానవ రహిత ప్రయోగానికి సిద్ధమవుతున్నారు.

## యుపి జైళ్లలోని ఖైదీలకూ సంగమం పుణ్యస్నానాలు

### పవిత్రజలాలను జైళ్లకు తీసుకెళ్లి ఖైదీలకు ఛాన్స్ ఇస్తామన్న మంత్రి

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 19:** కుంభమేళాలో పవిత్రస్నానం చేయాలనుకుంటున్న ఖైదీలకోసం ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లుచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 75 జైళ్లలోని 90వేలకు పైగా ఉన్న ఖైదీలకు గంగా జలాలతో స్నానం చేసే అవకాశం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలోని పవిత్రజలాలను సేకరించి ఈనెల 21న ఆయా జైళ్లకు తీసుకువెళతామని అధికారులుచెప్పారు. జైళ్లలో ఉన్న నీటితో గంగాజలాలను మిశ్రమం చేసి పవిత్రస్నానాలకు అవకాశం ఇస్తామన్నారు. ఆతర్వాత పూజలు, ఇతర క్రతువులు చేసేందుకు కూడా ఏర్పాట్లుచేస్తున్నట్లు జైళ్లశాఖమంత్రి దారాసింగ్ చౌహాన్ తెలిపారు. ఈకార్యక్రమంలో తానుకూడా పాల్గొంటానని తెలిపారు. కుంభ్ మేళాలో పాల్గొనాలనుకునేఖైదీలకోసం చరిత్రలో తొలిసారి ఇలాంటి కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామన్నారు. కాగా ఇప్పటివరకూ మహాకుంభ్ నగర్‌లో 56.25 కోట్లమంది పుణ్యస్నానాలు చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలోనే ప్రకటించారు.

## ఢిల్లీ పోలీసులను అరెస్టు చేసిన యుపి పోలీస్

**లక్నో, ఫిబ్రవరి 19:** ఒక మోసం కేసులో దర్యాప్తు కోసం ఉత్తరప్రదేశ్‌కు చేరిన ఢిల్లీపోలీసులను యుపి పోలీసులు అరెస్టుచేసారు. ఈకేసులో ఇద్దరు యూపికానిస్టేబుళ్లతోపాటు మరో వ్యక్తిని ఢిల్లీపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం తెలిసిన యుపి పోలీసులు రంగంలోకి దిగారు. ఢిల్లీ పోలీస్‌బృందాన్ని అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1.5 కోట్లమోసం కేసులో దర్యాప్తుకోసం ఢిల్లీపోలీసులు యుపిలోని లలిత్‌పూర్‌కు చేరుకున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా లలిత్‌పూర్‌స్టేషన్‌లోకి వెళ్లారు. యుపికి చెందిన పోలీస్‌కానిస్టేబుల్స్ విశ్వజీత్, సచిన్ అవస్థిని వారి క్వార్టర్లనుంచి అదుపులోకితీసుకోగా మరో నిందితుడు బిక్కీరాజాను ఆతడి ఇంటినుంచి తెచ్చి అరెస్టుచేసారు. లలిత్‌పూర్ పోలీసులకు సమాచారం తెలిసి ఢిల్లీబృందాన్ని మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఢిల్లీపోలీస్ ఇన్‌స్పెక్టర్ దర్శన్‌సింగ్‌తో సహా ఆపోలీస్‌బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి లిఖితపూర్వక ఉత్తర్వులు అధికారిక అనుమతి లేకుండాపోలీస్ కానిస్టేబుల్స్‌ను అరెస్టుచేయడంపై రోజంతా విచారణజరిపారు. చివరకు క్షమాపణలు చెప్పిన తర్వాత ఢిల్లీపోలీస్ బృందాన్ని విడిచిపెట్టారు.

## మృత్యుకుంభ్ విమర్శలపై అసెంబ్లీలో సిఎం యోగి వివరణ



**నేటికి 56.25 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసారని వెల్లడి**

**మమతా బెనర్జీ మృత్యుకుంభ్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు**

**బెనర్జీ వ్యాఖ్యలకు పరోక్ష మద్దతుపలికిన ఉత్తరాఖండ్ మఠాధిపతి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** మహాకుంభ్ కాదు అది మృత్యుకుంభ్ అంటూ పశ్చిమ బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీచేసిన విమర్శలకు ఉత్తరాఖండ్ మఠాధిపతినుంచి మద్దతు లభించింది. మహాకుంభ్‌ను ఆరాధిస్తాం, పవిత్ర గంగామాతను గౌరవిస్తా. ఎలాంటిప్రణాళిక లేదు. ఇప్పటివరకూ ఎన్ని మృతదేహాలు రికవరీచేసారు. ఇది మహాకుంభ్‌కాదు మృత్యుకుంభ్ అని మమతా బెనర్జీ విమర్శించారు. అయితే బిజెపి కేడర్, కేంద్రంలోని నాయకులు కూడా మమతా బెనర్జీ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి మహరాజ్ మాత్రం బెనర్జీ వ్యాఖ్యలను సమర్ధిస్తూ వ్యాఖ్యలు చేసారు. మహాకుంభ్ నిర్వాహకులకు ప్రణాళిక లేదని, రద్దీనిర్వహణ, పర్యవేక్షణ ప్రక్రియ లేకపోవడంవల్లనే ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకుందని అన్నారు. మమతా వ్యాఖ్యలకు ప్రత్యక్షంగా మద్దతివ్వనప్పటికీ ఆమెచేసిన వ్యాఖ్యలకు సానుకూలంగానే ఉత్తరాఖండ్ మఠాధిపతి వ్యాఖ్యలుచేసారు. 300 కిలోమీటర్లవరకూ ట్రాఫిక్ జామ్ ఉందని ఇది యాజమాన్య లోపం కాక మరేమిటి? 25నుంచి 30 కిలోమీటర్లు తమ లగేజితో నడిచి వెళ్లాల్సి వచ్చింది. మురుగునీరుతో కలిసి పవిత్రస్నానంచేసే జలాలు కలుషితం అయ్యాయి. శాస్త్రవేత్తలు కూడా ఫేకాల్ బ్యాక్టీరియా ఉందని తాగేందుకు కూడా పనికిరాదని చెపుతున్నారని జగద్గురు గుర్తుచేసారు. మురుసీరువచ్చే కాలువలను మళ్లించాల్సి ఉందని దీనితోప్రజలకు స్వచ్ఛమైన నీరు లభిస్తుందని, 12 ఏళ్లక్రితం మహాకుంభ్ జరిగిందని, మళ్లీ 12 ఏళ్లకు వస్తుందని ఈలోపు మీరు ఎందుకు సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారని జగద్గురు కుంభ్ నిర్వాహకులను ప్రశ్నించారు. పరిమిత విస్తీర్ణంలో లెక్కకుమించిన జనాభాను ఎలా అనుమతిస్తారని, అందువల్లనే రద్దీపర్యవేక్షణ, నియంత్రణ, ఆతిథ్య ఏర్పాట్లు లేకపోవడంవల్లనే దుర్ఘటనలు జరిగాయని, ఈపరిస్థితుల్లో వివిధ పేర్లతో పలువురు విమర్శించినా వాటిని మనం వ్యతిరేకించలేమని స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి అన్నారు. బిజెపి జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి మాట్లాడుతూ మమతా బెనర్జీ సనాతన ధర్మం, హిందువుల పట్ల ద్వేషం వ్యక్తపరిచారని అన్నారు. ఇండియాకూటమి నాయకులు కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదిపార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్‌లకు హిందువులపైనా, సనాతన ధర్మంపైనా విద్వేషం పేరుకుపోయిందని అన్నారు. స్వామి జితేంద్రానంద్ సరస్వతి మాట్లాడుతూ బెంగాల్, జార్ఖండ్, బీహార్, ఒడిశా ఇతర ప్రాంతాలనుంచి వెల్లువలా హిందువులు రావడంతో మమతా బెనర్జీకి అసహనం పెరిగిపోయిందని అన్నారు. బెంగాల్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికలు మమతాకు మృత్యుకుంభ్ లాంటివేనని గుర్తుంచుకోవాలని స్వామి జితేంద్రానంద్ సరస్వతి అన్నారు.

**మమతా వ్యాఖ్యలపై సిఎంయోగి ధ్వజం**

ఇదిలా ఉంటే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై యోగి ఆదిత్యనాథ్ వివరణ ఇస్తూనే బెనర్జీ వ్యాఖ్యలను నిశితంగా విమర్శించారు. మృత్యుకుంభ్ అని పేర్కొనడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. నేటికి 56.25 కోట్లమంది మహాకుంభ్‌లో పవిత్రస్నానాలు ఆచరించారని, త్రివేణిసంగమంలో ఫేకాల్ బ్యాక్టీరియా ఉన్నదనడం కూడా వాస్తవం కాదని గతనెల 29 సంఘటన దురదృష్టకరమని బాధితులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని వారికి పూర్తి భరోసా కల్పిస్తామని అన్నారు. విపక్షాలుచేస్తున్న వ్యాఖ్యలు ఇప్పటివరకూ పుణ్యస్నానం ఆచరించిన 56 కోట్లమంది భక్తులను అవమానించినట్లేనని అన్నారు. మహాకుంభ్ సంఘటన రాజకీయం చేయడం తగదని ఈశతాబ్దంలో మహాకుంభ్ వంటి పవిత్రవేడుకను నిర్వహించడం రాష్ట్రబిజెపి ప్రభుత్వానికి కలిసివచ్చిన అదృష్టం అన్నారు.

## అధ్యక్ష ఎన్నికల సర్వేలో జెలెన్స్కీకి 57% రేటింగ్!



**క్యీవ్, ఫిబ్రవరి 19:** ఉక్రెయిన్‌లో అధ్యక్ష ఎన్నికలంటూ నిర్వహిస్తే ప్రస్తుత అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీకి 57శాతం ఆమోదం లభించినట్లు పోల్ సర్వేలు వెల్లడించాయి. బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జెలెన్స్కీ రేటింగ్ కేవలం నాలుగుశాతం మాత్రమేనని చెప్పిన వెంటనే బయటకు వచ్చిన ఈ పోల్‌షర్వే నివేదికలో జెలెన్స్కీకి 57శాం ఆమోదం లభించింది. క్యీవ్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ ఆధ్వర్యంలో వెయ్యిమందిని ఫోన్ సర్వేచేసారు. ఈ సర్వేలో స్పందించిన వారు జెలెన్స్కీకే మద్దతుపలికారు. 37శాతం మంది ప్రతికూలంగా స్పందించగా మిగిలివారు ఎటూ తేల్చలేకపోయారు. గత డిసెంబరులో నిర్వహించినపోల్ సర్వేకంటే ఐదుశాతం ఎక్కువ మద్దతును జెలెన్స్కీ సాధించగలిగారు.

మిలిటరీ సైనిక చర్యలు కొనసాగుతున్నా, రష్యా దండయాత్రను ధీరోధాత్తంగా ఎదుర్కొనడం పట్ల ఉక్రెయిన్ ప్రజలు జెలెన్స్కీని కొనియాడుతున్నారు. 2022 మార్చిలో అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడికి రేటింగ్ 90శాతంవరకూ పెరిగింది. రష్యా దండయాత్ర చేస్తునప్పటికీ ఈ సోషియాలజీ సంస్థనిర్వహించిసర్వేలో జెలెన్స్కీ అత్యున్నతస్థాయి రేటింగ్ పొందారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ జెలెన్స్కీ ఆదేశానికి సరైన అధ్యక్షుడు కాదనిచేసిన వ్యాఖ్యలు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఈసర్వే చెక్‌పెట్టినట్లయింది.

అయితే ఉక్రెయిన్ వాసులు మాత్రంయుద్ధంముగిసిన తర్వాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. తన రేటింగ్ తగ్గిపోయిందని డొనాల్డ్ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపైనా జెలెన్స్కీ స్పందించారు. డొనాల్డ్‌ట్రంప్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్‌ప్రభావం ఉందని అన్నారు. పుతిన్ ఇచ్చే తప్పుడు సమాచారంపైనే స్పందిస్తున్నారని జెలెన్స్కీ రాజధాని క్యీవ్‌లో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ట్రంప్ చెపుతున్న గణాంకాలు రష్యానుంచి వచ్చినవేనని అన్నారు. యుద్ధవిరమణకు జరుగుతున్న చర్చల్లో ఉక్రెయిన్ లేకుండా రష్యాతో చర్చలేమిటని యూరోపియన్ దేశాలు కూడా అమెరికాపై మండిపడుతున్నాయి.

## రెండు గంటల్లో 3వేల టిక్కెట్లు ఎలా ఇచ్చారు?



### పరిమితికిమించి ఎందుకు టిక్కెట్లు అమ్మారు?

### రైల్వే, కేంద్రంపై ప్రశ్నలు కురిపించిన హైకోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** అంతపెద్దరద్దీ ఉన్న స్టేషన్‌లో ప్రణాళికాబద్ధంగా టికెట్లను ఇవ్వకుండా ఎందుకు అదనంగా టికెట్లు మితిమీరి పరిమితికిమించి ఇచ్చారని ఢిల్లీ హైకోర్టు కేంద్రం, రైల్వేశాఖలపై ప్రశ్నల వర్షం కురిపించింది. చీఫ్‌జస్టిస్ డికె ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్‌రావు గేదెల నేతృత్వంలోని బెంచ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం పిటిషన్ విచారణచేస్తూ రైల్వేల్లో భద్రతా చర్యలు కొరవడటం వల్లనే ఇలాంటి విషాదకర సంఘటనలు జరుగుతున్నాయని, రైల్వే చట్టాన్ని ఎందుకు ప్రయోగించలేదని ప్రశ్నించారు. ఈ చట్టం ప్రకారం పరిమితికి మించి ఒక కోచ్‌లో ప్రయాణాలుచేస్తే ఆరునెలల జైలు విధించాలని ఉందని, ఇదే నిబంధన సెక్షన్ 147 ప్రకారం వెయ్యిరూపాయల జరిమానా కూడా విధించాలని అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైల్వేచట్టం అమలుచేసారనటానికి మీవద్ద ఆధారాలేమి ఉన్నాయి, మీరు చేపట్టిన చర్యలు ఏమిటి. కోచ్‌లలో ప్రయాణీకుల పరిమితులను ఎందుకు నిర్ణయించలేదు. అనుమతిలేకుండా కోచ్‌లలోకి వస్తున్న వారిపై జరిమానాలు ఎందుకు విధించడంలేదని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

రైల్వే చట్టంలోని వివిధ సెక్షన్లు ఉపయోగించాల్సి ఉండగా ఎందుకు అలా చేయలేదని, రైల్వే అధికారులు కూడా చట్టపరిధిలో కోచ్‌కు నిర్దిష్టమైన సంఖ్యలోప్రయాణీకులను అనుమతించాల్సి ఉండిపోయి చేష్టలుడిగిచూస్తుండిపోయారు దేనికని ప్రశ్నించింది. కోచ్‌లో ఉన్న సీట్లకు మించి బెర్త్‌ల సంఖ్యకు మించి టికెట్లు ఎందుకు విక్రయించారని ఆయన ప్రశ్నించారు. రైల్వేలతరపున వాదనలు వినిపించిన సొలిసిటర్‌జనరల్ తుషార్‌మెహతా కోర్టు మార్గదర్శకాలను అంగీకరించారు.

రైల్వే బోర్డు ఈ పరిస్థితులను కట్టడిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. తదుపరి విచారణను మార్చి 26వతేదీ నిర్వహిస్తామని బెంచ్‌ప్రకటించింది. 11 మంది మహిళలు, ఐదుగురు చిన్నారులతో మొత్తం 18 మంది ఈ తొక్కిసలాటలో చనిపోయారు. రెండుగంటల్లోనే మూడువేల టికెట్లు విక్రయించడం వల్లనే తొక్కిసలాటకు ఎక్కువ ఆస్కారం ఏర్పడిందన్నారు.



## సంగమం నీరు తాగేందుకు సరైనదే!

### అసెంబ్లీలో సిఎం యోగి ఆదిత్యనాథ్

**లక్నో, ఫిబ్రవరి 19:** త్రివేణి సంగమంలో నీటిలో ఫేకాల్ బ్యాక్టీరియా ఉందని, కోలిఫామ్ పూర్తి స్థాయిలో ఉన్నందున తాగేందుకు ఎట్టిపరిస్థితుల్లోను పనికిరాదన్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. మహాకుంభ్‌లోని వివిధ ప్రాంతాల్లోని గంగా యమున సరస్వతి త్రివేణి సంగమం నీటిపై దుష్ప్రచారం తగదని అన్నారు. ఎలాంటి కలుషిత జలాలు కావని తాగేందుకు పనికిరావనడం కేవలం దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో బ్యాక్టీరియా ప్రచారంపై సిఎం యోగి స్పందించారు. అంతకుముందే నేషనల్‌గ్రీన్ ట్రిబ్యునల్ పూర్తిస్థాయిలో కోలిఫామ్, ఫేకాల్ బ్యాక్టీరియా ఉన్నందున తాగేందుకు సంగమం నీళ్లపనికిరావని ప్రకటించింది. శుద్ధిచేయని మురుగుజలాలను గంగా యమునా నదుల్లోకి వదిలిపెడుతున్నారన్న పిటిషన్లను విచారించిన ఎన్జీటీ తాగేందుకు పనికిరావని వెల్లడించడంపై సిఎం యోగి ఖండించారు. కేంద్ర కాలుష్య నివారణ మండలి నివేదికను ఎన్జీటీకి అందచేసింది. గతనెల 12,13 తేదీల్లో చేసిన సర్వేలో ఈ జలాలు కనీసం స్నానంచేసేందుకు సైతం పనికిరావని, తాగేందకు అసలే పనికి రావని కాలుష్య జలాలని వెల్లడించింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వీటిపై స్పందిస్తూ కొందరు వీటిపై దుష్ప్రచారంచేస్తున్నారని, 56.25 కోట్లమంది నేటికి పుణ్యస్నానాలుచేసారని ఇలాంటి నిరాధార ఆరోపణలు తగదని సనతాన ధర్మం, గంగా మాత, భారత్ లేదా మహాకుంభ్‌పై దుష్ప్రచారాలు మానుకోవాలని 56 కోట్లమంది భక్తుల నమ్మకాలను వంచించినట్లే అవుతుందని ఆయన అన్నారు.

తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు తమ ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం శక్తి వంచనలేకుండా సాయం చేస్తుందని అన్నారు. ఈసంఘటనను రాజకీయం చేయడం తగదని అన్నారు. మహాకుంభ్ ప్రారంభంనుంచే రాజకీయాలు ప్రారంభించారని అన్ని పార్టీలతో చర్చించామని, సలహాలు సూచనలు కూడా తీసుకున్నామని చెప్పారు. అయితే మీరు మాత్రం సభను ముందుకు నడిపించేందుకు ఇష్టంలేదన్నట్లుగా ఉన్నారని మండిపడ్డారు. కొందరు ఫాల్తూ కుంభ్ అని, మహాకుంభ్‌పై ఇంతపెద్ద మొత్తం ఎందుకు ఖర్చుచేసారని ఒకరు, మృత్యుకుంభ్ అని మరొకరు ఇలా అన్‌పార్లమెంటరీ పదజాలంతో పోస్టులు పెడుతున్నారని ఎంతమాత్రం తగదని యోగి అన్నారు.

## సిఇసి, ఇసి నియామకాలపై విచారణ పిటిషన్ వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించినచట్టం చెల్లుబాటును సవాల్‌చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదావేసింది. సిఇసి, ఇసిల నియామక ప్యానెల్‌లో గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం ఉండేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సిజెఐని తొలగించి ఆ స్థానంలో కేంద్ర న్యాయశాఖమంత్రికి చోటు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లుప్రవేశఫెట్టి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. కొత్తచట్టాన్ని సవాల్‌చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సిఇసి, ఇసిల నియామకాలకు వ్యతిరేకంగా దాఖలయిన పిటిషన్లపై ఈనెల 19న విచారిస్తామని కోర్టు ప్రకటించింది. పిటిషన్‌పై విచారణలో ఎడిఆర్ తరపున హాజరైన సీనియర్‌న్యాయవాది ప్రశాంత్ భూషణ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్ బెంచ్ ముందు వాదనలు వినిపించారు. ప్యానెల్‌నుంచి సిజెఐని తొలగించి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేయాలని అన్నారు. పిటిషనర్ జయఠాకూర్ తరపున హాజరైన న్యాయవాది వరుణ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం కొత్తచట్టం పరిధిలో నియామకాలుచేపడుతోందని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్‌కుమార్‌ను నియమించిన సంగతి తెలిసిందే. సిఇసి రాజీవ్ కుమార్ మంగళ వారం పదవీ విరమణచేయగా బుధవారం భారత 26వ సిఇసిగా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలుస్వీకరించారు. సిఇసి నియామకంలో కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. చట్టంపై సుప్రీంకోర్టులో సవాల్‌చేసిన సమయంలో అర్ధరాత్రి కొత్త సిఇసిని నియమించడంపై తీవ్ర నిరసన తెలిపింది.

## ఫిలిప్పీన్స్ విమానాన్ని భయపెట్టిన చైనా హెలికాప్టర్!



**బీజింగ్, ఫిబ్రవరి 19:** ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ విమానం సమీపంలోకి చైనా నేవీకి చెందిన హెలికాప్టర్ వచ్చింది. ఒక దశలో రెండూ ఢీకొంటాయని భయడాల్సిన స్థితి నెలకొంది. ఈ ఘటన స్కార్‌బోర్గ్ షోల్ సమీపంలో చోటు చేసుకుంది. వాస్తవానికి ఫిలిప్పీన్స్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో ఉన్న ఈ ప్రదేశం తమదేనని చైనా 2012 నుంచి తమ ఆధీనంలో ఉంచుకొంది. తాజాగా ఫిలిప్పీన్స్ బ్యూరో ఆఫ్ ఫిషరీస్‌కు చెందిన సెస్నా కారవాన్ శ్రేణి సింగిల్ ఇంజిన్ విమానం అసోసియేటెడ్ ప్రెస్ రిపోర్టర్‌ను తీసుకుని ఈ మార్గంలో ప్రయాణమైంది. హఠాత్తుగా వీరిని చైనా నేవీకి చెందిన హెలికాప్టర్ వెంబడించడం మొదలుపెట్టింది. దాదాపు 30 నిమిషాలపాటు ఇది నడిచింది. ఈ క్రమంలో ఫిలిప్పీన్స్ విమానం పైలెట్, చైనా హెలికాప్టర్ పైలట్‌ను ఓ దశలో హెచ్చరించాడు. మీరు మరీ సమీపంలోకి వస్తున్నారు. అది అత్యంత ప్రమాదకరం. మా విమానంలోని ప్రయాణికులు, సిబ్బందికి ప్రాణాంతకం అని పేర్కొన్నారు. ఒక దశలో విమానానికి కేవలం 10 అడుగుల దూరంలోకి హెలికాప్టర్ వచ్చింది. ఈ ఘటనపై అమెరికా రాయబారి మారీ కై కార్ల్‌సన్ స్పందిస్తూ దుందుడుకు చర్యలకు దూరంగా ఉండాలని, విభేదాలకు అంతర్జాతీయ చట్టాలను అనుగుణంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి అని సూచించారు. తమ సముద్ర జలాలకు సమీపంలోకి వచ్చిన విదేశీ విమానలను వేధించడం చైనాకు కొత్తేమీ కాదు. గతవారం ఆస్ట్రేలియాకు చెందిన పి 8 విమానం దక్షిణ చైనా సముద్రంపై నుంచి ప్రయాణించింది. అప్పుడు చైనాకు చెందిన ఫైటర్ జెట్లు దానిని వెంబడించి సుమారు 100 అడుగులు దగ్గరకు వచ్చాయి. అనంతరం నిప్పులు విరజిమ్మాయి. ఒకవేళ పొరపాటున ప్లేయర్లు పి-8 ఇంజిన్‌లోకి వెళితే పెను ప్రమాదం జరిగేది. దాదాపు 13 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలోకి దక్షిణ చైనా సముద్రం మొత్తం తనదేనని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. తన ప్రధాన భూభాగం నుంచి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలోని దీవులను చైనా వదలడంలేదు. దీంతో ఫిలిప్పీన్స్, మలేసియా, తైవాన్, బ్రూనై, వియత్నాంతో వివాదాలు జరుగుతున్నాయి.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనాను దేశంలోకి రప్పించడమే ప్రధాన లక్ష్యం

### యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం!

**ఢాకా, ఫిబ్రవరి 19:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఓ ఉగ్రవాది అంటూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. హసీనా వ్యాఖ్యలపై ఢాకా ప్రభుత్వం స్పందించింది. భారత్‌లో ఆశ్రయం పొందున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానిని తమ దేశంలోకి రప్పించడమే తమ అత్యంత ప్రధానమైన లక్ష్యమని యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం పేర్కొన్నారు. హసీనాను న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సి ఉందని ఆమెను తమకు అప్పగించాలని భారత్‌ను కోరుతున్నామని అన్నారు. ఇందుకు ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లోని హసీనా అవామీలీగ్ పార్టీని రాజకీయాల్లో కొనసాగించాలా, వద్దా అనే విషయాన్ని దేశ ప్రజలు, రాజకీయ పార్టీలు నిర్ణయిస్తాయని అన్నారు. అయితే ఆమె అధికారంలో ఉన్న సమయంలో జరిగిన హత్యలు, అదృశ్యాలు, ఇతర నేరాలకు పాల్పడినవారు తప్పకుండా శిక్ష అనుభవించి తీరుతారని అన్నారు. హసీనా దేశ ప్రధానిగా ఉన్న సమయంలో అధికారం చేజారకూడదనే ఉద్దేశంతో నిరసనకారులను హతత్య చేసినట్లు దాడులు జరిపినట్లు ఐక్యరాజ్యసమితి పేర్కొన్న నివేదికలను ఆయన ఉదహరించారు.

# ఇకపై పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్

## - ప్రక్షాళనకు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు

**విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో లోపాలను గుర్తిస్తూ మరింత మెరుగైన సేవలందించేందుకు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

డిఎస్‌ఓలు, డిఎం లు సిద్దంగా వుండాలని రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు మరియు వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరులోని సివిల్‌సప్లై భవన్లో మంత్రి అధ్యక్షతన బుధవారం జరిగిన సివిల్ సప్లై అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అధికారులంతా టీం స్పిరిట్‌తో ప్రజలకు జవాబుదారీ తనం పెంచేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా సమస్య వస్తే సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ రెండూ కలిసి ఒకే నిర్ణయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ధాన్యంకొనుగోలు ప్రారంభించిన తరువాత మిల్లర్లకు కాకుండా రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్ముతున్నారన్నారు. ఇప్పటివరకు 5.21లక్షల మంది రైతుల నుండి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రు.7,522 కోట్లు విడుదల చేశామన్నారు. 24 గంటల్లోనే రు.7,508 కోట్ల రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. ధాన్యం సేకరణలో 30వేల లారీల ద్వారా 37వేల మంది హమాలీలు ధాన్యం సేకరణలో పాల్గొన్నారన్నారు. 7337359375 నెంబర్‌కు వాట్సప్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. దీపం 2 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తుందన్నారు. రు.714. 75 కోట్లు నగదు లబ్దిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. డెలివరీ బాయ్‌లు అదనపు చార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఈ ఆఫీస్, ఈ ఫైల్‌కు పటిష్టవ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎండియు వాహనాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వచ్చే అడకమిక్ ఇయర్ నుండి మిడ్‌డే మీల్స్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ళకు పౌరసరఫరాల శాఖ నుండి సన్నబియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందిస్తా మన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమీషనర్ సౌరబ్‌గౌర్, ఎండి మనజీర్ జిలానీ, అన్ని జిల్లాల సివిల్‌సప్లై, తూనికలు, కొలతలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

## - గుంటూరు మిర్చి యార్డు పర్యటన పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారు

## - మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి



**ఒంగోలు, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి రైతులను కలిశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, మిర్చి యార్డులోకి అనుమతి లేదని అధికారులు చెప్పినప్పటికి లెక్కచేయకుండా ప్రవర్తించారని రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. బుధవారం ఒంగోలు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నవోదయం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో 14వేల మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డు పర్యటన పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. రైతుల ఆత్మహత్యలు దేశంలో ఏపీని మూడో స్థానంలో జగన్ నిలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో ఎన్నికల కోడ్ ఉందని చెప్పినా జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి యార్డుకు వెళ్లారన్నారు. దుర్మార్గమైన కార్యకలాపాలతో రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో నిలిపివేసిన పోలవరం పనులు, సీఎం చంద్రబాబు పరుగు తీయిస్తున్నారని తెలిపారు. దళితుడు సత్యవర్ధన్‌పై దాడి ఘటనలో నిందితుడు అయిన వల్లభనేని వంశీని జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారని, పోలీసులను ,అధికారులను బయపెట్టే విధంగా జగన్ మాట్లాడారని అన్నారు. ఐదేళ్లు చేసిన దుర్మార్గ కార్యక్రమాల వల్ల బట్టలు ఊడదీసి 11 సీట్లు ఇచ్చారని, ఇలాగే ఉంటే 11 సీట్లు కూడా రావంటూ ఎద్దేవ చేశారు. జగన్‌కు రెడ్‌బుక్ ఫోబియో పట్టుకుందన్నారు. రెడ్‌బుక్ పేరు వింటే నాయకులకు తడిసిపోతుందని అన్నారు. రెడ్‌బుక్ తెరిస్తే ప్రభుత్వం వచ్చిన నెలలోనే వైసీపీ నాయకుల ఇళ్లల్లో ఉండేవాళ్లు కాదన్నారు. జీవితాన్ని ఇచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని వంశీ తగలబెట్టారని విమర్శించారు. సత్యవర్ధన్‌ను వంశీ, ఆయన అనుచరులు బెదిరించి తీసుకెళ్తున్నా వీడియోలు బయటకు వచ్చాయన్నారు. మద్యం విధానంలో దందాలు చేసి తాడేపల్లె ప్యాలెసుకు లక్ష కోట్లు నిధులు మళ్లీంచారని ఆరోపించారు. మద్యంలో జరిగిన అక్రమాలపై సిట్ వేస్తే తాడేపల్లి ప్యాలెస్ వద్ద ఫైల్స్ అన్ని తగలబెట్టారని అన్నారు. జగన్ అక్రమ మద్యం విధానం వల్ల లక్ష మంది లివర్, కిడ్నీ వ్యాధుల భారిన పడ్డారని వెల్లడించారు. జగన్ విపరీతంగా మద్యం ధరలు పెంచడంతో నాటు సారాకు అలవాటు పడ్డారని అన్నారు. నాటుసారా నివారణ కోసం నవోదయం కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్ల దోపిడి కోసం జగన్ పాలసీ తీసుకువస్తే, ప్రజల ఆరోగ్యం కోసం ఎక్సైజ్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టు విషయంలో జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయస్వామి అన్నారు. జగన్‌కు ఆ 11 సీట్లు కూడా ఈసారి రావని ఎద్దేవ చేశారు. వైసీపీకి చెందిన దళిత నాయకులు జైల్లో ఉంటే, జగన్ వెళ్ళలేదని అన్నారు. గుంటూరులో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఆయన మిర్చి యార్డుకు వెళ్లి జగన్ న్యూసెన్స్ చేశారని మంత్రి మండిపడ్డారు. రైతులపై ప్రేమ ఉన్నట్లు జగన్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతు భరోసా నిధులు కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వంలో జగన్ మోసం చేశారని ఆయన ఆరోపించారు. రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకుంది ఎన్డీఏ ప్రభుత్వం అని ఆయన వెల్లడించారు. జగన్ ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు నమ్మరని అన్నారు. అన్ని విధాలుగా జగన్ తిరస్కరణకు గురయ్యారు కాబట్టి రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన జగన్‌ను , ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని మంత్రి డిమాండ్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలను కూడా జగన్ అసెంబ్లీకి పంపడం లేదని అన్నారు. గతంలో అసాంఘికంగా చెలరేగిన వారిపై వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా అరెస్టులు జరుగుతున్నాయని చెప్పారు. పోలీసులను బట్టలు ఊడదీసి కొడతామని జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సప్తసముద్రాలు జగన్ దాటాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలన్నారు. సప్త సముద్రాలు దాటే శక్తి జగన్‌కు లేదని, జగన్ పని అయిపోయిందని అన్నారు. జగన్‌కు మళ్లీ అధికారం అందని ద్రాక్ష అని ఎద్దేవ చేశారు.



# శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మార్పులు - ఎంఆర్ వితరణతో శాశ్వత లైటింగ్

### ప్రభాతవార్తతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖాముఖి

**(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి) పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. తిరుపతిజిల్లాలోని తిరుపతికి 35 కిలో మీటర్ల దూరంలో వెలసిన ఈ దివ్యక్షేత్రంలో శివరాత్రిని బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ దివ్యక్షేత్రం రూపురేఖలు 1989లో ప్రస్తుత శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాం నుంచి ప్రారంభం అయ్యింది. అయన ఆదాయ వనరులను పెంచుటకు కృషి చేస్తే ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దటమే కాకుండా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వేదికగా పలు సంస్కరణలు చేపట్టారు. ఆయన తో 'ప్రభాతవార్త' కలసి నపుడు ఆయన ఆలోచనలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే పరిశీలిద్దాం....**

**ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రికి సంబంధించి మీ అభిప్రాయాలేమిటి?

**ఎమ్మెల్యే :** ఆలయం పవిత్రమైనది.ఇక్కడ ఆధ్యాత్మిక చింతన తప్ప మరోకటి ఉండరాదు.అంతేకాక తాను గత కొంత కాలంగా ఇక్కడ చూస్తున్నాను. అడ్డదిడ్డంగా వీధులు,దుకాణాలు, దర్శనాలకు వచ్చేవారిని తప్పుదారి పట్టించటం,ఆలయం ఎటు చూసినా దళారులు, డబ్బులు వసూళ్ళు.ఇక్కడ రాజకీయంగా ఓ దందా నడిచేది. దానిని మార్చటానికి తన వంతు ప్రయత్నం ప్రారంభించాను

**ప్రభాతవార్త** :మార్పులు చేర్పులు ఎలా చేయాలనుకుంటున్నారు?

**ఎంఎల్ఏ** :తాను దేశంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలను సందర్శించాను. అలాగే మన శ్రీకాళహస్తికి సమీపంలోని తిరుమలేశుని సన్నిధిని అధ్యయనం చేసారు. ఏ భక్తుడు అయినా ఆలయానికి అని వచ్చి అడుగుపెడితేనే వారు బయటి ప్రపంచాన్ని మరచిపోవాలి! మానసిక ప్రశాంత కలిగి ఉండాలి.అది ఆలయంలోని కంచుగడప లోపల అడుగుపెడితేనే ఎవరికైనా ఆ అనుభూతి కల్గుతుంది. అలాంటి వాతావరణమే ఆలయం పరిసరాల్లో కల్గించాలన్నది తన లక్ష్యం.

**ప్రభాతవార్త :** అందుకు మీరు తీసుకుంటున్న చర్యలేమిటి?

**ఎంఎల్ఏ** :మొదటి దశగా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను. అందులో ముఖ్యంగా పరిసరాలలో భక్తులు ఇబ్బంది పడకూడదు. 2017లో నాన్నగారు ఉన్నపుడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గారు మాస్టర్ ప్లాన్‌ను ఆదేశించారు.కానీ గత ఐదేళ్ళలో ఆ పథకం కన్సల్టెన్సిలకే పరిమితం అయ్యింది. మొదటి ప్రయత్నంగా ఆలయ పరిసరాల్లో చక్కటి రోడ్లు, ఆహ్లాదానిచ్చే పచ్చని చెట్లు చక్కటి లైటింగ్ సదుపాయాలతో భక్తుల మనస్సులను ప్రశాంతత కల్పించుటకు చర్యలు తీసుకున్నాను.మాస్టర్‌ప్లాన్‌కు అడ్డంకులను కూడా తొలగించుకుంటున్నాము.

**ప్రభాతవార్త** : ఇప్పటివరకు ఏమైనా ముందడుగు వేసారా?

**ఎంఎల్ఏ** :మీరుచూస్తున్నారు కదా? పట్టణంలో అడుగుపెడుతూనే డివైడర్లను మార్పు చేసాము. చక్కటి చెట్లను ఏర్పాటు చేసాము. అలాగే మన ఆలయ చరిత్రను చాటిచెప్పేవిధంగా డివైడర్ల మధ్య స్థంభాలు వాటిపై నంది విగ్రహాలను ఏర్పాటు చేయిస్తున్నాను. హరితాభివృద్దికి దేవస్థానం రూ.40లక్షలు మంజూరుచేస్తే తన చేతిది మరో రూ.17లక్షలు పడింది. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చేభక్తులు అడుగుపెట్టిన వెంటనే ఆధ్యాత్మిక చింతన వాతావరణ రావాలి.

**ప్రభాతవార్త** : ఆలయంలో లైటింగ్‌కు ప్రధాన్యత ఇస్తున్నట్లుంది.మీ ఆలోచనలేమిటి?

**ఎంఎల్ఏ** : ఔను! శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏటా గతంలో పరిపాలించిన వారు లైటింగ్ ముసుగులో లక్షలకు లక్షలు దిగమింగుతున్నారు. కానీ తాను హైదరాబాదుకు చెందిన 'ఎంఆర్' నిర్వాహాకులను ఒప్పించి రూ.కోటి విరాళంతో శాశ్వత లైటింగ్‌ను తిరుమల తరహాలో ఏర్పాటు చేస్తున్నాను. ఆలయంలోపల సుమారు 295 పిల్లర్లకు,అలాగే బయట 150 పిల్లర్లకు చుట్టుపక్కల ఉన్న నాలుగు గోపురాలకు ఇక శాశ్వత లైటింగ్ ఉంటుంది. ప్రధాన రోజుల్లో లైటింగ్‌తో ఆకట్టుకుంటుంది.

**ప్రభాతవార్త** :ఈ ఏడాది పూల ముస్తాబులకు సంబంధించి ఏం చర్యలు తీసుకున్నారు?

**ఎంఎల్ఏ** : గతంలోపరిపాలించిన పాలకులు పూల ముస్తాబుల ముసుగులో బెంగుళూరు వాసులచే సొమ్ములు దిగమింగినట్లు రికార్డులు చెబుతున్నాయని అయితే ఈ ఏడాది హైదరాబాదుకు చెందిన ఓ సంస్థతో చేయిస్తున్నామని వారురూ.వంద కోట్లు అయితే తప్ప పనులు చేయరని అలాంటి వారిచే 'కాస్ట్ టు కాస్ట్'కు చేయిస్తున్నాను.

**ప్రభాతవార్త** : ఈ సారి లేజర్ లైటింగ్ అన్నారు.అమలు చేస్తున్నారా?

ఎంఎల్ఏ : చేయగల్గిందే చెబుతాను. ఈ సారి ప్రత్యేక ఆకర్షణ లేజర్ లైటింగ్. ముంబాయికి చెందిన భరత్ లైటింగ్‌చే సుమారు రూ.1.5కోట్లతో చేసే ఏర్పాట్లును అతి తక్కువ ఖర్చు రూ.20లక్షల లోపల లేజర్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాను. ఎలా ఉంటుందో చూడండి.

**ప్రభాతవార్త** : సాంస్కతిక కార్యక్రమాలను ఎలా ఎంపిక చేసారు?

**ఎఎల్ఏ** : శ్రీకాళహస్తీశ్వరుడు నటరాజు అంటారు. ప్రతి ఏడాది శివరాత్రికి ప్రత్యేంగా 13 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఈ ఏడాది స్థానిక కళాకారులతో పాటు రాష్ట్ర సాంస్కృతిక చైర్మెన్ తేజశ్రీని సంప్రదించి రాష్ట్ర స్థాయిలో పేరెన్నిక గన్న కళాకారులచే కార్యక్రమాలను నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నాము. పలువురు సినీ ప్రముఖులను కూడా ఆహ్వానించామన్నారు.

**ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన ఆలయంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు? భక్తులకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?

**ఎంఎల్ఏ** : మహాశివరాత్రిలో ఈ ఏడాది ఈ నెల 25 నుంచి 28 వరకు ఎంతో కీలకంగా భావిస్తున్నారు. 25న మధ్యాహ్నం 4.30గంటలకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలను అందిస్తున్నారు. అలాగే మహావివరాత్రి పర్వదినాన ముగ్గురు మంత్రుల సూచనలను అమలు చేస్తాము.వారు భక్తులకు కల్పించుటకు ఆదేశించిన ఆదేశాలను అమలు చేస్తాము. సామాన్యభక్తులకు పెద్ద పీట వేస్తున్నాము. వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తి కరంగా శివయ్యను దర్శించుకోవాలి. స్వామి గర్భగుడి ముందు ఓ స్వామిలా పీఠాధిపతిలా కూర్చొని దేవుని కన్నా ముందు తన దర్శనం చేసుకునే దుస్థితిని భక్తులకు ఉండదు. చివరగా నేను చెప్పేది వచ్చిన ప్రతి భక్తుడు స్వామిని దర్శించుకొని అభివృద్దికి ఇంకా తమకు బలం ఇవ్వాలని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

# ముస్లిం బాలికలకు సంప్రదాయ విద్య అవసరం

## జమియతుల్ ఉలమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలాన ఇలియాస్ సాహెబ్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** సమాజంలో ముస్లిం మహిళలకు బాలికల స్థాయి నుంచే సంప్రదాయ విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి రాష్ట్రాల జమియతుల ఉలమ ఉపాధ్యక్షులు మౌలాన ఇలియాస్ సాహెబ్ అన్నారు.బుధవారం ఆయన శ్రీకాళహస్తిలోని జామియా మస్‌జిద్‌లోని బాలుర మద్రసాలోనూ, బాలికల మద్రసాలో ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జామియామస్‌జిద్‌లోని మద్రసాలో 13 సంవత్సరాల బాలుడు 'దివ్యఖుర్‌ఆన్‌ను'కంఠస్థం చేసి వినిపించారు. శ్రీకాళహస్తి చెందిన న్యాయవాది బషీర్ సాహెబ్ తన కుటుంబం నుంచి ఓ చిన్నారిని ఆధ్యాత్మిక చింతనకు నిర్ణయించారు. దివ్యఖుర్‌ఆన్‌లో ప్రతి ఇంటి నుంచి దివ్యఖుర్‌ను పఠించే హాఫీజ్‌లు కావాలన్న పిలుపుతో తన తనయుడు 'హౌఫైజా'ను హాఫీజే ఖుర్ ఆన్ చేసారు. రెండేళ్ళ పాటు కఠోర సాధనతో ఆ బాలుడు దివ్యఖుర్ ఆన్‌ను కంఠస్థం చేసి ఉత్తీర్ణులయ్యారు. ఆ బాలునికి అల్లాహ్ దువాను అందిస్తూ సర్టిఫికేటును అందించారు. ఆ బాలునికి జామీయామస్‌జిద్ పేష్ఇమాం హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ మెలుకులను నేర్పించారు. ఈ కార్యక్రమాల్లో అతిధి మౌలాన ఇలియాస్‌సాహెబ్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన జిల్లా జమియతుల్ ఉలమ అధ్యక్షులు ముఫ్తీ నయి సాహెబ్,హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ ఆలీ,ముతవల్లి అక్రమ్‌సాహెబ్,ఖాజీ షరీఫ్ అనే మున్నా,అంజద్‌సాహెబ్, గోరా,మీర్జాం సాహెబ్, హాజీ గౌస్ సాహెబ్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో ముఫ్తి నయిం సాహెబ్ బాలికల మద్రసను నిర్వహిస్తున్నారు.ఈ మద్రస వార్షికోత్సవాన్ని ఏర్పాటు చేసారు. ఈ సభకు అతిధిగా విచ్చేసిన మౌలానా ఇలియాస్ సాహెబ్ మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలపై సాగుతున్న దాడులు,దౌర్జాన్యాలు,వేధింపులకు కారణం సంప్రదాయ విద్యపై అవగాహన లేకపోవటం. అంతేకాక మహిళలను ఇంటి పనికి వంట పనికి పరిమితం చేస్తున్నారు.


మదరసాలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇలియాస్ సాహెబ్

# విద్యా నైపుణ్యాలు పెంచేందుకు సింఘానియా ట్రస్టుతో ఒప్పందం

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ విద్యావిధానం లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యా నైపుణ్యాల అభివృద్దికి సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్టుతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు.ఆయన సమక్షంలో ఈ ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలుత ట్రస్టు తరపున తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయులపనితీరు, శిక్షణ, ఆంగ్లభాష శిక్షణ, జాతీయ విద్యా విధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానంలాంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురానున్నారు. ఐదేళ్లపాటు అమలు చేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. తిరుపతి తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు సింఘానియా స్కూల్ ట్రస్ట సేవలను విస్తరిస్తారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏపీ విద్యా రంగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. సింఘానియా గ్రూపు ఛైర్మన్ గౌతమ్ హరి సింఘానియా మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నిపుణులుగా తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు.

ఉపాధ్యాయులను ఆధునిక సాంకేతికతతో సన్నద్ధం చేయడంతోపాటు డిజిటల్ సాధనాలను ఉపయోగించేలా శిక్షణ ఇస్తామన్నారు.

అనంతరం సింఘానియా గ్రూపు ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ సాంకేతికతతో కూడిన అభ్యసరం, ఆంగ్ల ప్రావీణ్యం పై దృష్టిసారించినట్లు వెల్లడించారు.

### కావలి ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం!

# శ్రీదేవి రచించిన రెండు పాఠ్యపుస్తకాలను ఎంపికచేసిన రాష్ట్ర ప్రభుత్వం



**కావలి,(నెల్లూరు) ఫిబ్రవరి19 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రి కళాశాల ఆంగ్ల (ఇంగ్లీషు) అధ్యాపకురాలు గుంటుపల్లి శ్రీదేవిచౌదరికి అరుదైన గౌరవం లభించింది. ఆమె రచించిన రెండు ఆంగ్ల పాఠ్యపుస్తకాలను ఎ.పి ప్రభుత్వ పౌరగ్రంధాలయశాఖ మంగళవారం ఎంపికచేయడంతో ఆమె కావలి బావుటాను ఎగురవేసినట్లయింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎంతో పేరుప్రఖ్యాతులు గడించి అందరి మన్నలను పొందారుకూడా. అటు రాజకీయపరంగా, ఇటు ఉన్నత విద్యావంతురాలుగా, ఆంగ్ల అధ్యాపకురాలుగా, ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలకు ఆమె ఎంతోపేరు తెచ్చారు. శ్రీదేవిచౌదరి రచించిన కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్‌స్కిల్స్, బిజినెస్ కమ్యూనికేషన్ అనే రెండు పుస్తకాలను ఎ.పి ప్రభుత్వ పౌరగ్రంధాలయశాఖ 2022-23 విద్యాసంవత్సరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఎంపికచేసింది. ఆ సమావేశంలో ఆమోదం పొందిన పుస్తకాల వివరాలను ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి విడుదలచేసింది. శ్రీదేవిచౌదరి గతంలోనూ అకడమిక్ పుస్తకాలను, నైపుణ్యాభివృద్ధి సంబంధిత పుస్తకాలను, ప్రాంగణ ఎంపికల పుస్తకాలను వెలువరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడారు. తాను రచించిన పుస్తకాలను ప్రచురించిన స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ సంస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ టిడిపి కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ ఉమ, పలువురు అధ్యాపకులు, రచయితలు, పరిశోధకులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# సమగ్ర పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా రూ.25 వేల కోట్ల పెట్టుబడులు

## - రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ 2025 (ఎస్ఏటీటీఈ) వేదికపై రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమగ్ర పర్యాటకాభివృద్ధే కీలకంశంగా ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు టార్గెట్‌గా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ 2025 (ఎస్ఏటీటీఈ) వేదికగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తనదైన శైలిలో ప్రసంగించి ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నారు. పర్యాటక రంగంలో ఉత్తేజం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తింపజేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీలో పర్యాటకాభివృద్ధి కోసం నూతన టూరిజం పాలసీ 202429 తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మోలిక వసతుల కల్పన తదితర విభిన్న కార్యక్రమాలు, పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు.

# వివాద రహితంగా టీచర్ల బదలీలు : మంత్రి లోకేష్

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వివాదాలకు తావు లేకుండా ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియారిటీ జాబితాలను రూపొందించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఎక్స్‌వేదికగా ఆయన ఈ విషయ వివరించారు. జీఓ117 కు ప్రత్యామ్నాయ వ్యవస్థపై త్వరలోనే ప్రజాప్రతినిధుల సదస్సు నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించాలని అధికారులకు సూచించామన్నారు. జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల వేతనాల పెంపుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటాం. వచ్చే విద్యాసంవత్సరంనుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే లెక్చరర్ల బదిలీలు చేపట్టాలి. జగన్ ప్రభుత్వంలో అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 42 వల్ల 80 ఎయిడెడ్ కళాశాలలు మూతపడ్డాయి. దీని వల్ల విద్యార్థులకు నష్టం వాటిల్లింది. ఎయిడెడ్ కళాశాలల ఆస్తులను కాజేసేందుకు జగన్ కుట్ర పన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 42 ద్వారా జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా పాలసీని రూపొందించాలి.

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్

## -17 లక్షలు విలువగల 174 కేజీల గంజాయి స్వాధీనం

**వెంకటాచలం,(నెల్లూరు) ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** గత కొంత కాలంగా జాతీయ రహదారిపై గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారని జిల్లా ఎస్పి కృష్ణ కాంత్‌కి సమాచారం రావడంతో ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డిఎస్పి గట్టమనేని శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు.18వ తేదీ వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద సిఐ సుబ్బారావు,ఎస్సై ఆంజేనేయులు సిబ్బందితో కలిసి తనిఖీ చేయుచుండగా నెల్లూరు నుండి గూడూరు వెలుతున్న ఆటో పోలీస్ వాహనాలు చూసి వెనక్కి తిప్పుకొని వెల్తుండగా పోలీసులకు అనుమానం రావడంతో ఆటోను వెంబడించి పట్టుకున్నారు.ఆటోలో 10 ప్యాకెట్లు గంజాయి 174 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులను విచారించగా గత కొంత కాలంగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు.వివరాలు అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం టి-దాకబండ గ్రాయానికి చెందిన మేదరి బాలకృష్ణ తండ్రి వెంకటయ్య ,మేదరి రాజి రాజమ్మ, మయప్ప,ముత్యాలు,దేవమ్మ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు విచారణలో వెల్లడయింది.దీంతో వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు.


గంజాయితో పట్టు పడిన ఆటో

# చిన్నశేష వాహనంపై బద్రీనారాయణుడు సరస్వతీదేవీ అలంకరణలో శ్రీనివాసుడు

**చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** పండరీపురం పాండురంగస్వామి వారి అలంకరణలో శ్రీనివాసుడు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగా పురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి శ్రీవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరించారు. రెండవ రోజున ఉదయం స్వామివారు పండరీపురం పాండురంగస్వామి వారి అలంకరణలో చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పాంచభౌతిక ప్రకృతికి సంకేతం. చిన్నశేష వాహనం పంచభూతాత్మకమైన విశ్వానికి, అందులో నివశించే జీవునికి వరాలిస్తుంది. విశ్వం కనిపించే శ్రీవారి ప్రకృతి, విష్ణువు ఈ ప్రకృతికి ఆధారమై నడిపించే శక్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే విశ్వాన్ని రక్షించేందుకు తానొక్కడే చిన్నశేష వాహనంపై విహరిస్తారు. పంచశిరస్సుల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయఃప్రదం. శేషవాహనోత్సవాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వలన కలిగే దుష్ప్రభావాలు భక్తులు కళ్యాణప్రదులై, సుఖశాంతులతో వర్థిల్లగలరని శాస్త్రాలు వివరిస్తున్నాయన్నారు. ఈ వాహన సేవలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# బంకు కోసం ఇరిగేషన్, నేషనల్ హైవే స్థలాలు ఆక్రమణ

## - పచ్చదనానికి పాతర
## - చోద్యం చూస్తున్న అధికారులు



**తొండంగి , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త )**

అన్నవరం బైపాస్ రోడ్డు ను ఆనుకుని ఉన్న తొండంగి మండలం బెండపూడి పంచాయతీ పరిధిలో నేషనల్ హైవే పక్కనే హిందూస్తాన్ పెట్రోల్ బంకు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. తుని టు రాజమండ్రి వెళ్ళే వైపు బంకు నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణానికి సమీపంలోని ఇరిగేషన్ కాలువ, నేషనల్ హైవే స్థలాలను ఆక్రమించి బంకు యజమాని పనులు చేయిస్తున్ననూ, ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో బంకు యజమాని నిభందనలు ఉల్లంఘించి తన ఇష్టమొచ్చినట్లు పనులు చేయిస్తున్నారని సమీప రైతులు ఆరోపిస్తున్నారు. తుని వైపు నుండి ఆ ప్రాంతానికి చేరుకునే వాహనాలకు దూరం నుండే బంకు స్పష్టంగా కనిపించేలా ఉండేందుకు, హైవే అథారిటీ పరిధిలో గల నాలుగు భారీ వృక్షాలను రెండు జెసిబి వాహనాలతో రాత్రికి రాత్రి యుద్ధప్రాతి పదికన తొలగించి , ఉదయానికి కనీసం ఆనవాలు కూడా లేకుండా మట్టితో చదును చేసి పచ్చదనానికి పాతరేసారు. హైవే పక్కన చిన్న చిన్న బడ్డీల కొట్లు పెడితేనే పర్మిషన్ లేదంటూ, ఆఘమేఘాలపై తొలగించే హైవే అధికారులు, బంకు యజమాని నిభంద నలు విరుద్ధంగా వ్యవహరిస్తున్ననూ స్పెష ల్ ప్యాకేజ్ లకు లొంగి ఉంటారని ఆ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ కాలువను కూడా వాళ్ళ వ్యాపార కార్యకలాపాలకు అనుకూలంగా మార్చుకున్నారని, కాలువ గట్లు తెగ్గొట్టి ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

# సర్పంచ్ రామకృష్ణ మృతి బాధాకరం

## - ఉమ్మడి తూర్పు జిల్లా సర్పంచ్‌ల సమైక్య అధ్యక్షురాలు శాంతకుమారి



**అంబాజీపేట , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**

పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ మృతి చాలా బాధాకరమని, ఆ కుటుంబానికి ఆయన లేని లోటు తీర్చలేనిదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సమైక్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ సర్పంచ్ రామకృష్ణ ఈనెల 16న మృతి చెందారు.పి.గన్నవరం నియోజవర్గ సర్పంచ్ల సమైక్య అధ్యక్షులు అడబాల తాతకాపు ఆధ్వర్యంలో పలు గ్రామాల సర్పంచులు రామకృష్ణ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. సర్పంచ్ రామకృష్ణ మృతికి చింతిస్తూ లంకల గన్నవరంలో ఆయన స్వగృహం రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుడు రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడికుదురు మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణ కుమారి, బల్ల శ్రీను,వై. చిట్టిబాబు,మద్దాల బాబురావు, తెలగరెడ్డి సూర్య ప్రకాశరావు,గెడ్డం మంగాదేవి, గుబ్బల దుర్గా పండు, గూడాల రామారావు, కండి అరుణ కుమారి, నాగాబత్తుల వెంకట సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# మార్కెట్ అభివృద్ధికిరూ కోటి పది లక్షలు అంచనాలు

**కాట్రేనికోన , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**



మండల కేంద్రమైన కాట్రేనికోనలోని డైలీ మార్కెట్ ప్రాంతం అభివృద్ధికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పచ్చ జెండా ఊపారు. సుదీర్ఘ కాలం పాటు ఈ ప్రాంత వాసులు వర్షాకాలం వచ్చిన ప్రతిసారి ముంపులో కాలం వెళ్లబుచ్చేవారు. ఈ విషయాన్ని ముమ్మిడివరం శాసనభ్యులు దాట్ల సుబ్బరాజు దృష్టికి కూటమి నాయకులు తీసికెళ్లడంతో అయన వెంటనే స్పందించి శాశ్వత ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. అంచనాలు తయారు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. 11 అడుగుల సిసి రోడ్డు, రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ ఎనిమిదడుగులుకు రూ 50 లక్షలు ఉపాధి హామీ నిధులుకేటాయించారు. మార్కెట్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని సిసి బేవర్స్ తో నిర్మించేందుకు మరోరూ 50 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులను కేటాయించారు. అంతేకాక పుట్టి సుబ్బారావు ఇంటి నుండి సుమారు 180 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మాణానికి మరో రూ 10 లక్షలు కేటాయించారు. మార్కెట్ ప్రాంతం అభివృద్ధికి రూ కోటి 10 లక్షలు కేటాయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీసీ డ్రైనేజీకి సంబంధించి ఇప్పటికే మార్కింగ్ ఇచ్చారు. ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

# పెదపట్నంలంకలో ఘనంగా వీరభద్రస్వామి సంబరం



**మామిడికుదురు , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త )**

మండలం లోని పెదపట్నంలంక గ్రామంలో బుధవారం వీరభద్రస్వామి సంబరం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం,బాణాసంచా కాల్పుల నడుమ నృత్యాలు చేస్తూ వైనతేయ గోదావరి నది వరకు స్వామి వారిని ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం నది ఒడ్డున యేడిద గోపాలకృష్ణ,పద్మ దంపతుల ఆధ్వర్య ంలో వీరబ్రహ్మేంద్రస్వామి సంబరాన్ని వైభవంగా జరిపించారు. విఘ్నేశ్వరపూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామికి సూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశింపచేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించు కున్నారు. అనంతరం భారీ స్థాయిలో అన్నసమారాధన జరిగింది.

# ఛత్రపతి శివాజీకు ఘనంగా నివాళులర్పించిన బిజెపి నేతలు

**కాకినాడ రూరల్ , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**



మరాఠా యోధుడు చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఇంద్రపాలెం గ్రామంలో చత్రపతి శివాజీ కాంస్య విగ్రహానికి బిజెపి నేతలు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా కార్యదర్శి కాళ్ల ధనరాజు మాట్లాడుతూ చత్రపతి శివాజీ నిస్వార్థంగా ప్రజలను పరిపాలించారని,మచ్చ లేని వ్యక్తిత్వంతో అందరికీ ఆదర్శంగా అన్నారు. 27 ఏళ్లపాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పారని అన్నారు. భారతదేశ రాజులలో అగ్రగన్యుడైన శివాజీ ప్రజల కోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి వ్యక్తిగత విలాసాలకు ఎటువంటి వ్యయం చేయక ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డాడని అన్నారు.ఈ కార్యక్రమంలో కె.గంగరాజు, జిల్లా కార్యదర్శి చోడిశెట్టి రమేష్ బాబు, జిల్లా ట్రెజరర్ పైడ రవీంద్ర, జిల్లా కార్యదర్శి గట్టి సత్యనారాయణ, ఘంటసాల గోవింద రాజులు,గౌతు చిన్న, ముసలిగంటి సురేష్, రాంబాబు, కర్రి సత్యనారాయణ రాజు,జయలక్ష్మి, పార్ధు తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు అరెస్ట్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**

మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితుడను బుధవారం అరెస్టు చేసినట్లు ముమ్మిడివరం ఎస్ఐ డి జ్వాలా సాగర్ తెలిపారు. అనాతవరం గ్రామానికి చెందిన పరమట దుర్గాప్రసాద్ (బులి చంటి) అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను సోమవారం కిడ్నాప్ చేసి అమలాపుర తీసుకెళ్లి అక్కడ ఒక నివాస గృహంలో ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక అపహరణకు గురైన విషయం తెలుసుకున్న బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం దుర్గాప్రసాద్ కు తెలియడంతో ఆ బాలికను 20 రూపాయలు ఇచ్చి అమలాపురం ఎర్ర వంతెన వద్ద బస్సు ఎక్కించి పంపించి వేశాడు. ఈ కేసును అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్ పర్యవేక్షణలో ముమ్మిడివరం సిఐ ఎం మోహన్ కుమార్, ఎస్సై డి జ్వాలా సాగర్ లు కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నిందితుడిపై పోక్సో, అత్యాచారం కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

# ఇండ్లు కోల్పోయిన వారు త్వరితగతిన నష్టపరిహారం తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

**మామిడికుదురు,ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త )**



జాతీయ రహదారి 216 రోడ్డు నిర్మాణ భూసేకరణకు సంబంధించి అవార్డు పాసైన భూములు ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు త్వరితగతిన నష్టపరిహారాలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని మామిడికుదురు గ్రామంలో 300 మీటర్లు, పాశర్లపూడి గ్రామంలో 200 మీటర్లు మేర నిలిచిపోయిన రోడ్డు పనులను ఆయన పరిశీలించి నిర్వాసితులతో సంప్రదించి ప్రజా ప్రయోజనం దృష్ట్యా రోడ్డు నిర్మాణం ఆగదని ఇప్పటికీ అటు- ఇటు రోడ్ల నిర్మాణం పూర్తి కావచ్చిందని కేవలం స్థానికంగా మాత్రమే నిర్వాసి తుల నుండి అభ్యంతరాలు ఉత్పన్నమయ్యాయని ఆయన తెలిపారు. భూములు, స్థలాలు నష్టపరిహారాల కొరకు అవార్డు పాసైన నిర్వాసితులందరూ తమ యొక్క నష్టపరిహారాలను వెంటనే తీసుకోవాలని, తదుపరి ప్రభుత్వం దృష్టికి భూముల విలువ పెంపు డిమాండ్ తీసుకుని వెళ్లి తగు న్యాయం చేకూర్చడానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా రోడ్డు నిర్మాణంలోఅడ్డంకిగా ఉన్న గృహాల నిర్వాసితులు రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలనే నెపంతో ఇళ్లకు విలువలను గణించడానికి సహకరించడం లేదని, ఆ విధంగా చేయడం సరికాదని వెంటనే అంగీకరించి గృహాల విలువలు ఆర్ అండ్ బి అధికారుల ద్వారా అంచనాల విలువలు గణించేందుకు సహకరించాలనీ సూచించారు. నిర్వాసితులకు ప్రభుత్వపరంగా అన్ని విధాల సహకారం అందించడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారిని కె.మాధవి, జాతీయ రహదారి 216 సహాయ ఇంజనీర్ వెంకటరమణ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు, కె.ప్రభాకర్,తహశీల్దార్ సుబ్రహ్మణ్యచారి సిబ్బంది పాల్గొన్నారు. ఈదరాడలో.... ఈదరాడ గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ క్షేత్రస్థాయిలో సందర్శించి భూ రికార్డుల ఆధారంగా రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నది లేనిది పర్యవేక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రీ సర్వేను పారదర్శకంగా భవిష్యత్తులో ఎటువంటి భూవివాదాలకు తావు లేకుండా నిర్వహించి రెవెన్యూ రికార్డులను పూర్తిగా సేకరించి ఆన్లైన్ లో పొందుపరచాలని ఆదే శించారు. కరవాకలో.... కరవాక గ్రామంలో పర్యావరణానికి విఘాతం కలిగించే విధంగా చెరువులు ఉన్నాయని ధ్రువీకరించిన జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం ఉన్న ఆక్వా చేపల చెరువులు ధ్వంసం చేస్తున్న తీరును ఆయన క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేస్తూ అక్రమ చెరువులు త్వరితగతిన ధ్వంసం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో రెవెన్యూ డివిజనల్ అధికారిని కె.మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, మత్స్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సరస్వతి పూజ



**రౌతులపూడి , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని మల్లంపేట ప్రాథమిక పాఠశాల యందు సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా విద్యార్థులచే ఉపాధ్యాయులు ఘనంగా సరస్వతి పూజను నిర్వహించారు. గ్రామ ఆలయపండితులు ఏ హనుమంత ప్రసాద్ మంత్రో చరణతో విద్యార్థులచేత పూజలు చేయించారు. అనంతరం స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిబాబు, శ్రీను పాల్గొన్నారు.

## వైభవంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి




**కోనసీమ బ్యూరో,ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త )**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామంలో శ్రీ లక్ష్మి నరసింహ యువత ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నీ వైభవంగా నిర్వహించారు. మొదట ఛత్రపతికి పాలాభిషేకము చేసి, నివాదాలు చేసారు. మనలను విడిచి 390 సంవత్సరాలైనా ఆయన ప్రతి రూపం కనుల ముందు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ జయంతి చేయటం నా అదృష్టం గా భావించాననిఎంపీటీసీ నాగరాజు తెలిపారు. నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు నిరుపేద కుటుంబాలకురూ 5 వేలు విలువ చేసే కిరాణా సామాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షులు బైర నాగరాజు, నల్లా సత్య కిరణ్ ప్రసాద్, సూరిబాబు, సత్తిబాబు, నాని, సభ్యులు, స్నేహతులు పాల్గొన్నారు.

# కుండలేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రి శోభ

**కాట్రేనికోన , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**



కాట్రేనికోన మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కుండలేశ్వరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ కుండలేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రి శో భ సంతరించుకోనుంది. దక్షిణకాశీగా పేరొందిన ఈ పుణ్యక్షేత్రానికి ప్రతిసంవత్సరం భక్తులు వేలాదిగా తరలివస్తారు. ప్రయాగలోని కుంభమేళాకు వెళ్లలేని భక్తులు ఈ సంవత్సరం కుండలేశ్వరం తండోపతండాలుగా వస్తారని అంచనా వేస్తున్నారు. దీనికి తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**కుండలేశ్వరస్వామి దేవాలయం చరిత్ర**

కుండలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన పురాణాలు మరియు కథలు చాలా ప్రాచీనమైనవి. శ్రీనాధ సార్వభౌమ మహాకవి తను రచించిన భీమఖండం (భీమేశ్వరపురాణం) లో గోదావరి నదిని వర్ణిస్తూ ఈ దేవాలయాన్ని ప్రస్తావించారు. గౌతమీ మహత్యంలో, బ్రహ్మదేవుడు నారదుడికి ఈ క్షేత్రం యొక్క మహిమను వివరించాడు. గోదావరి నది దక్షిణ ఒడ్డున ఉన్న కుండలేశ్వరం వద్ద ప్రవహిస్తూ తన వేగాన్ని తగ్గించడానికి సిద్ధమైంది తద్వారా ఈ ప్రాంతం పుణ్యక్షేత్రంగా మారింది. కుండలేశ్వర స్వామి దేవాలయం అనేక భక్తుల సందర్శనకు ఆకర్షణగా ఉంటుంది ముఖ్యంగా గోదావరి పుష్కర సమయాల్లో ఈ ఆలయం పుణ్యస్నానాలకు మరియు ప్రత్యేక పూజలకు ప్రసిద్ధి చెందింది. ఈ సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కారించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలిరావచ్చనే అంచనాతో తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ప్రత్యేక పూజలు, అలంకరణలు**

శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. ముఖ్య పూజలుగా రుద్రాభిషేకం, మహామృత్యుంజయ హెూమం, లింగార్చనలు నిర్వహించనున్నారు. రాత్రి జాగరణ కార్యక్రమంలో భక్తులు శివ తాండవ స్తోత్రాలు, భజనలతో అలరించనున్నారు.

# శివ కేశవులను దర్శించిన ప్రముఖులు

## - రాష్ట్ర అటవీ శాఖ చైర్మన్ సృజన కృష్ణ రంగారావు,ఎంపీ తంగేళ్ల,కుడా చైర్మన్ తుమ్మల

**గండేపల్లి , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**



జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న హరిహరుల ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శివ కేశవుల విగ్రహాలను రాష్ట్ర అటవీ శాఖ చైర్మన్ సృజన కృష్ణ రంగారావు, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తదితరులు దర్శించుకున్నారు. ఆలయాల విశిష్టత గురించి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను వివరాలు అడిగి తెలుసుకున్న సృజన కృష్ణ రంగారావు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

ఈ సందర్భంగా సృజన కృష్ణ రంగారావు మాట్లాడుతూ ఎప్పుడో పురాణాల్లో కోటి పార్థివలింగాలతో రుద్రాభిషేకం, హరిహరుల విగ్రహ ప్రతిష్ట వంటి గొప్ప కార్యక్రమాలు జరిగేవని చదవడం వినడం తప్ప కనులారా చూసామంటే అది ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన గొప్ప యజ్ఞమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, రేఖా బుల్లి రాజు, రాయవరం శ్రీను, మరిచే రామకృష్ణ, ఉలిసి ఐరాజు,మొగిలి గంగాధర్, సత్యం రాజా, అధిక సంఖ్యలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆదిత్యలో ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్‌పై శిక్షణ

**గండేపల్లి , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**



గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య డిగ్రీ పిజి కళాశాల, 'మేనేజ్మెంట్ ఎం.బి.ఏ విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ ఆధ్వర్యంలో ' ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్" అంశం పై వర్క్ షాప్ నిర్వహించామని కళాశాల డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ సర్టిఫైడ్ ట్రైనర్ వి. నరేంద్ర పాల్గొన్నారు . ఈ వర్కుషాప్ లో భాగంగాహౌఇన్వెస్టర్స్ పెట్టుబడి పెట్టడం ద్వారా ఆర్జించే లాభాలు మారుతున్న కాలానుగుణంగా మానేజ్మెంట్ విద్యార్థులు ఇన్వెస్ట్మెంట్ రిస్క్, రిటర్న్ వంటి వాటిలో పరిజ్ఞానం ఆర్జించిన పుడు మాత్రమే వారికి లాభదాయకం గా ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ప్రైమరీ అండ్ సెకండరీ మార్కెట్ కొనుగోలు అమ్మకం సెక్యూరిటీ, షేర్ మార్కెట్లలో పెట్టుబడి దారులు ప్రొటెక్షన్ కాపాడుట కొరకు సెబీ చేస్తున్నటువంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ. విజయ భార్గవి, మానేజ్మెంట్ విభాగాధిపతి ఎం. గోవర్ధన్ రెడ్డి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, మేనేజ్మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడిఓ నాతి బుజ్జి



**గండేపల్లి , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలంలోని అంగన్ వాడీ టీచర్లకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూడు రోజుల జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులను ఎంపీడీఓ నాతి బుజ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో నేర్చుకున్న పాఠ్యాంశాలు, అభ్యాసనాలు చక్కగా వారి దైనందిన ఉద్యోగ నిర్వహణకు అనుసంధానం చేసుకుంటూ పని చేయాలని అన్నారు. శిక్షణల ద్వారా ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని పెంపొందించుకుని, అంగనవాడీ కేంద్రాలలో చిన్న పిల్లలు భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ పార్వతి, మాస్టర్ ట్రైనర్స్ గా ఉపాధ్యాయులు గంగాధర్, భాస్కర్, మాధవి, అన్ని గ్రామాల అంగన్ వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి శిక్షణ తరగతులు

**- కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ నాగేశ్వరరావు**



**ప్రత్తిపాడు , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
పూర్వపు ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన ధర్మవరం హైస్కూల్లో జరుగుతున్న అంగన్వాడి టీచర్ల ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీల ను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలలో మానసిక వికాసం అభ్యసనా నైపుణ్యాలను పెంపొందించుటకు ఈ ట్రైనింగ్ ఉపయోగపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాజబాబు, సూపర్వైజర్ ఎన్. వరలక్ష్మి, చక్రవేణి తదితరులు పాల్గొన్నారు

# 'దళిత ద్రోహి వైఎస్ జగన్'



**గోపాలపురం , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
ఒక దళితుడిని హింసించి, కిడ్నాప్ చేసిన వ్యక్తిని పరామర్శించడానికి వెళ్లిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహి అని గోపాలపురంలో తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. జగన్ హయాంలో 11,500 మంది దళితులపై దాడులు జరిగాయయన్నారు. 188 మంది దళితులు హత్యకు గురైయ్యారని, 637 మంది దళిత మహిళల పై అత్యాచారాలు జరిగాయని చెప్పారు. దళిత డాక్టర్ సుధాకర్ హత్య దగ్గరనుంచి, దళిత డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేసిన అనేక ఘటనలను మర్చిపోయారా జగన్ అని వారు ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూనపోం ప్రసాద్, పడమట శ్రీనివాస్, దాసరి రవి, కొడవటి చిన్నవెంకటెష్, గంగయ్య, శామ్యూల్ రాజు, మల్లిపూడి సుబ్బారావు, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎల్ఎస్ ఏ ద్వారా న్యాయ సహాయం పొందవచ్చు




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
ధ్రువపత్రాల జారీపై అవగాహనా కార్యక్రమం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ .శ్రీలక్ష్మి పాల్గొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో గల కోర్టు హాల్ లో, బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీ ఎల్ ఎస్ ఏ కార్యదర్శి ఎస్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ, సకాలంలో జనన, మరణ, పెళ్లి, ఆదాయ ధ్రువ పత్రాల జారీ పై, మునిసిపల్, సచివాలయ సిబ్బంది నిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. వివిధ ధ్రువ పత్రాలను సకాలంలో పొందడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, వాటి వలన వచ్చే ప్రయోజనాలు , వాటి ఆవశ్యకత గురించి వివరించారు. సబ్ రిజిస్ట్రార్ ఆర్ రాంబాబు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో, పెళ్లి ధ్రువ పత్రం తప్పని సరిగా తీసుకోవడం ఎంతో అవసరమని, దాని వల్ల ఎన్నో ప్రయోజనాల ఎన్నాయని అన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రి దేవి మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలాత్ సేవలు అందరూ ఉపయోగించు కోవాలని అన్నారు. డిఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాది డి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, పేద ప్రజలు ఏవిధమైన న్యాయ సేవలనైనా, డిఎల్ ఎస్ ఏ ద్వారాఉచితంగా పొందవచ్చునన్నారు.

# హాకీ టోర్నమెంట్-2025 ఐదవ రోజు మ్యాచ్‌లు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
కాకినాడ పట్టణం,జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025 ఐదోవ రోజు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 08 మ్యాచులు జరిగాయి. ఐదో రోజు జరిగిన హాకీ పోటీలకు ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసు, ఇన్విరాన్మెంట్, హైడ్రాలజీ శాస్త్రవేత్త డా.వైఆర్.సత్యాజీ రావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మ్యాచ్లు వివరాలుఇలా ఉన్నాయి.చతీస్గడ్ సెక్రటేరియట్ - రాజాస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచులో చతీస్గడ్ సెక్రటేరియట్ 7-1 తేడాతో రాజాస్థాన్ సెక్రటేరియట్ జట్టు పైన విజయం సాధించింది.ఆర్ఎస్బీ భువనేశ్వర్ - ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచులో ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ 5-0 తేడాతో జట్టు ఆర్ఎస్బీ భువనేశ్వర్ జట్టు పైన విజయం సాధించింది.ఆర్ఎస్బీ చండీఘర్ - ఆర్ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచులో ఆర్ఎస్బీ బెంగళూరు 4-1 తేడాతో ఆర్ఎస్బీ చండీఘర్ పైన విజయం సాధించింది.తెలంగాణ సెక్రటేరియట్ - గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచులో



తెలంగాణ సెక్రటేరియట్ 21-0 తేడాతో గోవా సెక్రటేరియట్ పైన విజయం సాధించింది.సెంట్రల్ సెక్రటేరియట్ - ఆర్ఎస్బీ అహ్మదాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచులో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో ఆర్ఎస్బీ అహ్మదాబాద్ పైన విజయం సాధించింది.సెంట్రల్ సెక్రటేరియట్ - రాజస్థాన్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచులో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో రాజస్థాన్ సెక్రటేరియట్ పైన విజయం సాధించింది.చతిస్గడ్ సెక్రటేరియట్ - కేరళ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచులో చతిస్గడ్ సెక్రటేరియట్ 13-0 తేడాతో కేరళ సెక్రటేరియట్ జట్టు పైన విజయం సాధించింది.ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ - మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచులో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 18-0 మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు పైన విజయం సాధించింది.

# మాజీ సీఎం జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కురసాల



**కాకినాడ రూరల్ , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
వైసిపి ఉత్తరాంధ్ర జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబు బుధవారం తాడేపల్లి మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో మరింత బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్రలో పార్టీ మరింత బలోపేతం చేయాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయని కూటమి ప్రభుత్వం పై ప్రజల తరపున పోరాటం చేయాలని కన్నబాబు కు సూచించారు.

# మెజీషియన్ డాక్టర్ వర్మకు మూడు ప్రతిభ పురస్కారాలు ప్రధానం

**- మరుగున పడిన కళాకారుల జీర్ణోద్ధారణకు కృషి : మెజీషియన్ డాక్టర్ చల్లగాలి శ్రీనివాస వర్మ**

**రాజమహేంద్రవరం , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
రాజమహేంద్రవరం కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ మెజీషియన్ గా గుర్తింపు పొందిన డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్ వర్మ కీర్తి కిరీటంలో మరో మూడు ప్రతిభా పురస్కారాలు వచ్చి చేరాయి. రెండు దశాబ్దాలు పైగా మ్యాజిక్ వృ వృత్తిలో కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. ప్రతి మెజీషియన్ కు తనకు సంబంధించిన ఒక ప్రత్యేకమైన మేజిక్ ప్రక్రియ వారి సొంతం తద్వారా గుర్తింపు పొందుతారు. అదేవిధంగా మెజీషియన్ వర్మ కూడా ప్రమాదకరమైన బ్లేడు, ట్యూబ్ లైట్ లు అందరూ చూస్తుండగానే అవలేలగా తినడం ప్రత్యేకత. మెజీషియన్ వర్మ ఇప్పటికే ప్రముఖ రాజకీయ నాయకులు, ముఖ్యమంత్రుల , సినీ కళాకారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు నుంచి సామాన్య ప్రేక్షకుల వరకు అవార్డులు, రివార్డులు, ప్రతిభా పురస్కారాలతో పాటు ఎన్నో ప్రశంసా పత్రాలు సత్కారాలు అందుకోవడంతోపాటు భారత బుక్ ఆఫ్ రికార్డులకు ఎక్కారు. ఆయన కుమారుడు శోభిత్ వర్మ బీ టెక్ మెరైన్ ఇంజనీరింగ్ చదవడానికి చెన్నై కాలేజీలో జాయిన్ ఆవడం జరిగింది. సరదాగా సముద్రపు బీచ్ కి వెళ్ళగా రాకాసి ఆలలకు బలయ్యాడు. దాంతో కొద్దికాలం పాటు వృత్తి కి దూరంగా ఉన్నారు. మళ్లీ నెమ్మది నెమ్మదిగా కోలుకుంటున్న వర్మ గత వృత్తి వైభవాన్ని పునరుద్దించే యత్నాలు



ముమ్మరం చేస్తున్నారు. కుమారుని జ్ఞాపకాల్లో సామాజిక కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్పంచుకుం టున్నాడు. 2010 లోనే ఏర్పాటు చేసిన చల్లగాలి శ్రీనివాస వర్మ సాంస్కృతిక సామాజిక సంస్థ ద్వారా ఎంతో మంది వృద్ధులకు, అనాధలకు ఆశ్రయం కల్పిస్తూ వారికి తనవంతు సహాయంగా పెన్షన్లు కూడా అందజేస్తూ తనలోని సేవాభిలాష ను నిరూపిం చుకుంటున్నారు. ఇదిలా ఉండగా, ఈనెల 2 తేదీన స్థానిక సితార గ్రాండ్ లో హైదరాబాద్ కు చెందిన మేడిది సుబ్బయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చొప్పెల్ల రామారావు, కదలి కృష్ణారావు , అల్లూరు జానకి రాజు, బీజేపీ నాయకురాలు నర్సిపల్లి హారిక తదితరులు డాక్టర్ మెజీషియన్ డాక్టర్ శ్రీనివాస్ వర్మకు " విశిష్ట సేవారత్న " పురస్కారాన్ని అందజేసి , సాలువ కప్పి ఘనంగా సత్కరించారు.



పాన్ ఇండియన్ సామాజిక, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5 వ తేదీన స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన గోదావరి ఉత్సవం 2025 లో భాగంగా మ్యాజిక్ రంగంలో వర్మ చేస్తున్న సేవలను గుర్తించి మెజీషియన్ డాక్టర్ వర్మను" తెలుగు తేజం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని" అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ పురస్కారాన్ని ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, సాహితీవేత్త కత్తిమండ ప్రతాప్, ఎమ్మెల్సీ బొర్ర గోపి మూర్తి ల రాజయోనా చేతుల మీదుగా అందజేశారు. ఈనెల 16వ తేదీన కోనసీమ డాక్టర్ అంబేద్కర్ జిల్లా మలికిపురం గ్రామంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన తెలుగు తేజాల పురస్కారాల ప్రధానోత్సవం లో మ్యాజిక్ రంగంలో చేసిన సేవలకు గాను శ్రీనివాస వర్మ కు " కళా కిరీటి " ప్రతిభా పురస్కాన్ని అందిం చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెజీషియన్ డాక్టర్ వర్మ మాట్లాడుతూ, నేటి యాంత్రిక యుగంలో సాంప్రదాయ కళలకు ఆదరణ తగ్గుతుందని భవిష్యత్తులో ఇది సాంస్కృతిక విచ్చింనాన్నికి దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కళలకు ఆదరణ లేకపోవడంతో కళాకారుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగున కలలో కళాకారులను జీర్ణోద్ధారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిది వెంకటేశ్వర రావు, పరస రవి మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని పురస్కార గ్రహీత వర్మ కు అభినందనలు తెలిపారు.

## దొంగతనం కేసులో ముద్దాయి అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
ఈనెల 4న అమలాపురం పట్టణంలో పేరూరు లో భారత్ పెట్రోల్ బంక్ వద్ద వున్నా టిఫన్ సెంటర్ వద్ద ఇద్దరు తమ బైక్ ను పెట్టి టిఫెన్ చేస్తుండగా ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఇద్దరు తెలియని వ్యక్తులు బండికి అడ్డంగా నిలబడి డిక్కీ ని తెరచి అందులోని రూ 1,50,000 లు దొంగలించుకొని అక్కడనుండి పరారీ అయ్యారు. ఈ కేసు పై పిర్యాదు అందగా అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కేవలం 25 రోజుల్లో నిందితున్ని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నామని డిఎస్పీ టి యస్.ఆర్. కె ప్రసాద్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలలో ఒకరిని ఈరోజు ఉదయం అరెస్టు చేసి అతని వద్ద నుండి 1,77,000/- రూపాయల నగదును, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పీ తెలిపారు. ఈ నిందితుడు పై రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులలో ఉన్నాయన్నారు. నిందితుడు మేకల బాల రాజు, కుంచవారి వీధి, సుందరయ్యపేట గ్రామం, చీడివలస పంచాయితీ, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా అన్నారు. ముద్దాయిని అమలాపురం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించడంతో అతన్ని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని డిఎస్పీ తెలిపారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి . వీరబాబు నేతృత్వంలో పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ టి. తిరుమల రావు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

## కోరింగ వైల్డ్ లైఫ్ అభయారణ్యం మాస్టర్ ప్లాన్ పై కలెక్టర్ సమావేశం


**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం ఎకో-సెన్సిటివ్ జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీకి సంబంధిత అధికారులు తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జిల్లా అటవీశాఖ అధికారి డి. రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై అటవీ, రెవెన్యూ, మత్స్య, భూగర్భ జలాలు, పశు సంవర్ధక, ఉద్యాన, మున్సిపల్ కార్పొరేషన్, సర్వే ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్వో రవీంద్రనాథ్ రెడ్డి కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీ ఆవశ్యకతను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అభయారణ్యం బయట ఉన్న సరిహద్దు నుంచి వివిధ ప్రదేశాల్లో 26 కిలోమీటర్లు దూరం వరకు ఎకో- సెన్సిటివ్ జోన్ ఉంటుందన్నారు. ఈ జోన్ వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు, మునుగడకు మరింత భద్రత ఏర్పడుతుందన్నారు.
పర్యావరణ సమతుల్యత నెలకొని పచ్చదనం పెపొందడంతో పాటు సేంద్రియ వ్యవసాయానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ జోన్ పరిధిలో వర్షపు నీటిని వివిధ పద్ధతుల్లో నిలువ చేసుకుని జంతువులకు నీటి సమస్య లేకుండా చేయవచ్చునని ఆయన వివరించారు.

# ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తులను మెజారిటీతో గెలిపించాలి : ఎంపీ తంగెళ్ల, ఎమ్మెల్యే జ్యోతుల



**గండేపల్లి , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి పార్టీలు బలపరిచిన పేరాబత్తుల రాజశేఖరంకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని జగ్గంపేట మండలం ఇర్రిపాక లో నిర్వహించారు. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మన కూటమి అభ్యర్థి అయిన పేరాబత్తుల రాజశేఖరం ని అత్యధిక మెజారిటీ తో గెలిపించడానికి కృషి చేయాలనీ ప్రతి ఓటరు ను కలిసి మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు విజనరీ నాయకుడు చంద్రబాబు,పాలనా దక్షకుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి విజయంతో కూటమి పార్టీకి తిరుగు లేదని నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమములో ఎస్వీఎస్ అప్పలరాజు, రాయవరం శ్రీను, ఉలిసి ఐ రాజు, మరిసే రామకృష్ణ, మొగిలి గంగాధర్, సత్యం రాజా కుటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సెక్టార్, రూట్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలి : డిఆర్వో జే.వెంకట్రావు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
ఈ నెల 27న జిల్లాలో జరిగే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సెక్టార్, రూట్ అధికారాలు సమర్థవంతంగా పని చేయాలని తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఏఆర్వో, డీఆర్వో జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో సెక్టార్, రూట్ అధికారాలు, తహసీల్దార్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఏఆర్వో జె.వెంకటరావు హాజరై.. కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణితో కలిసి అధికారులకు అవగాహన కల్పించారు. శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలకు సంబంధించి తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు -2025 పోలింగ్ కేంద్రాల్లో విధులు- పోలింగ్ ప్రక్రియ పోలింగ్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పోలింగ్ కేంద్రాలు, ఫర్నిచర్, విద్యుత్, పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం వంటి అంశాలను ఏఆర్వో జె.వెంకటరావు పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా పోలింగ్ సిబ్బందికి తగు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైనన్ని సదుపాయాలు సమకూర్చడం జరిగిందని పోలింగ్ ప్రక్రియ ఈ నెల 27న గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని ఈ ఎన్నికలకు సంబంధించి కాకినాడ జిల్లాలో 70,540 మంది ఓటర్లకు 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 21 సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. సెక్టార్, రూట్ అధికారాలు తమ పరిధిలోని పోలింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ ప్రక్రియ సమయానికి ప్రారంభమైయ్యేలా చోరవ చూపాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను సురక్షితంగా కాకినాడ కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూముకు తరలించేంతవరకు అధికారులు బాధ్యతతో పని చేయాలని ఆయన సూచించారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి సిబ్బంది అంతా సమర్థవంతంగా పని చేయాలని ఆయన తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ ఎం.జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ సన్మోహన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 19 ( ప్రభాతవార్త ) :**
ఈ నెల 26న జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సామర్లకోట శ్రీ చాళుక్య కుమారరామ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానాలకు దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. సామర్లకోటలోని చాళుక్య కుమార భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర స్వామి దేవస్థానాలను సందర్శించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps



ఫొటోషూట్ అంటే పెద్ద పెద్ద లైట్ల మధ్య చిరునవ్వుతో వయ్యారంగా మోడల్స్ అడుగులు గుర్తొస్తుంది. కానీ ప్రముఖ మోడల్ సియారా ఆంటోన్నీ సముద్రంలోపల చేసిన షూట్ చూస్తే గగుర్పాటుకు గురవడం ఖాయం ఇది గిన్నిస్ రికార్డులోనూ నమోదైంది ఫ్లోరిడాలోని అట్లాంటిక్ సముద్రంలో 161.38 అడుగుల (సుమారు 50 మీటర్లు) లోతు ప్రాంతమది. 1857లో స్టాప్ యార్డు లాగుతున్న డ్రెడ్జర్ మునిగిన ప్రాంతం కూడా అదే అక్కడికెళ్లాలంటే ఓ సాహసమే ఇంత లోతులో ఊపిరి తీసుకోవడమూ కష్టమే. అటువంటి చోట ఆ నీటి అడుగున శ్వేతవర్ణం గౌనులో సియారా ఫోటోషూట్ కు ఫోజు లిచ్చింది. ఈ షూట్ ప్రపంచరికార్డు సృష్టించింది. సవాళ్లతో కూడిన సాహసమే ఈ రికార్డు. దీనికోసం ఎంతో శిక్షణ తీసుకున్న నెలల తరబడి సాధన చేసి సముద్రపులోతుల్లో డ్రైవ్ కు కావాల్సిన నైపుణ్యాలను పెంచుకున్నా పావుగంటలో దీన్ని ముగించాలనే నియమం పెట్టుకున్నాం. అయితే లోతైన డైవ్కు సాంకేతిక అంశాలు చాలా ముడిపడి ఉంటాయి. మా భద్రత కోసం ఆక్సిజన్ ట్యాంకులు, పైకి వచ్చే ప్రతిసారి ఒత్తిడికి లోనుకాకుండా ఉండడానికి ఆక్సిజన్, నైట్రోజన్, హీలియంల మిశ్రమాన్ని నింపిన ప్రత్యేక ట్యాంకులు వినియోగించబడతాయి. షూట్

## సాహసానికి గిన్నిస్ రికార్డు



సమయం తక్కువే అయినా దీనికి సిద్ధం కావడానికి పడిన కష్టం చాలా ఎక్కువ నీటి అడుగున కావడంతో మావు నిలకడ ఉండదు. అలాగే రెండునిమిషాల్లో ట్యాంకు నుంచి గాలి పీల్చుకున్న ప్రతిసారీ దీలావడుతున్నాం. వీటన్నింటినీ దాటి ఫైనల్ పార్క్‌లలో ఇబ్బంది ఎదురవుతోంది. చివరలో హైనింగ్‌కాటుకు అవసరమైన చికిత్సతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు 'సామాన్యుల జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో వీడియోలు తీస్తా, చివర్లో హాస్యం తెప్పించే ట్విస్ట్ 'పెడతా పాపులర్ పాటలు, బయట ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకుంటూ పార్ట్స్ చేస్తా. మీకంటూ ఒక ప్రత్యేకత ఉంటే ఒరిజినల్ కంటెంట్ సృష్టించండి. ట్రెండ్స్ ఫాలో అవుతూ, నిరంతరం వీడియోలు అప్లోడ్ చేస్తే విజయం సాధించవచ్చు అంటూ తన అనుభవాల్ని చెబుతుంది. ప్రియాల్. వీటన్నింటినీ అధిగమించి చివరకు హైనింగ్ గిన్నిస్ రికార్డులో మా షూట్ను చేర్చగలిగాం. నా స్నేహితుడు పారా గ్లైడర్ కావడంతో త్వరలో ఫైయింది వేలాడుతూ ఫొటోషూట్‌లో పాల్గొనాలనుకుంటున్నా అంటోంది సాహసాల మోడల్.

# యుఎస్‌లో భారత్ తొలి మహిళా సిఇఒ

అపారమైన మేధస్సు. విదేశాల్లోని ప్రవాస భారతీయులను అందలమెక్కిస్తున్నాయి. తమ ప్రతిభ, పనితో అక్కడి సంస్థల్లో ఉన్నత పదవులు దక్కించుకుంటున్నారు. ఇతర నారీమణులు. తాజాగా ఈ జాబితాలో చేరిపోయారు **గుంజన్ కేడియా,** అమెరికాలోనే అతి పెద్ద బ్యాంకుల్లో ఒకటైన "Baacorp" బ్యాంకు సీఈవోగా తాజాగా నియమితురాలయ్యారామె. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చు కున్నారు గుంజన్. ప్రస్తుతం ఈ బ్యాంకు అధ్యక్షురాలుగా కొనసాగుతున్న ఆమె.. ఏప్రిల్‌లో కొత్త సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో అమెకున్న మూడు దశాబ్దాల సుదీర్ఘ అనుభవమే నేడు ఆమెకు ఈ అత్యున్నత పదవి కట్టబెట్టింది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఈ సంస్థను సమర్థంగా నడిపించడమే తన ధ్యేయమంటోన్న ఈ మహిళా ఆర్థికవేత్త గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు మీకోసం..!

**నాయకురాలిగా నడిపించి..!** "Bancorp" బ్యాంకు.. అమెరికాలోనే ఏడో అతి పెద్ద బ్యాంకుగా పేరుగాంచింది. 2016లో వైస్ చైర్మన్ గా ఈ సంస్థలో చేరిన గుంజన్.. తన ప్రతిభ, పనితనంతో ఒక్కో మెట్టు ఎక్కుతూ మేలో అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఏడాది కూడా గడవకముందే ఈ సంస్థ సీఈవోగా నియమితురాలవడం.. ఆమె నాయకత్వ పటిమకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గతంలో PWC, Mckinsey& Company' Statge Street" వంటి బహుళజాతి సంస్థల్లో ఉన్నత హోదాల్లో విధులు నిర్వర్తించిన గుంజన్.. ఈ ఏడాది ఏప్రిల్ "Bancory" బ్యాంకు సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర లిఖించనున్నారు. 'బాన్‌కార్ప్ చరిత్రలోనే ఇది సువర్ణాధ్యాయం. ఇన్నాళ్లూ గుంజన్ వివిధ హోదాల్లో పనిచేస్తున్న సంస్థను ముందుకు నడిపించిన, ఆమె దూరదృష్టి, ముందుచూపుతో చేసే ఆలోచనలు, అదీ మించి మూడు దశాబ్దాలకు పైగా ఆమెకున్న అనుభవం.. ఇవన్నీ బ్యాంకు అభ్యున్నతికి బాటలు వేస్తాయని ఆశిస్తున్నాం. ప్రస్తుతం సీఈవోగా ఉన్న అండీ ఏప్రిల్ 15న పదవీ విరమణ చేయనున్నారు. ఆపై ఆయన స్థానంలో గుంజన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఆమె సాధించిన విజయాల్ని కొనసాగిస్తూనే.. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలుకల్పిస్తూ.. సంస్థను లాభాల బాట పట్టిస్తారని మేము విశ్వసిస్తున్నాం. అంటూ కాబోయే కొత్త సిఈఒ బాధ్యతల్ని గుర్తుచేశారు బ్యాంకు ఉన్నతాధికారులు. మరింత సమర్థంగా! ప్రస్తుతం టామీకార్న్ బ్యాంకు అధ్యక్షుడిగానే కాదు ఈ సంస్థ 'బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల'లో ఉన్నారు. గుంజన్ హోదా అధ్యక్షుడిగానాలైనప్పట్నుంచి రుణాలివ్వడు, వాటి నుంచి ఆదాయం రాబట్టడు కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారామె. ఇక ఈ కొత్త హోదాలో తన బాధ్యత




మరింత పెరిగిందంటున్నారామె 'నాపై నమ్మకముంచి ఈ ప్రతిష్టాత్మక సంస్థను నడిపించే బాధ్యతల్ని అప్పగించినందుకు గర్వపడుతున్న సంస్థ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న ఆండీని ఆదర్శంగా తీసుకొని సంస్థను లాభాల బాట పట్టించేందుకు, బ్యాంకు సేవల్ని మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తా.' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. గుంజన్. అవి కలలో నైనా అనుకోలేదు!. ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డ గుంజన్ ఢిల్లీ. ఇక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆమె. 'ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేశారు. అమెరికాలోని 'Camegie Mellone Unny"కి చెందిన టెప్పర్ స్కూల్ ఆఫ్ బిజి నుంచి ఫైనాన్స్ ఎంబీఏ చేసిన ఆమె.. ఆపై అక్కడే స్థిరపడ్డారు.

**అది కలలోనైనా అనుకోలేదు.** ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డ గుంజనే ఢిల్లీ. అక్కడే విద్యా ప్రాథమికభ్యాసం పూర్తిచేసినమె ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 'ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రా ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేశారు.


అమెరికాలోని'కి చెందిన అప్పర్ స్కూల్ ఆఫ్ నుంచి ఫైనాన్స్ ఆపై ఆమె అక్కడే స్థిరపడ్డారు. అసలు అమెరికా వెళ్తారని, అక్కడే ఉద్యోగం చేస్తానని, స్థిర నివాసం ఏర్పరచుకుంటానని కలలో కూడా అనుకోలేదు. నేను ఇంజనీరింగ్ చదివేటప్పుడు మా నాన్నకు ప్రపంచ బ్యాంకులో ఉద్యోగంతోపాటు నేనూ అమెరికా వెళ్లి టెప్పర్ స్కూల్లో ఎంబీఏ సీటు సంపాదించడమే కాదు.. విషయాలు నాకు నేర్పింది. ఆధునిక నైపుణ్యాలు అలవర్చుకున్నా నెట్వర్కింగ్ పరిధిని పెంచుకున్నా ఇవన్నీ లిసేలా చేశాయి. అంటూ ఆర్థిక నిపుణులు.

**ఉద్యోగ వేట.. ... తప్పలేదు** ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరిన వాళ్లను చూసి.. వీళ్లకు ఎలాంటి కష్టాలు తెలియవని అనుకుంటారు చాలామంది. ఉద్యోగమూ సునాయాసంగా వస్తుందని భావిస్తున్నారు. కానీ తాను ర్యాంక్ అయినా.. తనకూ పలు ఉద్యోగ తిరస్కరణలు తప్పలేదంటున్నారు గుంజన్. ప్రతిష్టాత్మక యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పుచ్చుకున్నా, ర్యాంకు సాధించిన ఉద్యోగం కోసం ఎన్నో పాట్లు పడ్డాను. చదువు పూర్తికాగానే చేతిలో ఎంబీఏ సర్టిఫికెట్ ఉంది కదా.. జాబ్ కొట్టడం తేలికే అనుకున్నా. కానీ గ్రీన్ కార్డు లేకపోవడంతో కొన్ని ఉద్యోగ అవకాశాలు చేజారాయి. అయినా పట్టువదలలేదు. వరుసగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే దాన్ని. నా పేరు పిలుస్తారేమోనని ఆఫీసు రిసెప్షన్‌లో గంటల తరబడి ఎదురుచూసిన ఎన్నో రోజులూ! చివరకు నా కష్టం ఫలించి.. 'ఉద్యోగం సంపాదించా' అంటూ ప్రతిభతో పాటు పట్టుదల, అంకితభావం ఉన్నప్పుడే విజయం సాధించగలమని చెప్పకనే చెబుతున్నారు గుంజన్. మూడు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో అపార నైపుణ్యాలు సొంతం చేసుకున్న గుంజన్.. అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో తనదైన పాత్ర పోషిస్తున్నారు. ఈ ఎంపికనే పలు అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారామె. అలాగే 'బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ జాబితా'లో అత్యంత శక్తిమంతమైన మహిళా అమెరికన్ బ్యాంకర్‌గా ఏడుసార్లు చోటుదక్కించుకున్న గుంజన్.. బ్యారన్ పత్రిక విడుదల చేసిన యూఎస్ ఫైనాన్స్ జాబితాలో వంద మంది అత్యంత ప్రభావశీలురైన మహిళల్లో ఒకరిగా స్థానం సంపాదించారు



# వేడుకలకు అందమైన ఫోన్

పెళ్లిళ్ల సీజన్... పట్టుచీర, నగలు అన్నీ సిద్ధం చేసుకుంటాం. మరి ఫోను మాటేంటి? దాన్నేం రెడీ తీసిపారేయకండి. వేడుకనుబట్టి వాటిని తీర్చిదిద్దుకోవచ్చు. తగ్గట్టుగా ఫోన్ కేసులు దొరుకుతున్నాయి. అలా వచ్చినవే ఈ వింటేజ్ ఫోన్ కేసులు, బంగారం, వెండి పూతల్లో ముత్యాలు, కుందన్లను జోడించుకుని అచ్చం నగలే అద్దినట్టు లేవూ? అన్నట్టు ఇవి మన ఇబ్బందిని తొలగిస్తాయి. అదెలాగంటే... వేడుకల్లో బాగా ముస్తాలు అవుతాం కదా నాలుగు ఫొటోలూ క్లిక్ మనిపిస్తాం. వేడుక ఇంట్లో అయితే ఏవో ఒక పనులు తప్పనిసరి. బంధువులదైనా, స్నేహితులదైనా పలకరింపులు ఎలాగూ ఉంటాయి.. వీటన్నింటి మధ్య ఇబ్బందిగా అనిపించేదేంటి... ఫోనే కదూ సంప్రదాయ దుస్తుల్లో ఉంటాం కాబట్టి, జేబు ఉండదు. చేతిలో పట్టుకుని ఉండలేం, ఎవరికో ఒకరిక ఇవ్వలేము. అందుకే గాజుల చేతికి తొడుక్కునేలా, తాళాల గుత్తిలా నడుముకు దోపుకొనేలా... అంతెందుకు, నగల మెడలో ధరించేలానూ ఈ ఫోన్‌కేసులు వస్తున్నాయి. అంటే హంగులతో మెరవడమే కాదు... వేడుకనూ ఎంజాయ్ చేస్తాయన్నమాట. భలేగున్నాయి కదూ! మరి మీరేది ఎంచుకుంటున్నారు?





# వంకాయ దమ్ బిర్యానీ


బిర్యానీ పేరు చెబితే అందరికీ నోట్లో నీళ్లూరుతాయి. ఇక దం బిర్యానీ అయితే చెప్పాల్సిన పనే లేదు. అది హోటల్ స్టయిల్లో కుదరాలంటే ఇలా చేసి చూడండి.

**కావలసినవి:** బాస్మతి బియ్యం 2 కప్పులు, పెరుగు అరకప్పు, ఉల్లిపాయలు 2, నూనె, నెయ్యి 2 చెంచాల చొప్పున, పసుపు అర చెంచా, ఉప్పు రుచికి తగినంత, నిమ్మరసం, కారం 2 స్పూన్ల చొప్పున, గరంమసాల, జీలకర్ర పొడి, షాజీరా చెంచా చొప్పున, పచ్చిమిర్చి 4, పచ్చిమిర్చి, పచ్చిమిర్చి, పచ్చిమిర్చి, పచ్చిమిర్చి తరుగు అరకప్పు చొప్పున, యాలకులు 4, లవంగాలు 6, బిర్యానీ ఆకులు 2, దాల్చినచెక్క రెండం గుళాల ముక్క పుదీనా చారెడు, కొత్తిమీర తరుగు పావుకప్పు



**తయారీ:** బియ్యాన్ని అరగంట నానబెట్టాలి. ఉల్లి, మిర్చిలను తరగాలి. వంకాయలు కడిగి, పూర్తిగాతెగకుండా నాలుగు చీలికలు చేసి నీళ్లలో వేయాలి. కాడలు కత్తిరించకండి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నూనె వేసి.. సన్న సెగ మీద వంకాయలను వేయించండి. వాటిని పళ్లెంలోకి తీసి.. ఉల్లి తరుగు, అది వేగాక.. పచ్చిమిర్చి, ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, గరం మసాలా, పసుపు జోడించండి. రెండు నిమిషాల తర్వాత నిమ్మరసం, పెరుగు, పుదీనా, కొత్తిమీర తరుగు, వేయించిన వంకాయలు జతచేసి మగ్గనివ్వండి ఈలోగా నానబెట్టిన బియ్యంలో ఉప్పు, నెయ్యి, బిర్యానీ ఆకులు, షాజీరా, లవంగాలు, యాలకులు, దాల్చినచెక్క వేసి ఉడికించాలి. 70 శాతం ఉడికాక స్టవ్ ఆఫ్ చేయండి. మిగిలిన నీటిని వంపేసి, వంకాయ మసాలాలో చేర్చండి. సన్న సెగ మీద ఉంచి ఆవిరి బయటకు పోకుండా మూత మీద బరువు ఉంచి ఉడికించండి. దించిన తర్వాత మూత తీయకుండా పావుగంట సేపు అలా వదిలేయండి. అంతే.. వారెవా అనిపించే ఖివంకాయ దమ్ బిర్యానీ' వేడివేడిగా తినండి.

# 'ఎక్సర్‌సైజ్ స్నాక్' చేద్దామా?



పేరు విని వ్యాయామం చేసే సమయంలో పూర్తయ్యాక ఈమధ్య బాగా బరువు పెరిగా... ఎలాగైనా తగ్గించాలి, రేపట్నుంచి అరగంట వ్యాయామం తప్పక చేస్తా...అనుకోవడానికే చాలానే అనుకుంటాం. ఉద యాన్నే అలారం మొగగానే పడుకుంటాం. ఇంకొందరైతే ఆవేశంగా వ్యాయామానికి కావాల్సిన దుస్తులు, పరిసరాలూ కొంటారు. ఓ రెండు మూడురోజులు చేసేస్తారు కూడా ఆ తరవాత పని ఉంది. నొప్పులు... ఇలా కారణాలు వెతుక్కుంటూ నెమ్మదిగా పక్కన పెట్టుకుంటారు. చీర కట్టినప్పుడు పొట్ట కనిపించినా, స్నేహితుల్లో ఇంట్లోవాళ్లు కాస్త లావయ్యావని అన్నా... 'అరెరే వ్యాయామం కొనసాగించలేకపోయామే' అని గిల్టీగా ఫీలవుతాం. అరగంటపాలో, గంటపాటో ఏకదాటిగా సమయం కేటాయించాలంటేనే ఇబ్బంది. దాన్ని విభజించుకోవడమే ఈ ఎక్సర్‌సైజ్ స్నాక్స్ అంటే భోజనానికి భోజనానికి మధ్య కలిగే చిరు ఆకలిని పోగొట్టుకోవడానికి నాట్స్, పండ్లు, చిప్స్ తీసుకుంటాం కదా! ఇది అలాగే పనిమధ్యలో కాస్త మగతగా అనిపించినా, అదేపనిగా కుర్చీలో కూర్చున్నా, ఫోన్ మాట్లాడుతున్నా... ఇలా ఎప్పుడు ఖాళీ దొరికినా వ్యాయామం చేయడమన్నమాట. నడక, జాగింగ్, జంపింగ్ జాక్స్ ప్లాంక్... 30 సెకన్ల నుంచి 5 నిమిషాల వరకు ఇలా ఏదైనా చేయొచ్చు. అరె బాగుందే... అదుతూ పాడుతూ చేయొచ్చు అనుకుంటున్నారేమో! ఏది చేసినా గుండె వేగం పెరిగేంత తీవ్రత ఉండాలి మరి అప్పుడే ఫలితం ఉంటుంది. ఇంకేం ఆన్‌లైన్‌లో ఆహారం వేడెక్కేలోపు జంపింగ్ జాక్స్ పని మధ్యలో పక్కకు వెళ్లి వేగంగా నడక, టీవీ చూస్తూ. పుషప్స్.. ఇలా నచ్చింది చేయండి.


# పెళ్లికి ప్రతిబంధకం కాదు..

వ్యథ



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న:** మా అమ్మాయి మానసిక సమస్యతో బాధ పడుతోంది. ఐదేళ్లుగా మందులు వాడుతున్నప్పటికి ప్రయోజనం కనిపించ లేదు. దీనివల్ల 30 యేళ్ళ వయస్సు వచ్చినప్ప టికి పెళ్ళి చేయలేకపోతున్నాము. బిటెక్ చదివినప్ప టికి ఉద్యోగం చేయలేక పోతున్నది. గత ఏడేళ్ళ నుంచి ఆమెకు నిరంతరం భక్తి గీతాలు వినిపిస్తుంటాయి. రెండేళ్ళ పాటు అప్పుడప్పుడు వినిపించేవి. ఆమెకు దైవ భక్తి ఎక్కువ కాబట్టి అలా వినిపిస్తున్నాయని సరిపెట్టుకున్నాము. అయితే సమస్య తీవ్రం కావడంతో మొదట చెవి, ముక్కు గొంతు డాక్టరుకు చూపించాము. ఆయన శారీరకంగా ఎలాంటి లోపం లేదని పరీక్షల అనంతరం ధృవీకరించారు. కాబట్టి మానసిక వైద్యుడు (సైకియాట్రిస్టు)ను సంప్రదించమని సలహా ఇచ్చారు. దీనితో సైకియాట్రిస్టునుకలసి చికిత్స ప్రారంభించాము. మా అమ్మాయి భ్రమలు, భ్రాంతులకు గురవుతున్నదని చెప్పి మందులు ఇస్తున్నారు. అయినా సమస్య పూర్తిగా నయం కాలేదు.యోగ ధ్యానం చేసిన సమయంలో కొంత తగ్గినపుడు ఎక్కువ అవుతున్నది. డాక్టరును అడిగితే ఇంకా కొన్నాళ్ళు మందులు వాడాల్సి ఉంటుందని అంటు న్నారు తప్ప ఎప్పటికి తగ్గు తుందో చెప్పలేకపోతున్నారు. ఈ దశలో మా అమ్మాయికి పూర్తిగా నయం కావడానికి ఎలాంటి చర్యలు తీసు కోవాలో తెలుపగలరు. అలాగే పెళ్లి చేస్తే పరవాలేదా, సంసార జీవితానికి ఇబ్బంది ఉండదా తెలుపండి. – ఒకసోదరి,కర్నూలు



**జవాబు :** అమ్మా, మీ అమ్మాయి సైకియాట్రిస్టు చెప్పినట్టు భ్రమలు, భ్రాంతులకు గురవుతున్న. మానసిక రుగ్మతల్లో ఇదొక తీవ్రమైన రుగ్మతగా భావించకతప్పదు.సహజంగా స్కిజోఫ్రెనియా రుగ్మత ఉన్నవారిలో ఈ లక్షణాలు ఉంటాయి. ఈ రుగ్మతకు దీర్ఘకాలిక చికిత్స అవసరం. ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స అందిస్తే త్వరగా నయం అయ్యే అవకాశం ఉంది. అయితే మీరు మెదట్లో కొంత నిర్లక్ష్యం వహించడం వల్ల రుగ్మత తీవ్రమై నది.కాబట్టి దీనికి దీర్ఘకాలం మందులు వాడక తప్పదు. కాబట్టి మానసికంగా సంసిద్ధం కావడం మంచిది. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ లాంటి కొన్ని శారీరక రుగ్మతలకు జీవిత కాలం మందులు వాడు తుంటారు. అలాగే ఒక్కో సారికొన్ని మానసిక రుగ్మతలకు జీవితకాలం మందులు వాడవలసి ఉంటుంది. కాబట్టి తరచు సైకియాట్రిస్టును కలసి ఆయన సలహా మేరకు మందులు వాడండి. ఇక వివాహ జీవితానికి సంసారానికి ఈ సమస్య పెద్ద ప్రతిబంధకం కాదు. అయితే వచ్చే భర్త సర్దు కోకపోతే సమస్యలు ఎదురుకావచ్చు. కాబట్టి ముందే విషయం పూర్తిగా తెలిపి పెళ్లి చేస్తే మంచిది. కాగా యోగ, వ్యాయామాలు, ధ్యానం సమతుల ఆహారం తగిన నిద్ర ఒత్తిళ్ళ నిర్వహణ వల్ల కొంత మంచి ఫలితం ఉంటుంది.

# సాయి స్పీడ్ పోస్ట్



ఆధ్యాత్మికం

**తల్లిదండ్రులలో ఒకరు సాయి భక్తులయితే చాలు,** వారి సంతానం కూడా సాయి భక్తి పరులవుతారు. గంగాధర్ విష్ణు క్షీరసాగర్ తల్లి దండ్రులు సాయి భక్తులు. వారు షిరిడీ వెళ్ళి సాయిని దర్శిస్తుండే వారు. వారు తమ పొలాన్ని సాయకిబాబా భక్తుడైన బాలాజి నేవాస్కర్‌కు కౌలుకు ఇచ్చాడు.కొంత కాలం బాగానే గడచింది. గంగాధర్ తండ్రి మరణించాడు. నేవాస్కర్ ఆ పొలానికి తానే హక్కుదారునని ప్రకటించున్నాడు. అయితే ఈ సమస్యను సాయిబాబా మందు పరిష్కరించుకుందాం అని నేవాస్కర్ చెప్పటంతో అందరూ సాయి సన్నిధికి చేరారు. వారు ద్వారకామాయి మెట్లు ఎక్కుతుండగానే సాయి నేవాస్కర్‌తో 'ఎందుకు నా బిడ్డలను ఆవస్త పెడతావు? ఆ పొలాన్ని వారికి స్వాధీనం చేయి అని సలహా ఇచ్చారు. ఇక అందరూ వెళ్ళిపోతారు సాయి మాటలు విని. కానీ నేవాస్కర్ మాత్రం పొలాన్ని గంగాధర్‌కు స్వాధీనం చేయలేదు. కోర్టు ద్వారా వారు ఆ పొలాన్ని స్వాధీనం



చేసుకోవలసి వచ్చింది. సాయిబాబా మహా సమాధి చెందారు. గంగాధర విష్ణు క్షీరసాగర్ సోనా వాడీకి బదలీ అయ్యాడు. సోనా వాడి షిరిడీ-నాసిక్ మార్గంలో ఉన్నది. అప్పటి నుండి గంగాధరుడు షిరిడీ వెళ్ళి సాయి మందిరంలో క్షీర్తనలు చేసేవాడు. ఆ రోజు జూన్ 27, 1935. ఆ రాత్రి గంగాధర్‌కు స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో సాయి దర్శనమి చ్చాడు. సాయి ఇంకా నిద్ర పోతున్నావా? ఈ రోజు నీ పొలం నీ స్వంతం చేస్తూ కోర్టు ఉత్తర్వు ఇచ్చింది. షిరిడీలో జాతర జరుగు తుంది. రాత్రి భోజనం చేయి అని గంగాధరునికి చెప్పి అదృశ్యమ య్యాడు. గంగాధరుని ఆస్తి కోర్టు కేసులో ఉన్న మాట వాస్తవమే. ఆ రోజే గంగాధరుని సోదరుని వద్ద నుంచి నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో అహమ్మద్ నగర్ జిల్లా కోర్టు గంగాధర సోదరులకు అనుకూలంగా తీర్పు ఇచ్చందని, ఆ తీర్పు ఇచ్చిన తేది జూన్ 27, 1935 అని ఆ ఉత్తరంలో ఉన్నది. అయితే కోర్టు ఉత్తర్వు ఇచ్చిన దినం, సాయి స్వప్నంలో ఆ విషయం తెల్పిన దినం ఒక్కటే! ఎక్కడ ఏది జరిగినా అదివెంటనే సాయికి తెలిసి పోతుంది. అది సాయి స్పీడ్ పోస్ట్!

- యం.పి.సాయినాథ్

తెర

# 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి క్యారెక్టర్ పోస్టర్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై



మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా "ఏబీసీడీ" సినిమా, రాజ్ తరుణ్‌తో "అహ నా పెళ్లంట" అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా తెరకెక్కుతోంది. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా నుంచి అభినవ్ గోమటం నటించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుబ్బు క్యారెక్టర్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. పాన్ ఇండియా మాట్రిమోని ప్రొఫైల్స్ ఉన్న ఫ్రస్టేటెడ్ అన్ మారీడ్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ సుబ్బు పాత్రలో అభినవ్ గోమటం ప్రేక్షకుల్ని నవ్వించబోతు న్నారు. సుబ్బు ఫ్రస్టేషన్ ఏ స్థాయిలో కామెడీ పండించిందో థియేటర్స్‌లో చూడాల్సిందే. ఒక కాంటెంపరరీ ఇష్యూను కథలో చూపిస్తూ వినోదాత్మకంగా "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ రెడ్డి. ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు: విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, శ్రీ లక్ష్మి, హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనీల్ గీల, సద్దాం తదితరులు. టెక్నికల్ టీమ్: డైరెక్టర్: సంజీవ్ రెడ్డి, ప్రొడ్యూసర్స్: మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి స్టోరీ, స్క్రీన్ ప్లే: సంజీవ్ రెడ్డి, షేక్ దావూద్ జి మ్యూజిక్ డైరెక్టర్: సునీల్ కశ్యప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.మధుసూదన్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మహి రెడ్డి పండుగుల, డైలాగ్స్: కల్యాణ్ రాఘవ్ కొరియోగ్రాఫర్: లక్ష్మణ్ కాళహస్తి, కాస్ట్యూమ్ డిజైనర్స్ అశ్వత్ భైరి, కె ప్రతిభరెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, పబ్లిసిటీ డిజైన్: మాయాబజార్ డిజిటల్: హౌస్ ఫుల్ డిజిటల్ పీఆర్ ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్).

# 'మజాకా' ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీ

పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్టైనర్లో రీతు వర్మ హీరోయిన్. మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ హైలీ ఎంటర్ టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా ఫిబ్రవరి 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రీతూ వర్మ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. **ఈ సినిమా చేయడానికి మిమ్మని ఎట్రాక్ట్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి?** ప్రసన్న ఈ కథ చెప్పినపుడు చాలా ఎంటర్ టైనింగ్‌గా అనిపించింది. అదే సమయంలో కథ హై ఎమోషనల్ కోషేంట్‌గా వుంది. రెండు ఫీమేల్ క్యారెక్టర్స్‌కి కథలో చాలా ఇంపార్టెన్స్ వుంది. నరేషన్ చాలా నచ్చింది. త్రూ అవుట్ నవ్వుతూనే వున్నాను. **సినిమాలో మీకు మెమరబుల్ మూమెంట్ అంటే?** సెకండ్ హాఫ్ లో నాకు రావు రమేష్ గారికి ఓ సింగిల్ టేక్ సీన్ వుంది. ఆ రోజు షూట్ చేసినప్పుడు అవుట్ పుట్ విషయంలో అందరూ చాలా హ్యాపీ అయ్యారు. సీన్ చాలా అద్భుతంగా వచ్చింది. రావు రమేష్ డబ్బింగ్ పూర్తి చేసి ఫోన్ చేశారు. ఆ సీన్ గురించి మాట్లాడుతూ, చాలా అద్భుతంగా చేశావ్ అమ్మా..16 నా ఏళ్ల కెరీర్‌లో అలాంటి సీన్ చూడాలేదు అని ఆయన చెప్పడం నాకు చాలా మెమరబుల్. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. సెట్స్‌లో అందరూ ఎనర్జిటిక్ గా వుండేవారు. అదే ఎనర్జీ ప్రమోషన్స్‌లో కూడా కనిపిస్తుంది. బాటిల్ రీల్ కి మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా వుంది. **త్రినాథ్ రావు సినిమాలు ఎంటర్టైనింగ్‌గా వుంటాయి. ఈ సినిమా ఎలా వుండబోతోంది?** ఫుల్ ఎంటర్ టైనింగ్‌గా వుండబోతోంది. లాట్స్ అఫ్ కామెడీ. హై ఆన్ ఎమోషన్. సాంగ్స్ చాలా గ్రాండియర్‌గా వుంటాయి. టీజర్ అందరికీ నచ్చింది. చాలా పాజిటివ్ వైబ్స్ వున్నాయి. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేశారు. **ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?** ఇందులో యంగ్ కాలేజ్ గర్ల్‌గా కనిపిస్తా. బాల్యంలో ఎమోషనల్ కాన్ ఫ్లిక్ట్ వలన తనపై ఎలాంటి ఎఫెక్ట్ పడింది? సందీప్ క్యారెక్టర్‌తో తన రిలేషన్ షిప్?.. ఇలా చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటుంది. నా క్యారెక్టర్ ని కొత్తగా ప్రజెంట్ చేశారు. ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్‌లో కనిపిస్తా. ఆడియన్స్ కి నచ్చుతుందనే నమ్మకం వుంది. **అన్షుతో యాక్ట్‌చేయడం ఎలా అనిపించింది?** తను చాలా పాజిటివ్ పర్సన్. చాలా హార్డ్ వర్కింగ్. తెలుగు క్లాసులు కూడా తీసుకుంది. తన కం బ్యాక్ గురించి నేనూ ఎక్సయిటెడ్‌గా ఎదురుచూస్తున్నాను. **సాంగ్స్ షూటింగ్స్ ఎలా జరిగాయి?** సాంగ్స్‌ని చాలా ఎంజాయ్ చేశాను. సాంగ్స్ అద్భుతంగా వచ్చాయి. పాటలన్నీటికీ మంచి రెస్పాన్స్ వచ్చింది. రావులమ్మ పాట రాబోతోంది. ఆ పాట కూడా చాలా బావొచ్చింది. **డైరెక్టర్ త్రినాధ్ రావుగురించి?** ఆయన చాలా జోవియల్ పర్సన్. చాలా ఎనర్జిటిక్‌గా వుంటారు. అందరినీ అదే ఎనర్జీతో ఉంచుతారు. టీం అంతా చాలా పాజిటివ్‌గా వుంటారు. ప్రతిరోజు ఒక పండగలా వుంటుంది.




# 'దీక్ష' రిలీజ్‌కు రెడీ

ఆర్ కె ఫిలిమ్స్ పతాకంపై డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో హీరోయిన్స్‌గా ఆక్స ఖాన్, తులసి, అనూష, ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం"దీక్ష". లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈచిత్రంషూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్ ను ఇతివృత్తంగా తీసుకుని లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాము. చాలా అందమైన



లొకేషన్స్‌లో, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తి చేసుకుంది. పాటలు అద్భుతంగావచ్చాయి. మా బ్యానర్‌కు మంచి పేరు తెచ్చే చిత్రంఅవుతుంది. లవ్ యాక్షన్‌తో పాటు మైథలాజికల్‌ను జోడించి నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో కిరణ్ భీముడు పాత్రలో అద్భుతమైన నటన కనపరచాడు. హీరోశ్రీహరిని గుర్తుచేసేలా కిరణ్ నటన ఉంటుంది. మా చిత్రం ద్వారా హీరో కిరణ్‌కి మంచి పేరు, గుర్తింపు వస్తాయి. ఆక్స ఖాన్ స్పెషల్ సాంగ్‌లో, తనదైన శైలిలో డాన్స్ ఆదర గొట్టింది. మా చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో దీక్షతో పనిచేసారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు.

# నా సరదా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు: ప్రొడ్యూసర్ ఎస్ కెఎన్

ఇటీవల "డ్రాగన్" సినిమా ఈవెంట్‌లో తాను తెలుగు హీరోయిన్స్ గురించి సరదాగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని ప్రచారం చేస్తున్నారని అన్నారు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్. తాను ఇప్పటిదాకా 8, 9 మంది తెలుగు అమ్మాయిలను హీరోయిన్స్‌గా పరిచయం చేశానని, 12, 13 మంది తెలుగు హీరోయిన్స్‌తో పనిచేశానని ఆయన అన్నారు. ఇంతమంది తెలుగు అమ్మాయిలను హీరోయిన్స్‌గా పరిచయం చేసిన అతి కొద్ది మంది నిర్మాతల్లో తానూ ఒకరని, హీరోయిన్స్‌తో పాటు చిత్ర పరిశ్రమలోని అన్ని క్రాఫ్టుల్లో 25 మంది తెలుగు అమ్మాయిలను పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్ కేఎన్ తెలిపారు. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ, డ్రాగన్ సినిమా ఈవెంట్‌లో తెలుగు అమ్మాయిల గురించి నేను జోక్ చేస్తూ మాట్లాడిన మాటలను స్టేట్ మెంట్ ఇచ్చినట్లు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. తెలుగు అమ్మాయిలతో నేను పనిచేయను, తెలుగు అమ్మాయిలకు అవకాశాలు ఇవ్వొద్దు, తెలుగు అమ్మాయిలతో ఇబ్బందులు అని నేను అన్నట్లు హెడ్డింగ్స్ పెట్టి కొన్ని వెబ్ సైట్స్, యూట్యూబ్ ఛానెల్స్ తప్పుగా ప్రచారం చేస్తున్నాయి. నేను ఇప్పటిదాకా 8, 9 మంది తెలుగు అమ్మాయిలను (రశ్మి, ఆనంది ఈ రోజుల్లో, మానస రొమాన్స్, ప్రియాంక జవాల్కర్ టాక్సీవాలా, హారిక (సంతోష్ శోభన్ అప్ కమింగ్ మూవీ), ఐశ్వర్య (అప్ కమింగ్ మూవీ), కుషిత(3 రోజెస్) హీరోయిన్స్‌గా పరిచయం చేశాను, ఇషా రెబ్బా, ప్రియా వడ్లమాని, ఇనయా వంటి 12, 13 మంది తెలుగు హీరోయిన్స్‌తో పని చేశాను. నేను వర్క్ చేసిన వారిలో 80 పర్సెంట్ తెలుగు అమ్మాయిలే. ఇటీవల కాలంలో ఇంతమంది తెలుగు అమ్మాయిలను హీరోయిన్స్‌గా పరిచయం చేసిన అతి కొద్ది మంది నిర్మాతల్లో నేనూ ఒకరిని. హీరోయిన్స్‌గానే కాదు డైరెక్షన్, రైటర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, ఆర్ట్ డైరెక్టర్..ఇలా చిత్ర పరిశ్రమలోని అన్ని క్రాఫ్టుల్లో 25 మంది తెలుగు అమ్మాయిలను పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. త్వరలోనే ఆ టార్గెట్ రీచ్ అవుతాను. నేను నిర్మించే చిత్రాల్లో హీరోయిన్స్‌గా ఫస్ట్ ప్రాధాన్యత తెలుగు అమ్మాయిలకే ఇస్తాను. నేను ఇప్పుడు చేస్తున్న మూడు సినిమాల్లో తెలుగు అమ్మాయిలే హీరోయిన్స్‌గా నటిస్తు న్నారు. అలాగే ఆర్ట్ డైరెక్టర్, ఎగ్జిక్యూ టివ్ ప్రొడ్యూసర్, రైటర్‌గా కూడా తెలుగు అమ్మాయిలనే తీసుకున్నాం. నేను నిర్మించేచిత్రాల్లో హీరోయిన్స్‌గా ఫస్ట్ ప్రాధాన్యత తెలుగు అమ్మాయిలకే ఇస్తాను అన్నారు.




# ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ మూవీ సెన్సార్ పూర్తి

పీపుల్స్ స్టార్‌సందీప్ కిషన్ మోస్ట్ ఎవైటెడ్ 30వ మూవీ మజాకాహ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తోంది. త్రినాధ రావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ మూవీ టీజర్, సాంగ్స్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్యమూవీస్, జీ స్టూడియోస్‌ల కొలాబరేషన్‌లో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సహ నిర్మాత బాలాజీ గుత్తా. రీతు వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న మజాకాలో రావు రమేష్,అన్షు కీలక పాత్రల్లో నటించారు. తాజాగా మజాకా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ సినిమాకి యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైన్మెంట్ వుంది, హెల్తీ కామెడీ, ఎంటర్టైన్మెంట్ చాలా బావుందని సెన్సార్ సభ్యులు మూవీటీమ్‌కి వారి రెస్పాన్స్‌ని తెలియజేశారు. మేకర్స్ ఈసినిమా నుంచి పగిలి సాంగ్‌ని రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ ఈపాటని మాస్‌డ్యాన్స్ నంబర్‌గా కంపోజ్‌చేశారు. మహాలింగం, సాహితీ చాగంటి, ప్రభ పవర్ ఫుల్ వోకల్స్ పాడిన ఈ సాంగ్‌కు కాసర్ల శ్యామ్, ప్రసన్న కుమార్ బెజవాడ అందించిన లిరిక్స్ మాస్‌ని మరింత ఎలివేట్ చేశాయి. ఈ సాంగ్‌లో సందీప్ కిషన్ ఎనర్జిటిక్ మాస్‌డ్యాన్స్ మూమెంట్స్ అదిరిపోయాయి. సందీప్ కిషన్, రీతువర్మ కెమిస్ట్రీ అద్భుతంగా వుంది. మ్యాసీవ్ అండ్ వైబ్రెంట్ సెట్స్‌లో చిత్రీకరించిన ఈసాంగ్‌లో విజువల్స్ కలర్ ఫుల్‌గా వున్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ గ్రేస్ ఫుల్‌గా వుంది. ఈ పాట థియేటర్స్‌లో మాస్‌ని మెస్మరైజ్ చేయడంఖాయం. ఇప్పటికే రిలీజైన మజాకాటీజర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైన్మెంట్‌ని అందించి సినిమాపై అంచనాలని పెంచింది. ఫస్ట్ సింగిల్ బ్యాచులర్స్ ఆంథమ్, సెకండ్ సింగిల్ బేబీ మాచార్ట్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. త్రినాధరావు నక్కినతో సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులలో కొలబారేట్ అయిన రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ, మజాకాకు కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ రాస్తున్నారు. ఈచిత్రానికి నిజార్ షఫీ అద్భుతమైన సినిమాటోగ్రఫీ అందించగా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్షన్ వహిస్తుండగా, పృధ్వీ స్టంట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు.






# 'బాపు' ప్రిరిలీజ్ ఈవెంట్

వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్ లో ఒకరిగా ఆమని, బలగంసుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీడ్రామా బాపు. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. స్టార్ డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, చందూ మొండేటి, బుచ్చిబాబు సాన, హీరో సత్యదేవ్, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. బాపు మూవీ టీంకి థాంక్‌యూ. బాపు ట్రైలర్ చూశాను. ట్రైలర్ చివర్లో ఓడోర్ దగ్గర ఫ్యామిలీ అంతా చూస్తూ వుంటుంది. అసలు ఏం చూస్తున్నారనే క్యూరియాసిటీ కలిగింది. ట్రైలర్ చాలా బాగా కట్ చేశారు. ఇది చాలా మంచి సినిమా అవుతుందనే నమ్మకం వుంది. సినిమా టాక్ బావుంటే మన తెలుగు ఆడియన్స్ సెకండ్ డే నుంచి హౌస్ ఫుల్ చేస్తారు. ఈ సినిమాకి అన్నీ గుడ్ వైబ్స్ వున్నాయి. మ్యూజిక్, స్టార్‌కాస్ట్ అంతా ఇంప్రెసివ్‌గా వుంది. మణి స్క్రీన్ మీద ఇంటెన్స్‌గా ఉంటాడు. బ్రహ్మాజీ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆయనకి ఎంత నాలెడ్జ్ వుంది అసలు (నవ్వుతూ). టీం అందరికీ ఆల్ ది బెస్ట్. ఫిబ్రవరి 21న థియేటర్స్‌లో కలుద్దాం అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమా హిట్ అవుతుందని చెప్పడానికి రెండు, మూడు రీజన్స్ వున్నాయి. ముప్పై యేళ్ళుగా ఎవరికీ కనిపించకుండా దాచుకున్న బ్రహ్మాజీ అన్న తెల్ల జుట్టు ఈ సినిమాలో కనిపించింది (నవ్వుతూ). కచ్చితంగా ఈ సినిమా ఆడుతుంది. అంత నేచురల్‌గా చేశారు. బ్రహ్మాజీ అన్న తన భుజంపై వేసుకొని ప్రమోట్ చేశారు. ట్రైలర్‌లో రా ఎమోషన్ కనిపిస్తోంది. టీం అందరికీ ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ చందూ మొండేటి మాట్లాడుతూ, చిన్న సినిమా పెద్ద సినిమా అని వుండదు. మంచి సినిమా ఏదైనా పెద్ద సినిమానే. బాపు ట్రైలర్ చూస్తే చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఫిబ్రవరి 21 కోసం ఎదురుచూస్తున్నాను అన్నారు. డైరెక్టర్ బుచ్చిబాబు సాన మాట్లాడుతూ, బాపు సినిమా ట్రైలర్ చూశాను. చాలా బావుంది. ట్రైలర్ డైరెక్టర్ హీరోలా కనిపించారు. దయ చాలా బాగా తీశారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. థాంక్ యూ అన్నారు. యాక్టర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ, మా ముఖ్య అతిధులందరికీ థాంక్ యూ. ఈ సినిమాకి ప్రొడ్యూసర్ గారు నాకు డబ్బులు ఇవ్వలేదు. ఆడియన్స్ టికెట్స్ కొని కలెక్షన్స్ వస్తే అందులో నుంచి ఇస్తానని చెప్పారు. ప్లీజ్ అందరూ థియేటర్స్‌కి వెళ్లి మా రెమ్యునరేషన్ వచ్చేలా చేయండి(నవ్వుతూ). ఇందులో ఓ మంచి పాత్ర చేశాను. ఈ సినిమా క్రెడిట్ మా డైరెక్టర్‌కి దక్కుతుంది. మా టీం అందరికీ థాంక్ యూ అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ధ్రువన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. బాపు అద్భుతమైన కథ. ఈ సినిమాకి మ్యూజిక్ ఇవ్వడానికి నన్ను ఎంచుకున్న డైరెక్టర్ దయకి థాంక్ యూ. లిరిక్ రైటర్స్‌కి థాంక్ యూ. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సినిమాని చూసి ఆడియన్స్ గొప్ప అనుభూతిని పొందుతారు అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ మాట్లాడుతూ, బాపు సినిమాకి పనిచేసిన అందరికీ థాంక్ యూ. ధ్రువన్ నాకు ఎప్పటి నుంచో తెలుసు. బాపు సినిమా పెద్ద హిట్ కావాలని, అందరికీ మంచి పేరు తీసుకు రావాలని కోరుకుంటున్నాను. నిర్మాత భాను ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, కిస్మత్ తర్వాత ఇది నా రెండో సినిమా. దయ ఈ కథ చెప్పినపుడు చాలా నచ్చింది. ఇంత అద్భుతమైన సినీ ప్రముఖులతో ఈ వేదిక పంచుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఇదొక గౌరవంగా భావిస్తున్నాను. నాగ్ అశ్విన్ మహానటి చూసి మెస్మరైజ్ అయ్యాను. బ్రహ్మాజీ థాంక్ యూ. అందరికీ పేరు పేరునా ధన్య వాదాలు అన్నారు. డైరెక్టర్ దయ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నాగ్ అశ్విన్‌కి, చందుకి, బుచ్చిబాబుకి సత్య దేవ్‌కి థాంక్ యూ. మా నిర్మాతలకు థాంక్ యూ. నా కథని నమ్మి నిర్మించారు. మా టీం అందరికీ పేరు పేరున థాంక్ యూ అన్నారు.




# 'దిల్ రూబా' 'హే జింగిలి..' సాంగ్ రిలీజ్

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. "దిల్ రూబా"చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖమ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణసంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. "దిల్ రూబా"సినిమా మార్చి14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ రామా నాయుడు స్టూడియోలో జరిగిన ఈవెంట్ లో "దిల్ రూబా" సెకండ్ సింగిల్ హే జింగిలి.. రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ రవి మాట్లాడుతూ, మా "దిల్ రూబా" సినిమా సెకండ్ సింగిల్ హే జింగిలి.. రిలీజ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. సినిమాను అందరికీ నచ్చేలా చేసిన మా టీమ్‌కు థ్యాంక్స్. నేను ప్రొడ్యూసర్ డిస్ట్రిబ్యూటర్ కాబట్టి సారెగమా వాళ్లు మాతో టైఅప్ అయ్యారు. మాది పాన్ ఇండియా రిలీజ్ మూవీ కాకపోయినా పాన్ ఇండియా ప్రొడక్షన్‌తో కలిసి సినిమా చేశాం. మార్చి 14న మీ ముందుకు రిలీజ్‌కు వస్తున్నాం అన్నారు. డైరెక్టర్ విశ్వ కరుణ్ మాట్లాడుతూ, హే జింగిలి పాటను మీరంతా ఎంజాయ్ చేశారని నమ్ముతున్నాం. ఈ పాటలో కిరణ్, రుక్సర్ పెయిర్ చాలా బాగుంది. ఫస్ట్ టైమ్ లవ్‌లో పడిన అబ్బాయి కింగ్ లా ఫీలవుతాడు. ఆ లవ్ ఫెయిలై సెకండ్ టైమ్ లవ్‌లో పడినప్పుడు అతనిలో ఒక భయం మొదలవుతుంది. ఇలాంటి ఒక ఎక్స్ ప్రెషన్ చెప్పగానే భాస్కరభట్ల సూపర్బ్ లిరిక్స్ ఇచ్చారు. సామ్ సీఎస్ సూపర్ హిట్ ట్యూన్ ఇచ్చారు. గంటలో ఈ పాట రెడీ అయ్యింది. దిల్ రూబాలో హే జింగిలి సాంగ్‌కు మంచి పేరొస్తుంది. మీరంతా మా మూవీకి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం అన్నారు. హీరోయిన్ రుక్సర్ ధిల్లాన్ మాట్లాడుతూ, "దిల్ రూబా" మూవీ ప్యూర్ లవ్ ఎమోషన్, ఫీలింగ్‌తో ఉంటుంది. నా క్యారెక్టర్ ద్వారా ఫుల్ లవ్ అండ్ ఎమోషన్ చూపించాను. మా మూవీ రిలీజ్ కొంచెం ఆలస్యమైంది. రంగుల పండుగ హోలీ సందర్భంగా ఈ కలర్ ఫుల్ లవ్ స్టోరీతో మార్చి 14న రిలీజ్‌కు వస్తున్నాం. ఈ మూవీలో నా క్యారెక్టర్‌కు ప్రాధాన్యత ఉంటుంది. నా క్యారెక్టర్ ద్వారా మంచి ఎమోషన్ చూపించే అవకాశం దక్కింది. నాకు, కిరణ్‌కు మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకుంటాయి. మీరంతా థియేటర్‌లో మూవీ చూసి ఇచ్చే రెస్పాన్స్ కోసం వేచి చూస్తున్నా. మీతో కలిసి మా టీమ్ అంతా మూవీ చూడాలనుకుంటున్నాను. నాతో వస్తావా అని హే జింగిలి పాటలో ఒక లైన్ ఉంది. అలా మీరంతా మార్చి 14న థియేటర్స్‌లోకి "దిల్ రూబా" చూసేందుకు మాతో వస్తారా. మా టీమ్ అంతా వెయిట్ చేస్తున్నాం అన్నారు.



## నందవరంలో పొగాకు బ్యారన్లు దగ్ధం

**మర్రిపాడు,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండలంలోని నందవరం కూడలి వద్ద ప్రమాదవశాత్తు రెండు పొగాకు బ్యారన్లు బుధవారం దగ్ధమయ్యాయి. బాధితుల సమాచారం మేరకు మర్రిపాడు, ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పక్కనున్న బ్యారన్లకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. పరిమి వెంకటరామమ్మకు చెందిన ఒక బ్యారన్, కర్ర వెంకటేశ్వర్లు, కర్ర వాజారత్తయ్యకు చెందిన ఒక బ్యారను మొత్తం రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమైన ఘటనలో దాదాపు 9లక్షలు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు.

## విజయవాడ బిఐఎస్ నేతృత్వంలో సైన్స్ టీచర్లకు శిక్షణ



**విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలల్లో ప్రామాణిక క్లబ్‌లకు మార్గనిర్దేశం చేస్తున్న 40 మంది ఉపాధ్యాయులకు పాడేరులోని ప్రముఖ హోటల్లో కాఫీ విత్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటిడిఎ లెర్నింగ్‌సైన్స్ వయా స్టాండర్డ్స్ పై సైన్స్ టీచర్లకు రాష్ట్రంలో 6వ శిక్షణ కార్యక్రమం నిర్వహించిన బిఐఎస్ సైంటిస్ట్ సి/ డిప్యూటీ డైరెక్టర్ డి వివేకవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పద్ధతి సైన్స్‌లో విజయం సాధించడానికి, నమూనానికి విలువైన సహకారాన్ని అందించడమేకాక సహాయ పడుతుందన్నారు. బిఐఎస్ విధి విధానాలను సోదాహరణంగా వివరించారు. ముఖ్య అతిథి అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి పి బ్రహ్మాజీ మాట్లాడుతూ భవిష్యత్‌లో నిజజీవిత పరిస్థితులు ధైర్యంగా ఎదుర్కోడానికి శక్తినిచ్చేలా పాఠ్యప్రణాళికలు సాధనంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎల్ రజని మాట్లాడుతూ ఈ స్టాండర్డ్స్ క్లబ్‌ల ద్వారా నాణ్యత ప్రమాణాల విషయాన్ని విద్యార్థులకు తెలియజేసిన బిఐఎస్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో బిఐఎస్ స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణవీర్ వర్మ, జె అనిల్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి రాంబాబు, బిఐఎస్ అధికారులు పాల్గొన్నారు.



## పద్మావతి యూనివర్సిటీలో 7.5 కోట్లతో అధునాతన ఇండోర్ హాల్ ప్రారంభం

### - రాష్ట్రంలో క్రీడలకు అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేస్తాం:మంత్రి నారా లోకేష్

**తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త** రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి, క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తామని రాష్ట్ర విద్య,ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు.తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం,మహిళా యూనివర్సిటీ,శాప్ సంయుక్తంగా రూ.7.5 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ హాల్ ని మంత్రి లోకేష్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ అమరావతిలో అధునాతన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం,స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.పద్మావతి యూనివర్సిటీ వేదికగా ఉత్తమ క్రీడాకారిణులను తయారుచేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం దోహదపడుతుందన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారిణులతో మంత్రి లోకేష్ కొద్దిసేపు షటిల్ ఆడి ఉత్సాహ పర్చారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఏరోబిక్స్, ట్రెక్కింగ్,యోగా మెడిటేషన్ సెంటర్లను కూడా లోకేష్ ప్రారంభించారు. యూనివర్సిటీ విద్యార్థినులు,క్రీడాకారిణులు ఇక్కడ ఏర్పాటు చేసిన క్రీడా వసతులను వినియోగించుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమ మాట్లాడుతూ క్రీడాకారిణులకు యూనివర్సిటీలో మంచి శిక్షణ వేదిక లభించడం తమ విద్యార్థినులకు గొప్ప అవకాశమన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.క్రీడాభివృద్ధికి మంత్రి లోకేష్ చూపుతున్న చొరవ, కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్,జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్,శాప్ ఎండి గిరీషా,శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు,పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్,తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, యూనివర్సిటీ రిజిస్ట్రార్ రజని తదితరులు పాల్గొన్నారు.

## జైలుకు వెళ్లి నేరస్తులను పరామర్శించే జగన్‌కు అసెంబ్లీకి వెళ్లేందుకు ముఖం చెల్లదు

### పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయ వాడ.ఫిబ్రవరి 19,ప్రభాత వార్తప్రతినిధి:** నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్లను జైలుకు వెళ్లి పరామర్శించే జగన్‌కి, అసెంబ్లీకి వెళ్లేందుకు ముఖం చెల్లదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళ్లని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యల మీద మాట్లాడే నైతికత లేదన్నారు. జగన్ ప్రెస్ మీట్ లు పెట్టి పురాణం అంతా చెప్పే తీరిక దొరుకుతుంది, కానీ అసెంబ్లీలో పాలకపక్షాన్ని నిలదీసే ధైర్యం లేదన్నారు. జగన్ పై ఎక్స్ వేదికగా షర్మిల ఆరోపణలు చేసారు.ప్రజలు 11 మందిని గెలిపిస్తే శాసనసభకు రాకుండా నీతుల చెబుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజల మధ్య తిరిగే అర్హత లేదని ఆక్షేపించారు. ఈ సారి కూడా అసెంబ్లీకి వెళ్లే దమ్ము లేకుంటే వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి నిరూపించుకోవాలని వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బడ్జెట్ లో సూపర్ సిక్స్ పథకాలకు అగ్రభాగం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని పథకాలను ఈ ఏడాది నుంచే అమలు చేయాలని సూచించారు.

## మానవ అక్రమ రవాణా మూడవ అతిపెద్ద చట్టవిరుద్ధమైన నేరం

### జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న సురక్షిత వలసల సంక్షోభం నేపథ్యంలో, తొమ్మిది దక్షిణాసియా దేశాలకు చెందిన సామాజిక సంస్థల ప్రతినిధులు ప్రభుత్వాలు, విధాన రూపకర్తలు, చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు, ఐక్యరాజ్యసమితి ,పౌర సమాజ సంస్థలు కలిసి "సౌత్ ఏషియా కన్సల్టేషన్ ప్రమోటింగ్ సేఫ్ మైగ్రేషన్‌ను ప్రమోటింగ్ ట్రాఫికింగ్‌పై పోరాటం చేస్తున్నాయి.వీటి ప్రాముఖ్యతను వాసవ్య మహిళా మండలి కేంద్రంగా వివరిస్తూ కీలకచర్చ జరిగింది..'సౌత్ ఏషియా కన్సల్టేషన్ ప్రమోటింగ్ సేఫ్ మైగ్రేషన్‌ను ప్రమోటింగ్ ట్రాఫికింగ్‌పై పోరాటంపై బుధవారం రాత్రి వాసవ్యమహిళా మండలి సమాచార పత్రాన్ని విడుదల చేసింది.సమగ్రమైన, హక్కుల ఆధారిత వ్యూహం, ప్రాంతమంతటా సామరస్య పూర్వకమైన వలస విధానాలు మరియు అంతర్జాతీయ మరియు ప్రాంతీయ ప్రమాణాలకు అనుగుణంగా చట్టపరమైన మరియు విధాన సంస్కరణల ఆవశ్యకత, ట్రాఫికింగ్ వంటి సంఘటిత నేరాలకు, ద్వైపాక్షిక మరియు బహుళ పక్షీయ ఒప్పందాలను ప్రోత్సహించడంతోపాటు, ద్వైపాక్షిక మరియు బహుళ పక్షీయ ఒప్పందాలను ప్రోత్సహించడం కూడా అవసరమని నొక్కి చెప్పింది ఈ సంప్రదింపులలో వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చినవారు మరియు అక్రమ రవాణా బాధితులు తమ అనుభవాలను మరియు పోరాటాలను పంచుకున్నారు మరియు వారి సూచనలను అందించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, 39 దేశాల్లో బాలల రక్షణ,. పిల్లల హక్కుల కోసం పనిచేస్తున్న పౌర సమాజ సంస్థల నెట్‌వర్క్, సంప్రదింపుల యొక్క సాంకేతిక భాగస్వామిగా ఉంది, అయితే అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ సంప్రదింపులను నిర వ్యహించింది. అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి బహుముఖ వ్యూహం యొక్క తక్షణ అవసరాన్ని నొక్కి చెప్పడం. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు మాట్లాడుతూ, "ట్రాఫికింగ్ అనేది ఒక వ్యవస్థీకృత మరియు ఆర్థిక నేరం, ఇది ముఖ్యంగా పిల్లలు మరియు బలహీనమైన యువత దోపిడీకి గురవుతుంది. దీనిని ఎదుర్కోవడానికి, మనకు బహుముఖ వ్యూహం అవసరం, అక్రమ రవాణా, విచారణ మరియు వ్యవస్థీకృత క్రైమ్ సిండికేట్‌లను విచ్ఛిన్నం చేయడం మరియు అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత క్రైమ్ సిండికేట్‌ల ద్వారా వ్యవస్థీకృత ట్రాఫిక్ మరియు గ్లోబల్ కోఆర్డినేషన్‌ను మెరుగుపరచడం." భారతదేశానికి బహిష్కరించబడిన వ్యక్తుల దుస్థితి మరియు ఇలాంటి పరిస్థితులలో ఇతరులలో భయం గురించి వ్యాఖ్యానిస్తూ, ఈ భయంకరమైన వాస్తవికత, అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త ప్రతిస్పందన యొక్క తక్షణ అవసరాన్ని ఎత్తి చూపుతుందని, ఈ అక్రమ రవాణాదారుల సిండికేట్‌లను దేశ వ్యాప్తంగా అణిచివేసేందుకు భారతదేశం, అమెరిక, ఇతర ప్రభుత్వాలను కోరుత న్నట్లు ఆయన అన్నారు. మేము బాధితులు అందించిన సమాచారాన్ని విశ్లేషించాలి, ఆర్థిక లావాదేవీలను గుర్తించాలి మరియు దోపిడీ చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఈ నేరాన్ని నడిపించే ఆర్థిక సిండికేట్‌లను విచ్ఛిన్నం చేయాలి. వలసలు అనేది మానవ స్వభావం యొక్క ప్రాథమిక అంశం అని కూడా అతను నొక్కిచెప్పాడు, పెరుగుదల, అవకాశం మరియు అభివృద్ధిని సాధించడం ద్వారా నడపబడుతుంది. అయితే, దోపిడీ, బలవంతం మరియు అవకతవకలు పట్టుకునే దశలోనే వలసలు అక్రమ రవాణాగా మారతాయి.కన్సల్టేషన్‌ను ఉద్దేశించి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు మరియు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (విదిశిదిళి) మాజీ ఛైర్మన్ ప్రియాంక్ కనూంగో మాట్లాడుతూ, "అవగాహన అవసరమయ్యే ఒక క్లిష్టమైన అంశం.

## సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తా

### - ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్

**తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** పలు రకాల సమస్యలతో బాధపడుతున్న వారందరికీ అండగా నిలుస్తానని,సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలి పారు. తిరుపతిపర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం పార్టీకార్యాలయంలో మంత్రి 59వ రోజు ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధసమస్యలతో బాధపడుతున్న బాధితులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. 2007నుండి 2011వరకు కాంట్రాక్టు పద్ధతిలో నియమితులై, సొంత మండలాల్లోని పిహెచ్‌సి సబ్‌సెంటర్లలో రెండవ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీ కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. 16ఏళ్ళుగా రెగ్యులర్ వారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, వేతనాలు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెగ్యులర్ ఎఎన్ఎం పోస్టులను 2007 నుండి పనిచేస్తున్న వారితోనే భర్తీచేయాలని కోరారు. ఎస్ఎల్ఎమ్ పిసి కార్పొరేషన్ తరపున తిరుమల లడ్డూ కౌంటర్‌లో విధులు నిర్వహించే తాను రోడ్డుప్రమాదం కారణంగా కొన్ని నెలలుగా విధులకు హాజరుకాలేక పోయానని, రీజాయినింగ్‌కు అనుమతించాలని తిరుపతికి చెందిన

ఏ.నాగసాయికార్తీక్ విజ్ఞప్తి చేశాడు. హంద్రీనీవా ప్రాజెక్టు క్రింద భూమి కోల్పోయామని, ఇంటర్ చదివిన తన కుమారుడికి టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం అవకాశం కల్పించి ఆదుకోవాలని చిత్తూరు జిల్లా ఐరాల మండలం చెంగనపల్లికి చెందిన పి.మునీశ్వరశెట్టి కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన విధంగా ఆదుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

## మిర్చి రైతులకు లబ్ధిచేకూర్చేందుకే ఎంఎస్‌పిని ఖరారు చేయలేదు

### - రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** బహిరంగ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరుగుతున్ననేపథ్యంలో ప్రభుత్వం కనీసమద్దతు ధర ప్రకటించినట్లయితే నష్టపోతారనే ఉద్దేశ్యంతో మిర్చికి ఇప్పటి వరకు కనీస మద్దతు ధర ప్రకటించలేదని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్ శాఖమంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు.బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలోఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ శ్రీలంక,చైనా మలేషియా తదితర దేశాలకు మన మిర్చి ఎగుమతయ్యేదని అయితే ఆయా దేశాలు సొంతంగా మిర్చి పంట సాగుచేసుకోవడం వల్ల మిర్చి ఎగుమతులు చాలా తగ్గిపోవడ వల్ల మిర్చరేటు తగ్గిందన్నారు.కానీ చైనాలో మిర్చి పంట సరిగాలేకపోవడం వల్ల మళ్ళీ ఆదేశం మన మిర్చి పంటపై ఆధారపడే పరిస్థితులు ఏర్పాడ్డాయని ఫలితంగా మిర్చి ధరలు బారీగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు.మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని ప్రస్తుతం ఉన్నకేంద్ర మద్దతు ధరను కూడా పెద్దఎత్తున పెంచాలని కోరేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు ఢీల్లీ వెళుతున్నారన్నారు.కేంద్రమంత్రుల బృందంతో చర్చించనున్నారని,చర్చల ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తంచేశారు.గత ప్రభుత్వం భూసార పరీక్షలను పూర్తిగా నిలిపివేయడమే కాకుండా,వ్యవసాయ యాంత్రీకరణ కింద ఒక్కపైసా కూడా



సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చన్నాయుడు

కేటాయించలేదన్నారు. బిందుసేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్/స్ప్రింకర్లను ఏ ఒక్కరికి పంపిణీ చేయలేదన్నారు.దాదాపు రూ.1600కోట్లుమేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే తాము అధికారంలోనికి వచ్చిన వెంటనేరైతులకు ఆ సొమ్ము చెల్లించడం జరిగిందన్నారు.2020జనవరి మాసంలో బహిరంగ మార్కెట్‌లో మిర్చి ధర దాదాపు రూ.12000లు వరకు ఉంటే అదే సమయంలో గత ప్రభుత్వం మిర్చికి రూ.7000లు కనీస మద్దతు ధరను ప్రకటించి రైతులకుపూర్తిస్థాయిలో నష్టాన్ని కలిగించిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు.

ఆ సమయంలో కూడా మార్కెట్ ఇంటర్వేన్షన్ ఫండ్ క్రింద ఒక్కపైసా కూడా అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించలేదన్నారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఢీల్లీరావు, మార్కెటింగ్ శాఖ సంచాలకులు మరియు రైతు బజార్ల సీఈవో విజయ సునీత సమావేశంలో పాల్గొన్నారు.

## మహిళా శక్తి క్యాంటిన్లకు బ్యాంకు రుణాలు

### రూ.5నుంచి రూ.20లక్షల వరకు వడ్డీలేని రుణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి,19 ప్రభాతవార్త:** మహిళలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థిక స్వాలంబన దిశగా నడిపే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు కోసం మహిళా శక్తి క్యాంటిన్లు అనే ప్రత్యేక పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా మహిళలకు రాష్ట్ర సచివాలయంలోనే కాకుండా, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లలో,కార్పోరేషన్ కార్యాలయాలు, బస్టాండ్‌లలో మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. వీటికి పలు వర్గాల నుంచి కూడా మంచి స్పందన రావడంతో వారిని మరింత ప్రోత్సహించే కార్యక్రమంలో బాగంగా వాటికి వాటికి పలు బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు కూడా ఇప్పిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతి జిల్లాలో మహిళాశక్తి క్యాంటిన్లు ఉన్నాయి. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో కూడా వీటి ఏర్పాటు జరుగుతోంది. మరిన్ని ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు దరఖాస్తుల పరిశీలన కూడా జరుగుతోంది.మహిళా శక్తి క్యాంటీన్ల వల్ల 2 రకాల ప్రయోజనాలు ఉన్నాయి. మహిళా సంఘంలోని సభ్యులు కలిసి ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసుకొని.. రోజువారీ టిఫిన్లు, భోజనాలు అమ్ముకోవచ్చు. పచ్చళ్లు, కర్రీస్ అమ్ముకోవచ్చు. ఈ క్యాంటీన్ల ఏర్పాటుకి పూర్తి ట్రైనింగ్ కూడా ఇస్తారు. అందువల్ల ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించుకోవచ్చు. క్రమంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ.. వడ్డీ లేని రుణాలను చిన్న మొత్తాల్లో నెలవారీ చెల్లించవచ్చు. ఇటీవల ఓ మహిళ.. సిద్ధిపేటలోనే మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించింది. ఆమె రూ.5 లక్షలకు పైగా రుణం తీసుకుని ఆ మొత్తంతో యంత్రాలు, ఫర్నిచర్, టేబుళ్ల వంటివి కొన్నదితర్వాత టిఫిన్లు, భోజనం, స్నాక్స్, పచ్చళ్లు అమ్ముతోంది. ఇప్పుడు ఆమె ఖర్చులు పోగా రోజూ రూ.3వేల దాకా లాభం సంపాదిస్తోంది. అంటే.. నెలకు రూ.90వేల దాకా లాభం వస్తోంది. అందువల్ల ఆమె ఇప్పుడు తన రుణాన్ని క్రమంగా చెల్లించడం తేలికవుతోంది. ఈ క్యాంటీన్లలో ఆహారం అత్యంత నాణ్యమైనదిగా శుచిగా, శుభ్రంగా ఉండటంతో కస్టమర్లు మళ్లీ మళ్లీ వచ్చి తింటున్నారు.ఒక క్యాంటీన్ ఏర్పాటుకి 10 లక్షల నుంచి 20 లక్షల వరకుబ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తున్నారు. ఈ రుణానికి పూచీకత్తు అవసరం లేదు. వడ్డీ కూడా ఉండదు. ఇటీవల సిద్ధిపేటలో 3 క్యాంటీన్లకు రూ.34 లక్షలుమంజూరయ్యాయి. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లపాటూ మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చెయించాలని నిర్ణయించుకుంది. అందువల్ల ఎవరైనా ఈ క్యాంటీన్ పెట్టాలి అనుకుంటే.. ముందుగా మెప్మా అధికారులను సంప్రదిస్తే వారు పూర్తి సమాచారాన్ని అందిస్తారు. అంతే కాకుండా క్యాంటీన్‌కి రుణం ఇప్పించడం, కావాల్సిన యంత్రాలు, టేబుళ్లు, సామాగ్రి అన్ని ఎలా ఎక్కడ కొనాలో చెప్పడమే కాకుండా క్యాంటీన్ ఎక్కడ పెట్టాలో సూచిస్తారు. వారు చెప్పిన చోటు కాదనుకుంటే, ఎక్కడ పెట్టాలో మహిళలు తమ నిర్ణయం చెప్పవచ్చు. ప్రభుత్వం రద్దీ ప్రాంతాల్లోనే ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుండటంతో వ్యాపారం బాగానే సాగుతోందని నిర్వహకులు చెబుతున్నారు.

## కెసిఆర్ పగటికలలు కంటున్నారు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి,19 ప్రభాత వార్త:** కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కన బడుతుందని రెవెన్యూ,హౌసింగ్,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్లు ఫాంహౌస్ దాటని దొరవారు అధికారంపై పగటికలలు కంటున్నారని ఆయనఎద్దేవా చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేళ్లు అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచి అజ్ఞాతంలోకి వెళ్లిన కేసీఆర్‌కి 14 నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి ఏ విధంగా కనబడుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ ,ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారు. 14 నెలల నుంచి ఫాంహౌస్ దాటని ఆయన స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గాని, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు గాని ఆయనకు ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారు. తెలంగాణ ప్రజలు కష్టపడి కేసీఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే, ఆయన ఏనాడు ప్రజాతీర్పును గౌరవించలేదు. అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. కానీ కేసీఆర్ తాను ప్రజలు జవాబుదారీగా లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమనదిశలోకి తీసుకెళ్లారు, పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14నెలల్లో తాము సాధించిన అభివృద్ధిని సవివరంగా కేసీఆర్ ముందుంచుతాం.కాంగ్రెస్ భవిష్యత్ గురించి కాకుండా ముందుగా కేసీఆర్ తన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు.విపరీతమైన అప్పులు చేసి నెత్తినమీద మిత్తిల భారం పెట్టిపోయారన్న పొంగులేటి పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదన్నారు.

## ఐదు సంవత్సరాల వరకు ఉప ఎన్నికలు రావు

### కేసీఆర్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి అంటున్నాయని, అయితే ఐదు సంవత్సరాల వరకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు ఉనికి లేదన్నారు. అందుకే కెసిఆర్ ఇలాంటి మెసేజ్‌లు ఇస్తున్నాడన్నారు. ఫాంహౌస్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కార్యకర్తల ముందు అంటున్నాడని, కేవలం కార్యకర్తలను ఉత్తేజ పర్చడానికే కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది అంటున్నాడని, ఆయనకు చిత్తశుద్దే లేదన్నారు. చిత్త శుద్ధి ఉంటే అపొజిషన్ లీడర్‌గా అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలు చర్చించే వారన్నారు.

## కులగణనలో గతంలో పాల్గొనని వారు ఎన్‌రోల్ చేసుకోవాలి

### బిసి సంక్షేమం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గతంలో కులగణనలో పాల్గొనని వారు తప్పకుండా తమ వివరాలను ఇవ్వాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి చెందిన మేధావులు, బలహీన వర్గాల నాయకులు, ప్రొఫెసర్లు వివిధ స్థాయిల్లో ఉన్న అందరి విజ్ఞప్తిమేరకు కులగణనలో నమోదు చేసుకోని వారికి మరో అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 16 నుంచి 28 వరకు.. ఇప్పటి వరకు కులసర్వేలో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. మూడు పద్ధతుల్లో కులసర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. కులసర్వేకి ఆనాడు విజ్ఞప్తిచేసిన వారు, విమర్శలు చేసిన వారు,ఇప్పుడు మిస్ అయిన వారందరినీ మోటివేట్ చేపించి సర్వేలో భాగస్వామ్యులు అయ్యేవిధంగా చూడాలని తెలంగాణ మేధావులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్, హరీష్‌రావు సర్వేలో పాల్గొని పార్టీపక్షాన, బలహీనవర్గాలపక్షాన సానుకూలంగా ఉన్నామని చెప్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అవేమీ చేయకుండా విమర్శలకే పరిమితమయితే తెలంగాణ బలహీనవర్గాలు చూస్తూ ఊరుకోరని మంత్రి గుర్తు చేశారు.

## కేసీఆర్‌కు ప్రజాస్వామ్యమంటే విలువ లేదు

### అధికారం దరిదాపుల్లో కనబడకపోవడంతోనే ఈ అసహనం: చిట్ చాట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మాట్లాడిన మాటలకు మంత్రి పొన్నం కౌంటర్ ఇచ్చారు. బుధవారం తనను కలిసిన మీడియా వారితో కేసీఆర్ వ్యాఖ్యలపై చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ పాస్ పోర్ట్ ఆఫీస్‌కు వచ్చాడు కాబట్టి ఎలాగూ హైదరాబాద్ వచ్చానని పార్టీ ఆఫీసుకెళ్లి మీటింగ్ పెట్టాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామన్నారు. పంట బోనస్, రైతు భరోసా పెంపు, 55 వేల ఉద్యోగాలు, డీఎస్సీ పోస్టింగ్‌లు ఇలా చెప్పుకుంటే పోతే అనేకం చేశామన్నారు. కేసీఆర్ వాఖ్యల్లో అసహనం తప్ప మరోకటి లేదని పొన్నం మండి పడ్డారు. అధికారం దరిదాపుల్లో కనబడకపోవడంతోనే కేసీఆర్‌కు ఈ అసహనమని అన్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తారని అది పక్కా అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వాస్తవం మాట్లాడుతుంటే ..జీర్ణించుకోలేక అసహనంతో కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా పాత పథకాలను ఒక్కటి కూడా రద్దు చేయకుండా, తాము ఇచ్చిన హామీలను సైతం అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా సహకరిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు కేసీఆర్ కలసి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమిళనాడు తరహాలో అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వంతో కలసి రావాలన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళ్తామని.. అందుకు ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కూడా కలసి రావాల్సిందేనని మంత్రి హితవు పలికారు.

## 15 నెలల తరువాత ప్రజలు గుర్తుకు వచ్చారా?

### టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** 15 నెలల తరువాత మాజీ సిఎం కెసిఆర్‌కు ప్రజలు గుర్తుకు వచ్చారా? అంటూ టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రజల గొంతుకగా మాట్లాడుతారని ఆశించాం కానీ మాట్లాడలేదన్నారు.బిజెపి పార్టీలోపాయికారి ఒప్పందంతోనే ఎంఎల్సీ ఎన్నికల్లో పోటీచేయలేదన్నారు. ప్రభుత్వం ప్రాతిష్మాత్మికగా కులగణన చేస్తే కనీసం కెసిఆర్ స్పందన లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించడంలో పూర్తి విఫలం అయ్యారన్నారు. కెసిఆర్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు అన్నారు. తెలంగాణ రాష్టంను పది ఏళ్ల స్వంత ఆస్తిలాగా వ్యవహరించారని అన్నారు. కెసిఆర్ ప్రజల కోసం సలహాలు సూచనలు ప్రభుత్వం కోరిన స్పందన లేదన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఆధునిక బోధనా సామాగ్రి!

### డెహ్రాడూన్‌లోని పాఠశాలలను పరిశీలించిన విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా దృష్టి లోపం గల విద్యార్థుల కోసం విద్యా విధానాలు, మౌలిక సదుపాయాలతోపాటు అభ్యాస పద్ధతులను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోనున్నారు. ఇందు కోసం ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి విధానాలను అమలు చేస్తున్నారో తెలుసుకోవడం కోసం విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యశాఖ అధికారులతో కలిసి డెహ్రాడూన్‌లోని కొన్ని దివ్యాంగ పాఠశాలలను పరిశీలించారు. అక్కడ అధికారులు పరిశీలించిన విధానాలు, ఆధునిక యంత్రాలున ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు గణనీయంగా దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య జేడీ వెంకట నర్సమ్మ, దారుల్షిఫా అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ మందడి వెంకట్ రెడ్డి, మలక్‌పేటలోని బి బ్లాక్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌కి చెందిన సీనియర్ టీచర్ సువర్ణ ఈ నెల 18, 19 తేదీల్లో డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజేబిలిటీస్ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. తెలంగాణ ప్రతినిధి బృందాన్నిఎన్ఐఈపీవీడీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ అమిత్ శర్మ, డాక్టర్ కె శ్రీనివాస్ రెడ్డి,

డాక్టర్ రామకృష్ణ, అధ్యాపక సభ్యులు, విద్యార్థులు స్వాగతించారు. తెలంగాణ రాష్ట్రంలో దృష్టి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలలు మరియు ప్రత్యేక విద్యా సంస్థలను బలోపేతం చేయడంపై విలువైన చర్చలకు దోహద పడినట్టు అధికారులు తెలిపారు.

## పాస్‌పోర్టు కార్యాలయానికి తెలంగాణ మాజీ సీఎం కెసిఆర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి తెలంగాణ రాష్ట్ర మాజీముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చారు.తన పాస్‌పోర్టును రెన్యువల్ చేసుకోడానికి ఆయన వచ్చారు. కార్యాలయ సిబ్బంది వెంట ఉండి ఆయన పాస్‌పోర్టును రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేశారు.




## హాకీ ప్రొ లీగ్‌లో.. భారత్‌కు నిరాశ

### పురుషుల, మహిళల జట్లు ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల, మహిళల జట్లకు నిరాశ ఎదురైంది. భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 1-4 గోల్స్ తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్ జర్మనీ జట్టు చేతిలో భారత మహిళల జట్టు 3-4 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టు చేతిలో ఓడిపోయాయి. జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున గుర్జంత్ సింగ్ (13వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. జర్మనీ తరఫున ఫ్లోరియన్ స్పెర్లింగ్ (7వ నిమిషంలో), థీస్ ప్రింజ్ (14వ నిమిషంలో), మైకేల్ స్ట్రుతోఫ్ (48వ నిమిషంలో), రాఫెల్ హార్ట్‌కోప్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు తరఫున బల్జీత్ కౌర్ (19వ నిమిషంలో), సాక్షి రాణా (38వ నిమిషంలో), రుతుజా (45వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. స్పెయిన్ జట్టుకు సోఫియా (21వ నిమిషంలో), లూసియా (52వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా, ఎస్తెల్ (25వ, 49వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించింది.

## వన్డే ర్యాంకింగ్స్‌లో గిల్ నం.1

### టాప్ 10లో నలుగురు టీమిండియా ప్లేయర్లు



**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు. గత ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలో ఉండిన గిల్ ఓ స్థానం మెరుగుపర్చుకుని టాప్ ర్యాంక్‌కు చేరాడు. దీంతో ఇప్పటి వరకూ ఆస్థానంలో ఉన్న పాక్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజమ్‌ను వెనక్కు నెట్టాడు. ప్రస్తు ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బాబర్ 773 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో ఉన్నాడు. సచిన్, విరాట్, ధోని తర్వాత ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరిన 4వ భారత బ్యాటర్‌గా గిల్ రికార్డుల్లోకెక్కాడు. ప్రస్తుతం గిల్ ఖాతాలో 796 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఐసీసీ బుధవారం విడుదల చేసి ఈ వారం ర్యాంకింగ్స్‌లో గిల్‌తో కలుపుకుని భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు టాప్10లో ఉన్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 3వ స్థానంలో, విరాట్ కోహ్లి 6లో, శ్రేయస్ అయ్యర్ 9వ స్థానంలో నిలిచారు. గతంతో పోలిస్తే శ్రేయస్ ఓ ర్యాంక్ మెరుగుపర్చుకుని 9వ స్థానానికి చేరాడు. ఇక సౌతాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ 4లో, న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ 5, ఐర్లాండ్ ఆటగాడు హ్యారీటెక్టార్ 7, లంక కెప్టెన్ అసలంక 8, షాయ్ హోప్ 10వ స్థానంలో ఉన్నారు.

బౌలర్ల విషయానికొస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్‌ను కిందకు దించి లంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత బౌలర్ కుల్దీప్ యాదవ్ ఓ స్థానం మెరుగుపర్చుకుని నాలుగో స్థానానికి చేరాడు. భారత్ నుంచి టాప్10లో కుల్దీప్‌తో పాటు, సిరాజ్ (10వ ర్యాంక్) మాత్రమే ఉన్నాడు. ఆల్‌రౌండర్లలో ఆఫ్ఘనిస్తాన్ వెటరన్ మొహమ్మద్ నబీ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా 2వ స్థానంలో నిలిచాడు. భారత్ నుంచి రవీంద్ర జడేజా ఒక్కడే టాప్ 10లో ఉన్నాడు. జడ్డూ 217 రేటింగ్ పాయింట్లతో పదోస్థానంలో నిలిచాడు. జట్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే టీమిండియా టాప్ ర్యాంక్లో కొనసాగుతుంది. 2వ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు భారత్ అందనంత ఎత్తులో ఉంది. ఇరుజట్లకు మధ్య దాదాపు 800రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది.



## అత్యుత్తమ ఎకానమీ బౌలర్లు

### ఛాంపియన్స్ ట్రోఫీలో.. భారత్ నుండి ఒకే ఒక్కడు

**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించిప ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభమైంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్లో అదరగొట్టిన బౌలర్లు ఉన్నారు. ప్రధానంగా అత్యుత్తమ ఎకానమీ ఉన్న బౌలర్ల జాబితాలో టీమిండియా నుండి ఒకే ఒక్కడు ఉన్నాడు. ఇప్పటిదాకా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యల్ప ఎకానమీ ఉన్న 5గురు బౌలర్ల గూర్చి తెలుసుకుంటే ఈ లిస్టులో టీమిండియా తోపు ప్లేయర్ కూడా ఉన్నాడు. మరి అలాంటి పొదుపు బౌలింగ్ వేసిన టాప్ 5 బౌలర్లలో అరవింద డి సిల్వా ఒకడు. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌ల చరిత్రలో అత్యుత్తమ ఎకానమీ రేటుతో బౌలింగ్ చేసిన బౌలర్ శ్రీలంక గ్రేట్ అరవింద్ గుర్తింపు తెచ్చుకున్నాడు. డిసిల్వా 7 మ్యాచ్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి, రెండు మెయిడెన్ ఓవర్లు వేశాడు. అతను 60 బంతుల్లో 16 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. ఎకానమీ రేటు 1.60గా ఉంది, ఇదే టోర్నీలో అత్యల్పం. పొదుపుగా బౌలింగ్ వేసిన బౌలర్ల లిస్టులో వెస్టిండీస్ ఆటగాడు వేవెల్ హిండ్స్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ దశలో, అతడు 11 మ్యాచ్‌ల్లో 20 ఓవర్లు బౌలింగ్ చేశాడు. వేవెల్ మూడు మెయిడెన్ ఓవర్లు వేసి 51 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టాడు. హిండ్స్ ఎకానమీ రేటు 2.55. అలాగే ఆస్ట్రేలియా లెజెండ్, దివంగత బౌలర్ షేన్ వార్న్ తన స్పిన్‌తో ప్రపంచంలోని గొప్ప బ్యాట్స్‌మెన్‌లను కూడా పడగొట్టాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్‌గా పరిగణించబడే వార్న్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో 3 మ్యాచ్‌లకు గానూ 20.2 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతని ఎకానమీ రేటు 2.95. ఇందులో వార్న్ నాలుగు మెయిడెన్ ఓవర్లు బౌలింగ్ చేసి 122 బంతుల్లో 60 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక దక్షిణాఫ్రికా తరఫున 44 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జస్టిన్ ఒంటాంగ్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు. జస్టిన్ ఒకే ఒక్క నాకౌట్ మ్యాచ్ ఆడాడు. 10 ఓవర్లలో, జస్టిన్ ఒక మెయిడెన్ ఓవర్ వేసి మొత్తం 30 పరుగులు ఇచ్చాడు. ఎకానమీ రేటు 3గా ఉంది. కాగా ఈ జాబితాలో ఉన్న ఏకైక భారతీయ ఆటగాడు రమేష్ పొవార్. జస్టిన్ లాగే, అతడు కూడా ఒకే ఒక్క నాకౌట్ మ్యాచ్ ఆడాడు. 8 ఓవర్లు బౌలింగ్ చేసిన రమేష్ 24 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. పొవార్ ఎకానమీ రేటు కూడా 3గా ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ చరిత్రలో ఐదవ అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు.

## ముంబయి ఇండియన్స్ బోణీ

### గుజరాత్ జెయింట్స్‌పై గెలుపు



**ఢిల్లీ:** మహిళ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ బోణీకొట్టింది. వడోదరలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై 5 వికెట్ల తో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. హార్లీన్ డియోల్ (31 బంతుల్లో 32, 4 ఫోర్లు) బంతికో పరుగు చొప్పున సాధించి, టాప్ స్కోరర్ గా నిలిచింది. హీలీ మథ్యూస్ మూడు వికెట్లతో రాణించింది. ఈ లక్ష్య ఛేదనలో 16.1 ఓవర్లలోనే ఐదు వికెట్లకు 122 పరుగులు చేసి ముంబై పూర్తి చేసింది. వన్ డౌన్ బ్యాటర్ నాట్ స్కివర్ బ్రంట్ ఫిఫ్టీ (39 బంతుల్లో 57, 11 ఫోర్లు)తో సత్తా చాటింది. బౌలర్లలో ప్రియా మిశ్రా, కశ్వీ గౌతమ్ లకు రెండేసి వికెట్లు దక్కాయి. హీలీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. టోర్నీలో గుజరాత్ కిది రెండో పరాజయం కావడం గమనార్హం. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు శుభారంభం దక్కలేదు. 14 పరుగులకే ఓపెనర్లు బేత్ మూనీ, లారా వోల్వార్ట్స్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో హార్లీన్ ఓపికగా ఆడింది. ఆమెతోపాటు కశ్వీ గౌతమ్ (20) కాస్త వేగంగా ఆడటంతో గుజరాత్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. చివర్లో తనూజ కన్వర్, సయాలి సాత్ఘరే తలో 13 పరుగులు జోడించి జట్టుక గౌరవ ప్రదమైన స్కోరును అందించారు. బౌలర్లలో బ్రంట్ , అమెలియా కెర్ కు రెండేసి వికెట్లు, షబ్నిం ఇస్మాయిల్, అమన్జోత్ కౌర్ కు ఒక వికెట్ లభించింది. గుజరాత్ బౌలర్లను ఆటాడుకున్న బ్రంట్ తన ఇన్నింగ్స్ లో ఏకంగా 11 ఫోర్లు బాదడం విశేషం. దీంతో 33 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. ఒక్క ఓవర్ తేడాతో ఆఖర్లో వీరిద్దరూ వెనుదిరిగినా, సజనా, కమలిని జట్టును విజయతీరాలకు చేర్చారు.

## వన్డేలో సరికొత్త చరిత్ర: స్పిన్నర్లతోనే ఓవర్లు

### భారత్ రికార్డు బద్దలు కొట్టిన అమెరికా



**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఓ మ్యాచ్ మొత్తంలో (రెండు ఇన్నింగ్స్‌ల్లో) ఒక్క ఫాస్ట్ బౌలర్ కూడా బౌలింగ్ చేయలేదు. అన్ని ఓవర్లు స్పిన్నర్లే బౌలింగ్ చేశారు. యూఎస్ఏ, ఒమన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన సందర్భం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ చేసిన ఒమన్ అమెరికా బ్యాటింగ్ చేసిన 35.3 ఓవర్లు స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించింది. అనంతరం అమెరికా సైతం ఒమన్ బ్యాటింగ్ చేసిన 25.3 ఓవర్లను స్పిన్నర్లతోనే వేయించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 61 ఓవర్లు జరగ్గా, అన్నింటినీ స్పిన్నర్లే వేశారు. వన్డే క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఈ మ్యాచ్లో మరో రికార్డు వరల్డ్ రికార్డు కూడా నమోదైంది. వన్డేల్లో అతి తక్కువ స్కోర్ను (122) డిఫెండ్ చేసుకున్న జట్టుగా అమెరికా సరికొత్త చరిత్ర సృష్టిం చింది. గతంలో ఈ రికార్డు భారత జట్టు పేరిట ఉండేది. 1985లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 125 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. 40 ఏళ్ల తర్వాత యూఎస్ఏ ఇప్పుడు భారత్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టింది. ఇకఈ మ్యాచ్‌లో ఒమన్‌పైఅమెరికా 57పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 35.3 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. యూఎస్ఏ ఇన్నింగ్స్‌లో మిలింద్ కుమార్ (47 నాటౌట్) టాప్ స్కోరర్గా నిలువగా, ఆండ్రియస్ గౌస్ (14), హర్మీత్ సింగ్ (10), ఆరోన్ జోన్స్ (16), సంజయ్ కృష్ణమూర్తి(16) రెండంకెల స్కోర్లు చేశారు. అనంతరం 123 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఒమన్ అమెరికా స్పిన్నర్ల దెబ్బకు 25.3 ఓవర్లలో 65 పరుగులకే చాప చుట్టేసింది. అమెరికా లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ నోష్తుశ్ కెంజిగేఐదు వికెట్లు తీసి ఒమన్ పతనాన్ని శాశించాడు.

## వాణిజ్యం

## 'ఎక్స్' ప్రీమియం ప్లస్ ధర డబుల్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని సామాజిక మాధ్యమం 'ఎక్స్' తన ప్రీమియం ప్లస్ ధరల్ని భారత్‌లో పెంచింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరల్ని ఏకంగా రెట్టింపు చేసింది. గత మూడు నెలల్లో ఈ ప్లాన్ ధరల్ని పెంచడం ఇది రెండో సారి. గ్రోక్ 3 ఏఐ మోడల్‌ను విడుదల చేసిన తర్వాత ప్లాన్ ధరల్ని పెంచడం విశేషం. మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్ఏఐ, గ్రోక్ 3 సేవల్ని తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏఐ మోడల్ సామర్థ్యాలు వినియోగించాలంటే ఎక్స్‌లో ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని కంపెనీ లాంచింగ్ సమయంలో తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్లాన్ ధరల్ని పెంచింది. ఇప్పటి వరకు ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధర భారత్‌లో నెలకు రూ.1,750 ఉండేది. తాజాగా దీన్నిరూ.3,470కి పెంచింది. ఇక యేడాది ప్లాన్ ధర రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది. అంటే ధరల్ని దాదాపు రెట్టింపు చేసింది. తన ప్లాట్ ఫామ్ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లోనే తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. తొలుత ప్లాన్ ధర రూ.1300గా ఉండేది. ఆ తర్వాత గతేడాది



డిసెంబరులో దాని ధరను రూ.1750కి పెంచింది. తాజాగా ఈ ధరను రూ.3,470కు చేర్చింది. ఇతర ప్లాన్ల ధరలను మాత్రం అలాగే ఉంచింది. ఎక్స్‌లో బేసిక్, ప్రీమియం, ప్రీమియం ప్లస్ పేరిట మూడు రకాల ప్లాన్లు అందిస్తోంది. బేసిక్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా ఉంది. ఇక ప్రీమియం ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్-ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం ప్రీమియం ప్లాన్లలో లభిస్తుంది.

## ఎల్ఐసి పెట్టుబడుల్లో రూ.84వేల కోట్లు హాంఫట్

**ముంబై, ఫిబ్రవరి 19:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా తమ విలువను కోల్పోయాయి. గరిష్టాల నుంచి 10 శాతానికిపైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) తరలిపోవడం, వాణిజ్య యుద్ధభయాలు వంటివి ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో దలాల్ స్ట్రీల్‌లో పెట్టుబడులు పెట్టిన వారి పోర్ట్‌ఫోలియోల్లో నిధులు కరిగిపోతున్నాయి. ప్రముఖ ఇన్వెస్టర్లుగా పేరొందిన టాప్-10 వ్యక్తుల పోర్ట్‌ఫోలియోలు రూ.81వేల కోట్ల విలువను కోల్పోయి, ఎల్ఐసి కూడా పెద్ద మొత్తంలో నష్టపోయింది. ఒకటిన్నర నెలలో ఏకంగా రూ.84వేలకోట్లు కోల్పోయింది. జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసి లిస్టెడ్ కంపెనీల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. స్టాక్ మార్కెట్లో ఇటీవల కరెక్షన్ కారణంగా ఎల్ఐసి పెట్టుబడుల విలువ జనవరి 1 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.84వేల కోట్లు పడిపోయింది. గతేడాది డిసెంబర్ త్రైమాసికంలో ఎల్ఐసి హోల్డింగ్స్ విలువ రూ.14.72 లక్షల కోట్లుగా ఉంది. 2025 ఫిబ్రవరి 18 నాటికి ఆ విలువ రూ.13.87 లక్షట కోట్లకు చేరింది. అంటే మొత్తం స్టాక్ విలువ రూ.84,247 కోట్లు మేర హరించుకుపోయింది. 2024 డిసెంబరు నాటికి ఎల్ఐసి 330 కంపెనీల్లో ఒక శాతానికి పైగా వాటా కలిగి ఉంది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల్లో మొత్తం మార్కెట్ విలువలో ఈ కంపెనీలే దాదాపు 66శాతం వాటా కలిగిఉన్నాయి. స్టాక్ మార్కెట్ నష్టాల నేపథ్యంలో ఆయా కంపెనీల షేర్ల విలువ క్రమంగా తగ్గుతోంది. ఎల్ఐసి పెట్టుబడులు పెట్టిన వాటిలో ఐటిసి రూ.11,863 కోట్లు, ఎల్అండ్‌టి రూ.6,713 కోట్లు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.5,647 కోట్లు వంటి ప్రధాన కంపెనీల్లో అధిక పెట్టుబడులున్నాయి. వీటితో పాటు టిసిఎస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, హెచ్‌సిఎల్‌టెక్నాలజీస్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐడిబిఐ బ్యాంకుల్లోనూ ఎల్ఐసి పెట్టుబడులు పెట్టింది.

## ఏప్రిల్ నుంచే భారత్‌లో టెస్లా కార్ల సేల్స్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** అమెరికా దిగ్గజ 'ఇవి' కంపెనీ టెస్లా, భారత్‌లో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఈ సంస్థ ఇక్కడ నియామకాలు ప్రారంభించిన విషయం విదితమే. షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇక ఈ యేడాది ఏప్రిల్ నుంచి భారత మార్కెట్లో టెస్లా 'ఇవి' విక్రయాలు ప్రారంభం కానున్నట్లు తాజాగా కొన్ని కథనాలు వెలువడ్డాయి. వీటి ప్రారంభ ధర రూ.21 లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి కంపెనీ రిటైల్ కార్యకలాపాలను మాత్రమే ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెల్లడించాయి. జర్మనీలోని బెర్లిన్ ప్లాంట్ నుంచి 'ఇవి) కార్లను దిగుమతి చేసుకుని భారత్ మార్కెట్లో విక్రయించేందుకు టెస్లా సన్నాహాలు ప్రారంభించినట్లు తెలిసింది. షోరూంల ఏర్పాటు కోసం ముంబైలోని బికెసి బిజినెస్ డిస్ట్రిక్ట్, న్యూఢిల్లీలోని ఏరోసిటీ ప్రాంతాలకు ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. తొలుత 25వేల డాలర్ల వరకు విలువ చేసే ఎలక్ట్రిక్ వాహనాలను టెస్లా విక్రయించనున్నట్లు కూడా తెలిసింది. ప్రస్తుతానికి భారత్‌లో 'ఇవి'ల తయారీపై టెస్లా ఇంకా ఎలాంటి స్పష్టతనివ్వలేదు. అయితే భారత ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుల నుంచి విడిభాగాలను కొనుగోళ్లను మరింత పెంచుకోవాలని కంపెనీ ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపింది.




## వడ్డీరేట్లను సవరించిన డిసిబి బ్యాంకు

**ముంబై, ఫిబ్రవరి 19:** ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన డీసీబీ బ్యాంక్ కొన్ని కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 65 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. సవరించిన రేట్లు అమల్లోకివచ్చాయి. ఫిబ్రవరి ఎంపీసీ సమావేశం 2025లో ఆర్‌బీఐ తన రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50శాతం నుండి 6.25 శాతానికి తగ్గించాలని నిర్ణయించాక ఎఫ్‌డీ రేట్లలో సవరణ వచ్చింది. ఐదేళ్ల తర్వాత బెంచ్‌మార్క్ లెండింగ్ రేటులో మొదటి సారి కోత విధించారు. రెపో రేటు తగ్గుదల బ్యాంకుల నిధుల ఖర్చును తగ్గిస్తుంది. కాబట్టి రుణాలు, డిపాజిట్ రేట్లు ప్రభావితమవుతాయి. రెపో రేటు తగ్గడం వల్ల బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు తగ్గిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో డీసీబీ బ్యాంకు తాజా వడ్డీరేట్ల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. డీసీబీ బ్యాంక్ ప్రస్తుతం 7రోజుల నుండి 10 సంవత్సరాల వరకు టెన్యూర్‌కు అనుగుణంగా రూ. 3కోట్ల కంటే తక్కువ ఎఫ్‌డీలపై సాధారణ పౌరులకు 3.75 శాతం నుంచి 8.05 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. 19 నుండి 20 నెలల వ్యవధి కలిగిన ఎఫ్‌డీలకు అత్యధిక వడ్డీ రేటు 8.05 శాతం అందిస్తుంది. రూ.3కోట్ల లోపు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 4.25 శాతం నుంచి 8.55 శాతం వరకు వడ్డీరేట్లను అందిస్తుంది. 19నుంచి 20 నెలల టెన్యూర్ డిపాజిట్లకు అయితే 8.55 శాతం వడ్డీను అందిస్తుంది. అలాగే సాధారణ పౌరులకు 26 నెలల కంటే ఎక్కువ కానీ 37 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉన్న ఎఫ్‌డీ వడ్డీ రేటును 55 బేసిస్ పాయింట్లు తగ్గించారు. అంటే 8.05 శాతం నుంచి 7.50 శాతానికి తగ్గించారు. 37 నుంచి 38 నెలల మధ్య కాలపరిమితితో వచ్చే ఎఫ్‌డీల వడ్డీరేటును 8.05శాతం నుంచి 7.85శాతానికి తగ్గించారు. అదనంగా డీసీబీబ్యాంక్ 38నెలల కంటే ఎక్కువ కానీ 61 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉన్న ఎఫ్‌డీ వడ్డీరేటును 65 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అంటే 8.05 శాతం నుంచి 7.40 శాతానికి తగ్గాయి.




## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం నష్టాలతో ట్రేడింగ్ మొదలుపెట్టిన సూచీలు, ఒడుదుడులకు లోనయ్యాయి. రోజంతా లాభనష్టాల మధ్య చలించిన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిసాయి. ఉదయం 75,787.27 పాయింట్ల వద్ద నష్టంతో ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు, ఇంట్రాడేలో 75,581 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి 28 పాయింట్లు తగ్గి 75,939పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 12 పాయింట్లు నష్టపోయి 22,932 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇన్ఫోసిస్, టిసిఎస్, హిందుస్థాన్ యూని లీవర్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఎన్‌టిపిసి, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.30 డాలర్ల వద్ద ట్రేడయింది.




## 5% ప్రీమియంతో హెక్సావేర్ టెక్నాలజీస్ లిస్టింగ్

**ముంబై, ఫిబ్రవరి 19:** ఐటి సేవల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేర్లు బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. ఐటి సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఒగా వచ్చిన ఈ కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.708తో పోలిస్తే ఎన్ఎస్ఇలో 5శాతం ప్రీమియంతో రూ.745.50 వద్ద లిస్టయ్యాయి. ఇన్వెస్టర్లకు స్వల్ప లాభాల్ని తెచ్చిపెట్టాయి. ఇక బిఎస్ఇలో రూ.731 వద్ద ప్రారంభమయ్యాయి. ముంబై కేంద్రంగా సేవలందిస్తున్న హెక్సావేర్ టెక్నాలజీస్ రూ.8,750 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. ఈ ఐపిఒను పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌లో నిర్వహించింది. ధరల శ్రేణిని రూ.674-708గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తంగా 2.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 9.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 0.20శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 0.11 రెట్లు మాత్రమే సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఐటి సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఒ ఇదే కావడం విశేషం. రెండు దశాబ్దాల క్రితం టిసిఎస్ రూ.4,700 కోట్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.